
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 260
సోమవారం 11-12-2023
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'


తొలి మ్యాచ్ వర్షార్పణం
వాన కారణంగా భారత్-దక్షిణాఫ్రికా మధ్య తొలి టి20 రద్దు అయింది -12లో


ఆరోగ్య బీమా భారం తగ్గేదెలా?
కోపేమెంట్, డిడక్టబుల్‌తో తక్కువ ప్రీమియం -13లో


బాలీవుడ్ తారలకు నోటీసులు
పొగాకు కంపెనీల ఉత్పత్తులకు ప్రచారం చేసినందుకు షారుక్‌ఖాన్, అక్షయ్‌కుమార్, అజయ్ దేవ్‌గణ్‌లకు కేంద్రం నోటీసులిచ్చింది.
వివరాలు 6లో ▸


ఛత్తీస్‌గఢ్ సీఎంగా విష్ణుదేవ్
ఛత్తీస్‌గఢ్ శాసనసభాపక్ష నేతగా ఆదివాసీ నేత విష్ణుదేవ్ సాయ్‌ను బీజేపీ ఎమ్మెల్యేలు ఆదివారం ఎన్నుకున్నారు.
వివరాలు 6లో ▸


వారసుడిగా మేనల్లుడు
బీఎస్పీ అధినేత్రి మాయావతి తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను రాజకీయ వారసుడిగా ఆదివారం ప్రకటించారు.
వివరాలు 6లో ▸


ద.అమెరికాలోనూ యుద్ధమే!
రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-పాలస్తీనా తరహాలో గయానా-వెనిజులా మధ్య యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి.
వివరాలు 6లో ▸

మూడింటిపై ఫోకస్

రైతుబంధు, రుణమాఫీతోపాటు నామినేటెడ్ పోస్టులపై రాష్ట్ర సర్కారు కసరత్తు

- రుణమాఫీపై బ్యాంకులతో చర్చలకు సిద్ధం
- ఐదేళ్లపాటు నెలకు రూ.600 కోట్లు చెల్లింపు?
- రూ.30వేల కోట్లు అసలు.. రూ.6 వేల కోట్లు వడ్డీ అవుతుందని అంచనా
- ఈ నెల 15లోపు రైతుబంధు జమ?
- పార్టీ నేతలకు నామినేటెడ్ పదవుల పంపకాలపైనా దృష్టి..
- టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల జాబితా తెప్పించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్‌గా వేం నరేందర్‌రెడ్డికి చాన్స్!..
- కోదండరాంతోపాటు ఆకునూరి మురళి సేవలు వినియోగించుకునే యోచన



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రాష్ట్ర పాలనా వ్యవహారాల్లో బహుముఖ వ్యూహంతో ముందుకెళ్తున్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే రెండు హామీలను అమల్లోకి తేగా.. ఇప్పుడు రైతులకు సంబంధించిన అంశాలపై ఫోకస్ చేశారు. రైతు బంధు, రుణమాఫీలను వీలైనంత త్వరగా కొలిక్కి తెచ్చే యోచనలో రేవంత్ ఉన్నారని సీఎంవో వర్గాలు చెప్తున్నాయి. వీటితో పాటు నామినేటెడ్ పోస్టుల భర్తీపైనా ఆయన దృష్టి సారించారని అంటున్నాయి. ఇందులో భాగంగానే తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) నుంచి ముఖ్య నేతల పేర్లు, టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల పేర్లను తెప్పించుకుని.. పదవుల పంపిణీపై కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. నామినేటెడ్ పదవుల్లో భాగంగా ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ హోదాపై స్పష్టత వచ్చిందని, తనకు సన్నిహితుడైన మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్ రెడ్డికి ఈ పదవి ఇవ్వాలని రేవంత్ నిర్ణయించుకున్నారని గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి.

బ్యాంకులకు వాయిదాలు.. రైతులకు ఒకేసారి

రైతుల పంట రుణాల మాఫీ విషయంలో సీఎం రేవంత్ ఒక ఆలోచనకు వచ్చినట్టు సీఎంవో వర్గాల్లో చర్చ జరుగుతోంది. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన నేపథ్యంలో.. అందుకు అవసరమైన మొత్తాన్ని ఎలా సర్దుబాటు చేయాలన్న దానిపై రేవంత్ పలు ప్రతిపాదనలను
మిగతా 2వ పేజీలో ▶


సీఎం క్యాంప్ ఆఫీస్‌గా

ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ!

మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- అధికారులు, ఫ్యాకల్టీతో భేటీ.. సంస్థ కార్యకలాపాల గురించి వాకబు
- ప్రస్తుతం జూబ్లీహిల్స్‌లోని సొంతింట్లోనే సీఎం.. ప్రజాభవన్ వినియోగానికి విముఖత
- సీఎం క్యాంపు కార్యాలయాన్ని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీకి తరలించే యోచన.. అదే జరిగితే అక్కడి శిక్షణ సంస్థను ప్రజాభవన్‌కు మార్చే అవకాశం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని సమాయత్తం చేయడంపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి దృష్టి సారించారు. అందులో భాగంగా ఆదివారం మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి కేంద్రాన్ని (ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ) సందర్శించారు. అక్కడి బోధన సిబ్బందితో సమావేశమయ్యారు. సంస్థ కార్యకలాపాల గురించి వాకబు చేశారు. ఉద్యోగులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ డీజీ డాక్టర్ శశాంక్ గోయల్ సంస్థ కార్యకలాపాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రేవంత్‌కు వివరించారు. అనంతరం సంస్థలోని వివిధ బ్లాకులను రేవంత్‌రెడ్డి సోలార్ పవర్ వాహనంలో కలియతిరుగుతూ పరిశీలించారు. సీఎం వెంట రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభి వృద్ధి, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, హైదరాబాద్
మిగతా 2వ పేజీలో ▶

త్వరగా కోలుకోవాలి.. అసెంబ్లీకి రావాలి

- మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి పరామర్శ.. ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- మరో 2–3 రోజుల్లో కేసీఆర్ డిశ్చార్జి అయ్యే అవకాశం

2లో


యశోద ఆస్పత్రిలో కేసీఆర్‌ను పరామర్శిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో కేటీఆర్

న్యూస్‌రీల్

ఫైళ్లు మాయంపై దర్యాప్తు జరగాల్సిందే



రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఫైళ్లు మాయం కావడంపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేయించాలని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఘటనలకు సంబంధించి విచారణ చేపట్టి బాధ్యులు ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.
- వివరాలు 3లో▶

ఐడీ లేక.. వేతనం రాక..



గ్రామ రెవెన్యూ అసిస్టెంట్ వ్యవస్థను రద్దు చేసిన గత ప్రభుత్వం వారిని వివిధ శాఖల్లో సర్దుబాటు చేసి నాలుగు నెలలు గడుస్తున్నా ఎంప్లాయ్ ఐడీ ఇవ్వకపోవడంతో వేతనాలు అందడం లేదు. జీతాల కోసం రాష్ట్రంలో 14,954 మంది వీఆర్‌ఏలు ఎదురు చూస్తున్న దుస్థితి నెలకొంది.
- వివరాలు 5లో▶

ఏడాదిలో 119 మంది ఖైదీల ఆత్మహత్య



దేశవ్యాప్తంగా అన్ని జైళ్లలో కలిపి 2022లో 119 మంది ఖైదీలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరిలో 109 మంది ఉరి వేసుకున్నారు. తెలంగాణలోని అన్ని జైళ్లలో కలిపి 11 మంది ఖైదీలు సహజ మరణం పొందగా ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారని జాతీయ నేర గణాంకాల సంస్థ తెలిపింది.
- వివరాలు 5లో▶

శాసనసభ పాత భవనం పునరుద్ధరణ



- అందులోనే మండలి, సెంట్రల్ హాల్
- సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం
- ఎల్పీ కార్యాలయాలున్న భవనం తొలగించి ఉద్యానవనం ఏర్పాటు
- పబ్లిక్ గార్డెన్‌కు మళ్లీ పర్యాటక కళ
- బయటకు కన్పించేలా గాంధీ విగ్రహం ఏర్పాటు
- ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెల్లడి

2లో

హైదరాబాద్-విజయవాడ హైవేను ఆరు వరుసలకు విస్తరిస్తాం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడి
- ఈ ప్రాజెక్టును రెండేళ్లలోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం
- కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి 14 పెండింగ్ ప్రతిపాదనలపై చర్చిస్తా
- రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా సచివాలయంలో బాధ్యతల స్వీకరణ

- వివరాలు 3లో▶

పదోన్నతులకు టెట్ చిక్కులు

అర్హత పరీక్ష పాసైతేనే టీచర్లకు పదోన్నతులు

- తాజాగా తేల్చి చెప్పిన కేంద్ర విద్యాశాఖ
- రాష్ట్రంలో 90 వేల మందికి ఆ అర్హత లేదు
- అంతర్గత పరీక్షే ఏకైక మార్గమంటున్న ఉపాధ్యాయ సంఘాలు
- ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: విద్యాశాఖలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఇప్పుడు సమస్యగా మారింది. దీనిపై ప్రభుత్వం స్పష్టమైన విధానం వెల్లడించకపోతే పదోన్నతులు క్లిష్టంగా మారనున్నాయి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పాఠశాల విద్యాశాఖాధికారులు ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ సంఘాలు కూడా ముందుగా దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాయి. వీలైనంత త్వరగా డిపార్ట్‌మెంటల్ పరీక్ష తరహాలో దీన్ని నిర్వహించాలని సూచిస్తున్నాయి. టెట్ చేపట్టమని ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినా అధికారులు పెద్దగా పట్టించుకోలేదని, దీనివల్ల తాము నష్టపోయామని పేర్కొంటున్నాయి. జాతీయ విద్యా విధానం–2020 అమలుకు సిద్ధమవుతున్న నేపథ్యంలోనూ టెట్ అర్హతకు ప్రాధాన్యత పెరిగిందని వారు అంటున్నారు.

ఎప్పుడో చెప్పిన కేంద్రం

ప్రతి ఉపాధ్యాయుడు విధిగా టెట్ పాసవ్వాలని కేంద్రం 2012లోనే నిబంధన విధించింది. పాసైన వారికే పదోన్నతులు కల్పించాల్సి ఉంటుంది. వాస్తవానికి 2012కు ముందు రాష్ట్రంలో టెట్ లేదు. జిల్లా నియామక మండలి పరీక్ష ద్వారానే టీచర్ల ఎంపిక జరిగింది. అందువల్ల అనేక మందికి టెట్ అర్హత ఉండే అవకాశం లేదని రాష్ట్రం ఉమ్మడిగా ఉన్నప్పుడు ప్రభుత్వం కేంద్రానికి నివేదించింది. టెట్ తప్పనిసరి నుంచి మినహాయింపు పొందింది. రాష్ట్రావిర్భావం తర్వాత కూడా ఇదే విధానం కొనసాగుతోంది. తాజాగా దీనిపై కేంద్రం మళ్ళీ స్పందించింది. ఉపాధ్యాయులందరికీ టెట్ తప్పనిసరి చేయాలని సూచించింది. ఈ నేపథ్యంలో
మిగతా 2వ పేజీలో ▶

ఇప్పుడేం చేద్దాం...!

- హిందూత్వ ఎజెండాను మరింతగా ఎత్తుకోవాల్సిందా..
- బీసీ సీఎం నినాదం పనిచేయక పోవడానికి కారణాలేంటి?
- బయటి నేతలకు బాధ్యతలు అప్పగించడం వల్ల నష్టపోయామా..
- బండి సంజయ్ నుంచి పార్టీ పగ్గాలు తప్పించడం చేటుచేసిందా!
- పార్టీ కొత్త రాష్ట్ర అధ్యక్షుడిగా ఎవరైతే బాగుంటుంది?
- లోక్‌సభ ఎన్నికల్లోనైనా సరైన ఫలితాలకు ఏం చేయాలి?
- బీజేపీ నేతల్లో అంతర్మథనం.. శ్రేణుల్లో అంతర్గత చర్చ

3లో

వంద రోజుల్లో అమల్లోకి అన్ని గ్యారంటీలు..

- సంపద సృష్టించి పేదలకు పంచుతాం: డిప్యూటీ సీఎం భట్టి
- ఖమ్మంలో ముగ్గురు మంత్రులకు ఘన సన్మానం


ఆదివారం కూసుమంచి మండలం నాయకన్‌గూడెం వద్ద మంత్రులు భట్టి, పొంగులేటి, తుమ్మలకు గజమాలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

ఖమ్మం వన్‌టౌన్: రాష్ట్రంలో సంపద సృష్టించి పేదలకు పంచడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆదివారం ఆయన ఖమ్మంలోని డీసీసీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహిళా సాధికారతకు తొలి అడుగు వేస్తూ మహాలక్ష్మి పథకం ద్వారా బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామనీ, పేదల కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ. 10 లక్షలకు పెంచామని వెల్లడించారు. రానున్న వంద రోజుల్లో మిగిలిన నాలుగు గ్యారంటీలను అమలు చేస్తామని, అన్ని వర్గాల ప్రజలకు సంపదను పంచి ఇందిరమ్మ రాజ్యం తెస్తామని భరోసానిచ్చారు.

రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, మాజీ మంత్రి ఒకరు ఇంగితజ్ఞానం లేకుండా రెండు రోజులు గడవక ముందే తమ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని, కొంచెమైనా జ్ఞానం ఉందా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల సొమ్మంతా తిన్నారని, అదంతా కక్కించి తీరుతామని స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరిగిన అనేక అవకతవకలు, లోటుపాట్లను సరిదిద్దుకుంటూ ముందుకు సాగుతామని, రాష్ట్రం నష్టాల్లో
మిగతా 2వ పేజీలో ▶

ఇదంజగత్


మీకు దండం పెడతా! మొత్తం డబ్బు ఎంతో చెప్పి పుణ్యం కట్టుకోండి!!

కర్ణిసేన చీఫ్ హత్య కేసు..

ఇద్దరు షూటర్లు సహా ముగ్గురి అరెస్ట్



అరెస్టయిన నిందితులు

న్యూఢిల్లీ/జైపూర్: శ్రీ రాష్ట్రీయ కర్ణిసేన చీఫ్ సుఖ్‌దేవ్ సింగ్ గోగామెడి హత్య కేసుకు సంబంధించి ఇద్దరు షూటర్లు సహా ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 5న రాజస్తాన్ రాజధాని జైపూర్‌లోని తన సొంతింట్లోనే గోగామెడిని దుండగులు కాల్చి చంపారు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా జైపూర్‌కు చెందిన రోహిత్ రాథోడ్, హరియాణాలోని మహేంద్రగఢ్ వాసి నితిన్ ఫౌజీ అనే వారే కాల్పుల ఘటనలో పాల్గొన్నట్లు నిర్ధారణకు వచ్చారు. రాజస్తాన్, ఢిల్లీ క్రైం బ్రాంచి పోలీసులు జాయింట్ ఆపరేషన్ చేపట్టి, చండీగఢ్‌లోని 24వ సెక్టార్‌లోని ఓ హోటల్‌లో ఉండగా వీరిద్దరితోపాటు తప్పించుకునేందుకు సహకరించిన ఉద్ధమ్ సింగ్ అనే వ్యక్తిని పట్టుకున్నారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం వీరిని జైపూర్ పోలీసులకు అప్పగించనున్నారు. గోగామెడిని చంపేందుకు షూటర్లను కాంట్రాక్టుకు కుదిర్చిన రాంవీర్ అనే వ్యక్తిని శనివారం జైపూర్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

విదేశాలకు వెళ్లేందుకు పథకం

'గోగామెడిని చంపిన అనంతరం నిందితులిద్దరూ నకిలీ గుర్తింపు పత్రాలతో చండీగఢ్‌లోని ఓ హోటల్‌లో బస చేశారు. అక్కడి నుంచి విదేశాలకు వెళ్లేందుకు పథకం వేసినట్లు భావిస్తున్నాం. హత్యకు ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకోవాల్సి ఉంది' అని పోలీసులు చెప్పారు. నాలుగేళ్ల క్రితం ఆర్మీలో చేరేందుకు శిక్షణ తీసుకుంటున్న సమయంలో నితిన్ ఫౌజీ, ఉద్ధమ్ సింగ్‌లకు పరిచయం ఏర్పడినట్లు తెలిపారు. గతంలో ఫౌజీపై కిడ్నాప్ కేసు, పోలీసు అధికారిపై దాడి కేసులతో సంబంధముంది. రాథోడ్‌కు కూడా నేరచరిత్ర ఉంది. జైలుకెళ్లి వచ్చాడు. రోహిత్ గోదారా ఆదేశాల మేరకు గోగామెడి హత్యకు వీరేంద్ర చరణ్ అనే వ్యక్తి పథక రచన చేసినట్లు అనుమానిస్తున్నారు. గోగామెడిని చంపినందుకు గాను రాథోడ్, ఫౌజీలకు చెరో రూ.50 వేలు ముట్టినట్లు చెబుతున్నారు. నకిలీ వీసాలు, పాస్‌పోర్టులు తయారయ్యే వరకు అజ్ఞాతంలో గడపాలని వీరు నిర్ణయించుకున్నట్లు సమాచారం. చండీగఢ్ నుంచి గోవాకు అక్కడి నుంచి దక్షిణాది రాష్ట్రాలకు వెళ్లేందుకు వీరు పథకం వేసుకున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఆర్మీలో పనిచేస్తూ సెలవుపై మహేంద్రగఢ్‌లోని సొంతింటికి వచ్చిన ఫౌజీ, మళ్లీ విధుల్లో చేరకుండా హరియాణాలో నేరాలకు పాల్పడుతున్నట్లు వివరించాయి.

పదోన్నతులకు టెట్ చిక్కులు

▶ మొదటి పేజీ తరువాయి

ఈ ఏడాది ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టారు. ఎన్నికల ముందు జరిగిన ఈ ప్రక్రియపై కొంతమంది కోర్టును ఆశ్రయించారు. టెట్ అర్హత ఉంటేనే పదోన్నతి కల్పించాల్సి ఉంటుందనే నిబంధనను కోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో కోర్టు పదోన్నతులపై స్టే ఇచ్చింది. దీనిపై నిర్ణయం తీసుకునేలోపే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.

ఖాళీలు తెలిసేందుకూ వీల్లేదు!

రాష్ట్రంలో టెట్ ఉత్తీర్ణులు 4 లక్షల మంది ఉన్నారు. వీళ్లంతా ఉపాధ్యాయ పోస్టుల కోసం నిరీక్షిస్తున్న నిరుద్యోగులు. కాగా ప్రభుత్వ టీచర్లు 1.05 లక్షల మంది ఉన్నారు. వీరిలో 2012 తర్వాత రిక్రూట్ అయిన 15 వేల మందికి మాత్రమే టెట్ అర్హత ఉంది. అంటే దాదాపు 90 వేల మంది టీచర్లకు అర్హత లేదు. దీంతో వీళ్లు పదోన్నతులు పొందేందుకు అవకాశం ఉండదు. ఎస్‌జీటీలను స్కూల్ అసిస్టెంట్లుగా, స్కూల్ అసిస్టెంట్లను హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించాల్సి ఉంటుంది. అయితే పదోన్నతుల ప్రక్రియ ఆగిపోవడంతో కచ్చితమైన ఖాళీలు తెలిసే వీల్లేకుండా పోయింది. దీంతో టీచర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియకూ బ్రేకులు పడుతున్నాయి. దీన్ని నివారించేందుకు 80 వేల మంది టీచర్లకు డిపార్ట్‌మెంట్ టెస్ట్ మాదిరి అంతర్గతంగా టెట్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. ఇదొక్కటే ప్రస్తుతం ఉన్న మార్గమని సూచిస్తున్నారు. ఏప్రిల్ లోపు ఈ తరహా టెట్ నిర్వహిస్తే.. వచ్చే జూన్, జూలైలో పదోన్నతులు చేపట్టేందుకు వీలుంటుందని చెబుతున్నారు. అయితే ప్రభుత్వం దృష్టి పెడితే తప్ప ఈ సమస్య పరిష్కారమయ్యే అవకాశం కన్పించడం లేదు.

టెట్ కోసం కొత్త ప్రభుత్వాన్ని కోరతాం

ప్రభుత్వ టీచర్ల పదోన్నతులకు అడ్డంకిగా మారిన టెట్ నిర్వహించడం తప్పనిసరి. ఎంతోమందికి పాఠాలు చెప్పిన టీచర్లకు అంతర్గత టెట్ విధానం అమలు చేయడం ఇబ్బంది కూడా కాదు. వారు తేలికగానే ఈ పరీక్షలో అర్హత పొందుతారు. తక్షణమే టెట్ చేపట్టి, పదోన్నతులు కల్పించాలని కొత్త ప్రభుత్వాన్ని కోరతాం.

\- చావా రవి (టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

శాసనసభ పాత భవనం

పునరుద్ధరణ

అందులోనే శాసనమండలి, సెంట్రల్ హాల్

- సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం
- ఎల్పీ కార్యాలయాలున్న భవనం తొలగించి ఉద్యానవనం ఏర్పాటు
- పబ్లిక్ గార్డెన్‌కు మళ్లీ పర్యాటక కళ
- బయటకు కన్పించేలా గాంధీ విగ్రహం ఏర్పాటు
- ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: శాసనసభ, శాసనమండలి, సెంట్రల్ హాల్ ఒకే భవన సముదాయంలో ఉండేలా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ప్రస్తుతం జూబ్లీ హాలులో ఉన్న శాసనమండలిని, పాత భవనంలోకి మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. జూబ్లీహాలును మళ్లీ పునరుద్ధరించి, శాసనసభ, శాసన మండలి, సెంట్రల్ హాలును పాత పద్ధతిలో ఏర్పాటు చేయటంతో పాటు, ఆ ప్రాంగణాన్ని సుందరీకరించటం ద్వారా నగరంలో ఒక ప్రధాన పర్యాటక ప్రాంతంగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్అండ్ బీ అధికారులతో కలిసి శాసనసభ ప్రాంగణాన్ని పరిశీలించి మార్పుచేర్పులపై చర్చించనున్నారు. సీఎంతో భేటీ అనంతరం రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ వివరాలను వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన నాలుగు రోజుల్లోనే ఇలాంటి కీలక నిర్ణయం తీసుకోవటం విశేషం.

సెంట్రల్ హాల్‌గా ఏపీ అసెంబ్లీ భవనం

గతంలో శాసనసభ, శాసనమండలి ఒకే భవనంలో కొనసాగేవి. ఆ భవనం పాతబడటంతో ప్రస్తుత శాసనసభ కొనసాగుతున్న భవనాన్ని నిర్మించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇదే భవనం కొనసాగింది. పాత భవనంలో శాసనమండలిని నిర్వహించారు. రాష్ట్ర విభజన తర్వాత పాత భవనంలోని హాలును ఏపీకి కేటాయించారు. అక్కడ శాసనసభ, శాసనమండలి నిర్వహించాల్సి రావటంతో, తెలంగాణ శాసనమండలిని జూబ్లీహాలులోకి మార్చారు. ఇప్పుడు పాత భవనాన్ని పూర్తిగా పునరుద్ధరించనుండటంతో, జూబ్లీ హాలులోని శాసనమండలిని తిరిగి పాత మండలి భవనంలోకే మారుస్తారు. ఏపీకి కేటాయించిన శాసనసభ భవనాన్ని స్వాధీనం చేసుకుని దాన్ని సెంట్రల్ హాల్‌గా మారుస్తారు.

ఇక కొత్త భవనం వెలుపల ఉన్న ప్రధాన రాజకీయ పార్టీల శాసనసభా పక్ష కార్యాలయాలు, మీడియా సెంటర్ ఉన్న భవనాన్ని తొలగించాలని నిర్ణయించారు. ఆయా కార్యాలయాలను పాత భవనంలో ఏర్పాటు చేస్తారు. భవనం కూల్చిన ప్రాంతంలో పచ్చిక బయళ్లు ఏర్పాటు చేసి పబ్లిక్ గార్డెన్‌తో అనుసంధానించాలని యోచిస్తున్నారు. గతంలో పబ్లిక్ గార్డెన్‌కు ఎంతో ప్రజాదరణ ఉండేది. సాయంత్రం వేళ ఎంతోమంది సందర్శించి సేద తీరేవారు. తాజాగా మళ్లీ దానికి పర్యాటక కళ తేవాలని కొత్త ప్రభుత్వం భావిస్తోంది.

మహాత్ముడి విగ్రహం ప్రాంతంలో..

శాసనసభ ముందుభాగంలో గతంలో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహం రోడ్డుపైకి అంతగా కనిపించటం లేదని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. రోడ్డుమీద కంచెను ఏర్పాటు చేయటం కూడా దీనికి కారణమైంది. ఇప్పుడు ఆ కంచెను తొలగించి, వీలైతే గాంధీ విగ్రహాన్ని కాస్త ఎత్తు మీదకు మార్చి, ఆ ప్రదేశాన్ని మరింతగా సుందరీకరించి రోడ్డు మీదుగా వెళ్లేవారిని ఆకట్టుకునేలా చేయాలని నిర్ణయించారు. గతంలో జూబ్లీ హాలు ప్రాంగణం సభలు, సందడిగా ఉండేది. శాసనమండలిగా మారిన తర్వాత కళ తప్పింది. ఇప్పుడు దాన్ని మళ్లీ పునరుద్ధరించాలని నిర్ణయించారు.

కొత్త భవనం నిర్మించే యోచన లేనట్టే..?

కొత్త సచివాలయం తరహాలో శాసనసభకు కూడా కొత్త భవనాన్ని నిర్మించాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. సచివాలయ భవనానికి పునాది వేసిన రోజునే, ఎర్రమంజిల్ ప్యాలెస్ ప్రాంగణంలో శాసనసభ సముదాయానికి కూడా పునాది వేశారు. కానీ వారసత్వ కట్టడంగా నిలిచిన ఎర్రమంజిల్ ప్యాలెస్‌ను కూల్చాలన్న నిర్ణయంపై అప్పట్లో విమర్శలు వ్యక్తమయ్యాయి. ఆ అంశం కోర్టు పరిధిలోకి కూడా వెళ్లింది. దీంతో నాటి ప్రభుత్వం వెనక్కి తగ్గింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం పాత భవనాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించటంతో, ఇక వేరే ప్రాంతంలో నిర్మాణానికి తెరపడినట్టేనని అంటున్నారు.

సీఎం క్యాంప్ ఆఫీస్‌గా ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ భవనం!

▶ మొదటి పేజీ తరువాయి

జిల్లా కలెక్టర్, వివిధ విభాగాల ఫ్యాకల్టీ సభ్యులు ఉన్నారు.

ప్రగతిభవన్ రాచరికానికి చిహ్నంగా ఉందంటూ గతంలో విమర్శలు..

సీఎం రేవంత్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంగా ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ భవనాన్ని వినియోగించుకోవాలని భావిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ఆయన ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ భవనాన్ని సందర్శించినట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలవడంతో సీఎంగా అధికార బాధ్యతలు చేపట్టిన రేవంత్.. తన క్యాంపు కార్యాలయంగా మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌ను వినియోగించడానికి ఇష్టపడటం లేదని తెలిసింది. అందుకే సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా జూబ్లీహిల్స్‌లోని సొంత ఇంట్లోనే రేవంత్ నివాసముంటున్నారు. రాచరికానికి చిహ్నంగా ప్రగతి భవన్ ఉందంటూ గతంలో విమర్శించిన రేవంత్.. అధికారంలోకి వచ్చాక దాని పేరును మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌గా మార్చారు. ఈ నేపథ్యంలో సీఎం క్యాంపు కార్యాలయం కోసం ప్రత్యామ్నాయ భవనాన్ని అన్వేషిస్తున్నట్లు తెలిసింది. సువిశాల స్థలంలో ఉన్న ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ భవనంలో నివాసం ఉండేందుకు సకల సదుపాయాలు ఉండటం, భద్రతాపరంగా అనుకూలంగా ఉండటం, పెద్ద సంఖ్యలో వాహనాల పార్కింగ్ కోసం స్థలం ఉండటంతో అధికారులు దీని పేరునే ముఖ్యమంత్రికి సూచించినట్లు సమాచారం. ఒకవేళ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీని సీఎం క్యాంపు కార్యాలయంగా వినియోగిస్తే అక్కడ నిర్వహిస్తున్న శిక్షణ సంస్థను ప్రజాభవన్‌కు తరలించే అవకాశాలున్నట్లు తెలిసింది. ప్రభుత్వం దీనిపై త్వరలో ఓ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది.

వంద రోజుల్లో అమల్లోకి అన్ని గ్యారంటీలు..

▶ మొదటి పేజీ తరువాయి

ఉన్నప్పటికీ ఆరు గ్యారంటీల అమలుకు నిరంతరం శ్రమిస్తామని చెప్పారు. సమావేశంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, పోట్ల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. తొలుత కూసుమంచి మండలం నాయకన్‌గూడెం వద్ద ముగ్గురు మంత్రులకు పార్టీ కార్యకర్తలు ఘనస్వాగతం పలికి గజమాలలతో సత్కరించారు. అక్కడి నుంచి మంత్రులు భారీ కాన్వాయ్‌తో ఖమ్మం చేరుకుని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు.

'నామినేటెడ్' నుంచి 56 మందికి ఉద్వాసన

సాక్షి, హైదరాబాద్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లుగా నామినేటెడ్ పోస్టుల్లో నియమితులైన 56 మందికి కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్వాసన పలికింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్వాసనకు గురైన వారిలో తిప్పన విజయ సింహా రెడ్డి(ఆగ్రోస్), తాటికొండ రాజయ్య(రైతుబంధు సమితి), కొండబాల కోటేశ్వరరావు (సీడ్స్ కార్పొరేషన్), గట్టు తిమ్మప్ప (మార్క్‌ఫెడ్), కంచర్ల రామకృష్ణారెడ్డి(ఆయిల్‌సీడ్), రాజావరప్రసాద్ రావు (కోఆపరేటివ్ యూనియన్), వేద రజని సాయిచంద్(గిడ్డంగుల సంస్థ), పిట్టల రవీందర్/దీటి మల్లయ్య (మత్స్య సహకార), దూదిమెట్ల బాలరాజు(మేకలు, గొర్రెల కార్పొరేషన్), సోమ భరత్‌కుమార్ (డైరీ), పల్లె రవికుమార్(కల్లుగీత), నందికంటి శ్రీధర్(ఎంబీసీ), సర్దార్ రవీందర్ సింగ్(సివిల్ సప్లయిస్), ఆయాచితం శ్రీధర్(గ్రంథాలయ), ఆర్. లింబాద్రి, వి.వెంకటరమణ (ఉన్నత విద్యామండలి), వై.సతీష్‌రెడ్డి(రెడ్కో), వంటేరు ప్రతాప్‌రెడ్డి(అటవీ), అల్లం నారాయణ(మీడియా అకాడమీ), ఎర్రోళ్ల శ్రీనివాస్ (మెడికల్ ఇన్‌ఫ్రా), బొల్లం సంపత్‌కుమార్ గుప్తా(చేతి వృత్తులు), గూడూరి ప్రవీణ్ (పవర్‌లూమ్, టెక్స్‌టైల్స్), ఎం భిక్షపతి(ట్రేడ్ ప్రమోషన్), మహమ్మద్ తన్వీర్(ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్), సముద్రాల వేణుగోపాల్‌చారి (ఇరిగేషన్ డెవలప్‌మెంట్), వి.ప్రకాశ్‌రావు (వాటర్ రిసోర్సెస్), వి.దేవేందర్ రెడ్డి (సోషల్ సెక్యూరిటీ), పి.నారాయణ(కనీస వేతన), సంగం రెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ (కుడా), గుడూరు రామకృష్ణారావు(శాతవాహన అథారిటీ), బి.విజయ్‌కుమార్(స్తంభాద్రి అథారిటీ), సి.ప్రభాకర్ రెడ్డి(నిజామాబాద్ అథారిటీ), మారెడ్డి రవీందర్ రెడ్డి(సిద్దిపేట అథారిటీ), గంజి వెంకటముదిరాజ్(మహబూబ్‌నగర్ అథారిటీ), మహమ్మద్ సలీమ్(హజ్ కమిటీ), ఖాజా ముజీబుద్దీన్(ఉర్దూ అకాడమీ), ఇంతియాజ్ ఇసాక్ (మైనారిటీస్ కార్పొరేషన్), ఉప్పల వెంకటేష్(మిషన్ భగీరథ), నాగుర్ల వెంకటేశ్వర్లు(రుణ విముక్తి), గజ్జెల నగేష్ (బెవరేజెస్), మెట్టు శ్రీనివాస్(రోడ్ డెవలప్‌మెంట్), ముత్తిరెడ్డి యాదిగిరి రెడ్డి(ఆర్టీసీ), ఇస్లావత్ రాంచందర్‌నాయక్(ఎస్టీ ఫైనాన్స్), బండ శ్రీనివాస్(ఎస్సీ కార్పొరేషన్), రమావత్ వల్యానాయక్(గిరిజన్ కార్పొరేషన్), కె.వాసుదేవరెడ్డి(వికలాంగ సహకార), మేడే రాజీవ్ సాగర్(తెలంగాణ ఫుడ్స్), ఆకుల లలిత(మహిళా సహకార), గెల్లు శ్రీనివాస్(పర్యాటక), దీపిక రెడ్డి(సంగీత నాటక), జూలూరి గౌరీశంకర్(సాహిత్య అకాడమీ), ఆంజనేయ గౌడ్(స్పోర్ట్స్ అకాడమీ), మసీవుల్లా ఖాన్(వక్ఫ్‌బోర్డు) ఉన్నారు.

ప్రధానిపై దత్తాత్రేయ మనుమరాలి పద్యం

అభినందించిన మోదీ



హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ మనుమరాలు జశోధర తనపై పఠించిన పద్యాన్ని విని ప్రధాని నరేంద్రమోదీ మంత్రముగ్ధులయ్యారు. జశోధర పద్యపఠనానికి సంబంధించిన వీడియోను బండారు దత్తాత్రేయ ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనిపై ప్రధాని స్పందిస్తూ 'ఆమె మాటలు శక్తికి మూలం' అని పేర్కొన్నారు.

\- సాక్షి, హైదరాబాద్



హోటల్‌లో ఫుడ్ ఆరగిస్తే.. వేలకు వేలు బిల్లు కడుతుంటాం. వెజ్ అయినా, నాన్ వెజ్ అయినా వందల్లోనే మొదలవుతుంది. మరి మన ఇంట్లోనే వండుకుంటే.. ఎంత ఖర్చవుతుంది? నిజానికి బాగా తక్కువే. అందులోనూ సీజన్‌ను బట్టి, కూరగాయలు, చికెన్, మటన్, ఇతర మాంసాహార ధరలను బట్టి ఖర్చు మారిపోతూనే ఉంటుంది. ఈ క్రమంలోనే ప్రఖ్యాత క్రిసిల్ సంస్థ.. వంటల్లో వాడే సరుకుల ధరల ఆధారంగా.. ఇంట్లో వండుకునే ఒక్కో ప్లేట్ ఆహారానికి ఎంత ఖర్చవుతుందనే అంచనాలు వేసింది. దాదాపు ఏడాదిన్నర కాలంలో నెలనెలా సరుకుల ధరలను పరిశీలించి.. సగటు థాలీ (ప్లేట్ భోజనం) ఖర్చు ఎంతెంత అన్న లెక్కలతో తాజాగా ఒక నివేదికను విడుదల చేసింది.

టమాటాలు, ఉల్లి ధరలే కీలకం: క్రిసిల్ సంస్థ వివిధ రకాల మాంసంతోపాటు వంటల్లో వాడే పప్పులు, కూరగాయలు, నూనెలు, మసాలాల ఖర్చునూ కలిపి భోజనం తయారీకి అయ్యే ఖర్చును లెక్కించింది. వంట చేసేందుకు అయ్యే గ్యాస్ ఖర్చునూ కలిపింది. అయితే ప్రధానంగా ఇటీవలి కాలంలో టమాటా, ఉల్లి ధరలు బాగా పెరిగిపోవడం, తర్వాత తగ్గడం నేపథ్యంలో సగటు థాలీ ఖర్చులోనూ హెచ్చుతగ్గులు వచ్చాయని ఈ నివేదిక వెల్లడించింది. భారతదేశంలోని నలుమూలలా ఉన్న రాష్ట్రాల నుంచి ధరల వివరాలు తీసుకుని, సగటు ధరలతో ఈ అంచనాలు వేసినట్టు తెలిపింది.

ఎలాగైతేనేం హోటల్లో ఫుడ్డు తినేకంటే ఇంట్లో వండుకుంటే బాగా డబ్బులు మిగులుతాయనీ నివేదిక చెప్పినట్టే మరి!

ప్లేట్ నాన్ వెజ్ ధర	రూ.లల్లో..	ప్లేట్ వెజ్ ధర
61.4	జూలై 22	26.5
59.8	ఆగస్టు 22	27.2
61	సెప్టెంబర్ 22	28.2
62.7	అక్టోబర్ 22	29
61	నవంబర్ 22	27.7
59.9	డిసెంబర్ 22	26.4
59.7	జనవరి 23	26.4
59	ఫిబ్రవరి 23	25.5
58.9	మార్చి 23	25.3
58.7	ఏప్రిల్ 23	25.2
59.7	మే 23	25.4
60.4	జూన్ 23	26.5
67.6	జూలై 23	34
67.3	ఆగస్టు 23	33.8
60.5	సెప్టెంబర్ 23	27.9
58.4	అక్టోబర్ 23	27.5
61.2	నవంబర్ 23	30.3

\- సాక్షి సెంట్రల్ డెస్క్

కేసీఆర్ త్వరగా కోలుకోవాలి...

అసెంబ్లీకి రావాలి

కేసీఆర్‌ను పరామర్శించిన రేవంత్

- సోమాజిగూడ యశోద ఆస్పత్రికి వెళ్లి కలిసిన సీఎం
- ఆరోగ్య పరిస్థితిపై ఆరా.. అసెంబ్లీకి రావాలని ఆకాంక్ష

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు త్వరగా కోలుకుని శాసనసభకు రావాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం మంత్రి సీతక్క, మాజీ మంత్రి షబ్బీర్ అలీతో కలసి హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద ఆస్పత్రికి వెళ్లిన రేవంత్.. కేసీఆర్‌ను పరామర్శించారు. ఆయనతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అక్కడే ఉన్న మాజీ మంత్రి కేటీఆర్, వైద్యులతోనూ మాట్లాడారు. తర్వాత ఆస్పత్రి బయట రేవంత్ మీడియాతో మాట్లాడారు. ''కేసీఆర్‌ను పరామర్శించాను. క్రమంగా కోలుకుంటున్నారు. ఆయన వైద్యం కోసం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సీఎస్‌ను ఇప్పటికే ఆదేశించాం. కేసీఆర్ త్వరగా కోలుకుని అసెంబ్లీకి రావాలని ఆకాంక్షిస్తున్నా. మంచి ప్రభుత్వ పాలన అందించడానికి ఆయన సూచనలు అవసరం. ప్రజల పక్షాన అసెంబ్లీలో కేసీఆర్ మాట్లాడాల్సిన అవసరముంది. ఆయన త్వరగా కోలుకుని అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనాలని ఆకాంక్షిస్తున్నా..'' అని రేవంత్ అన్నారు.

కేటీఆర్, హరీశ్‌లను కలసిన పొన్నం

మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. యశోద ఆస్పత్రి వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. తన నియోజకవర్గానికి చెందిన ఓ కార్యకర్తను పరామర్శించేందుకు ఆస్పత్రికి వచ్చానని.. అక్కడే ఉన్న కేసీఆర్ కుటుంబ సభ్యులను కలసి మాట్లాడానని పొన్నం ప్రభాకర్ చెప్పారు. కేసీఆర్ ఆరోగ్యంగా ఉన్నారని కేటీఆర్, హరీశ్‌రావు చెప్పారన్నారు. ఇందులో ఎలాంటి రాజకీయాలు లేవని, కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు.

కేసీఆర్‌కు వీహెచ్, కోదండరెడ్డి పరామర్శ

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కాంగ్రెస్ సీనియర్ నేతలు వి.హనుమంతరావు, కోదండరెడ్డి పరామర్శించారు. సోమాజిగూడ యశోద ఆసుపత్రికి ఆదివారం వెళ్లిన ఇద్దరు నేతలు కేసీఆర్‌ను కలిశారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తొలుత కేసీఆర్‌ను కలిసేందుకు ఆసుపత్రి వర్గాలు అనుమతించకపోవడంతో.. మాజీ మంత్రి కేటీఆర్ చొరవ తీసుకుని ఇద్దరు కాంగ్రెస్ నేతలను లోపలికి తీసుకెళ్లారు.

మరో రెండు, మూడు రోజుల్లో కేసీఆర్ డిశ్చార్జ్?

సాధారణంగా తుంటి మార్పిడి సర్జరీ చేయించుకున్న అనంతరం రెండు రోజుల్లోనే డిశ్చార్జ్ చేస్తారు. అయితే వయసు, ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కేసీఆర్ డిశ్చార్జిని కొద్దిగా పొడిగించినట్టుగా తెలుస్తోంది. మరోవైపు ఆయన బాగానే కోలుకుంటున్నారని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆయనకు సాధారణ మందుల వాడకం, సులభమైన వ్యాయామాలు తప్ప మరే ప్రత్యేకమైన వైద్య సేవలూ అవసరం లేదని అంటున్నారు. దీంతో ఆయనను మరో 2, 3 రోజుల్లోనే డిశ్చార్జి చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే పూర్తిగా కోలుకుని తన కార్యకలాపాలు యథావిధిగా నిర్వర్తించేందుకు మరి కొన్ని వారాలు పడుతుందని వైద్యులు అంటున్నారు.



ఆస్పత్రిలో కేసీఆర్ ఆరోగ్య వివరాలను కేటీఆర్, కవితలను అడిగి తెలుసుకున్న వీహెచ్, కోదండరెడ్డి. చిత్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తదితరులు

మూడింటిపై ఫోకస్

▶ మొదటి పేజీ తరువాయి

పరిశీలిస్తున్నట్టు తెలిసింది. రైతులకు బ్యాంకుల్లో ఉన్న రుణమొత్తాన్ని బట్టి నిధులు విడుదల చేస్తూ దశల వారీగా మాఫీ చేయాలా? లేక ఒకేసారి రుణమాఫీ చేస్తున్నట్టు ప్రకటించాలా అన్న దానిపై ఉన్నతాధికారులు, ఆర్థిక శాఖ అధికారులతో చర్చిస్తున్నట్టు సమాచారం. రైతు రుణమాఫీ కోసం మొత్తంగా ఎంత ఖర్చవుతుందన్న దానిపై సీఎం ఇప్పటికే ఓ అంచనాకు వచ్చారని సీఎంవో వర్గాలు చెప్తున్నాయి. అంత మొత్తాన్ని ఒకేసారి విడుదల చేయడం సాధ్యంకాని పరిస్థితుల్లో.. బ్యాంకులతో చర్చించడం ద్వారా రుణమాఫీ అంశాన్ని పరిష్కరించాలనే యోచనలో ఉన్నారని వివరిస్తున్నాయి.

మాఫీ కోసం రూ.36 వేల కోట్లు!

రూ.లక్ష వరకు రుణమాఫీకి రూ.18–19 వేల కోట్ల వరకు అవసరమని.. రూ.2లక్షల వరకు అయితే రూ.30 వేల కోట్లు కావాలని ఆర్థిక శాఖ అధికారులు సీఎంకు వివరించినట్టు తెలిసింది. ఈ మొత్తాన్ని నెలవారీ వాయిదాలుగా బ్యాంకులకు చెల్లించే ప్రతిపాదనపై ముందుకెళ్లాలని ఆయన ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించినట్టు సమాచారం. మొత్తం రూ.30వేల కోట్లను ఐదేళ్లపాటు వడ్డీతో కలిపి చెల్లించాలంటే.. మొత్తంగా రూ.36 వేల కోట్లు అవుతాయన్న అంచనా వేసినట్టు తెలిసింది. దీంతో ప్రతి నెలా రూ.600 కోట్ల చొప్పున ఐదేళ్లపాటు రుణమాఫీ నిధులను బ్యాంకులకు చెల్లించే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఇందుకోసం నోడల్ బ్యాంకును ఏర్పాటు చేసుకోవాలని, అవసరమైతే రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ)తో చర్చించాలని భావిస్తున్నట్టు తెలిసింది. బ్యాంకులకు నెలవారీ వాయిదాల్లో చెల్లించినా.. రైతులకు మాత్రం ఒకేసారి మొత్తం రుణమాఫీ చేసేలా బ్యాంకులను ఒప్పించాలన్నది సీఎం ఆలోచన అని సీఎంవో వర్గాలు చెప్తున్నాయి. ఈ ప్రతిపాదనపై అన్ని వర్గాల నుంచి సానుకూలత వస్తే.. త్వరలోనే ప్రకటన చేయాలని భావిస్తున్నట్టు పేర్కొంటున్నాయి.

15వ తేదీకల్లా రైతు బంధు..

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఇప్పటికే ఆ శాఖ అధికారులతో చర్చించిన సీఎం రేవంత్.. వీలైనంత త్వరగా రైతుబంధు సొమ్ము విడుదల చేసేలా నిధులు సమీకరించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రచార సమయంలో రైతుబంధు విడుదలకు ఈసీ అనుమతించి, తర్వాత నిలిపివేసిన విషయం తెలిసిందే. దాంతో తాము డిసెంబర్ 9న అధికారంలోకి వస్తామని, తర్వాత 10 రోజుల్లో రైతుబంధు సొమ్మును జమ చేస్తామని పీసీసీ చీఫ్ హోదాలో రేవంత్ హామీ ఇచ్చారు. ఈ మేరకు 19వ తేదీనాటికి రైతుబంధు నిధులను విడుదల చేయాల్సి ఉంది. అంతకు నాలుగు రోజుల ముందే, అంటే ఈ నెల 15వ తేదీకల్లా సుమారు 70లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7 వేల కోట్లను జమ చేయాలని సీఎం భావిస్తున్నట్టు తెలిసింది.

నామినేటెడ్ పదవులపై కసరత్తు

ఓ వైపు పాలన, మరోవైపు పథకాల అమలుపై దృష్టి సారించిన సీఎం రేవంత్.. వాటికి సమాంతరంగా నామినేటెడ్ పదవుల భర్తీపై కసరత్తు చేస్తున్నారు. పదేళ్లుగా అధికారానికి దూరమై ప్రభుత్వ పదవుల కోసం ఎదురుచూస్తున్నవారు, గత ఎన్నికల్లో పోటీ అవకాశం రాని నేతలను నామినేటెడ్ పదవుల్లో నియమించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు గాంధీభవన్ నుంచి ముఖ్య నేతలు, టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాల నేతల పేర్లను తెప్పించుకున్నారని టీపీసీసీ వర్గాలు తెలిపాయి. పార్టీలోని నేతలతోపాటు పార్టీకి అండగా నిలిచిన బయటి ముఖ్యుల సేవలనూ వినియోగించుకోవాలని రేవంత్ యోచిస్తున్నారని వెల్లడించాయి. ఇందులో భాగంగా టీజేఎస్ అధినేత కోదండరాం, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తదితరుల పేర్లను పరిశీలిస్తున్నారని వివరించాయి.

అప్పుడికి తొలి నామినేటెడ్ పదవి?

సీఎం రేవంత్‌రెడ్డి నామినేటెడ్ పదవుల పంపకంలో భాగంగా తొలి పదవిని తనకు సన్నిహితుడైన మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డికి ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆయనను కేబినెట్ హోదా ఉండే రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్‌గా నియమించాలని రేవంత్ భావిస్తున్నట్టు తెలిసింది. నరేందర్‌రెడ్డి చాలా కాలం నుంచి రేవంత్ వెన్నంటే ఉంటున్నారు. ఇటీవలి ఎన్నికల సమయంలోనూ.. పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ శిబిరంలో కీలకంగా వ్యవహరించారు. తెర వెనుక ఉండి ప్రచారం, అభ్యర్థులతో సమన్వయం, కేడర్‌ను కదిలించడం, సభల ఏర్పాటు, నిర్వహణ వంటివి చూసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని కూడా పట్టుబట్టలేదు. ఈ నేపథ్యంలో వేం నరేందర్‌రెడ్డికి తగిన గుర్తింపు ఇవ్వాలని రేవంత్ యోచిస్తున్నారని, త్వరలోనే ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని టీపీసీసీ వర్గాలు చెప్తున్నాయి.

క్లుప్తంగా...



సురేఖకు అభినందనలు తెలుపుతున్న పీసీసీఎఫ్ డోబ్రియాల్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: సురేఖ

నేడు సచివాలయంలో మంత్రిగా బాధ్యతల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: పర్యావరణం పరిరక్షణ అందరి బాధ్యత అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ అన్నారు. రాష్ట్రంలో పచ్చదనం మరింతగా పెంచేందుకు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రిగా ఆమె సోమవారం ఉదయం 10 గంటలకు సచివాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆదివారం అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్, హెచ్ఓఎఫ్ఎఫ్) డోబ్రియాల్, ఇతర ఉన్నతాధికారులు మంత్రి సురేఖను ఆమె నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో అడవుల రక్షణ, పచ్చదనం పెంపునకు కలిసికట్టుగా పనిచేద్దామని మంత్రి అన్నారు. అంతకుముందు దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌తోపాటు వచ్చిన పండితులు మంత్రి దంపతులను కలిసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంఐఎం మచ్చిక కోసమే ప్రొటెం స్పీకర్‌గా అక్బర్

బీజేపీ ఎంపీ లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: బొటాబొటిగా మెజారిటీ రావడం వల్లే, ఎంఐఎం పార్టీని మచ్చిక చేసుకోవడం కోసం శాసనసభ ప్రొటెం స్పీకర్‌గా ఆ పార్టీ ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌ను కాంగ్రెస్ నిర్ణయించిందని బీజేపీ పార్లమెంటు బోర్డు సభ్యుడు, ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. ఈ విషయంలో రాజకీయం ఉందని, అందుకే ఈ నిర్ణయాన్ని తమ పార్టీ వ్యతిరేకించిందని చెప్పారు. ఆదివారం ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యేలుగా గెలిచినవారిలో ఎంతోమంది సీనియర్లు ఉన్నా, వారిని కాదని అక్బరుద్దీన్‌కు ప్రొటెం స్పీకర్‌గా అవకాశం ఇవ్వడంపై మండిపడ్డారు. ప్రభుత్వం ఎవరి పేరు పంపితే వారినే రాష్ట్ర గవర్నర్ ప్రొటెం స్పీకర్‌గా నియమిస్తారని తెలిపారు. విచ్ఛిన్నకర రాజకీయాలకు కాంగ్రెస్ కేరాఫ్‌గా మారిందని దుయ్యబట్టారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ అవినీతిపై మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎద్దేవా చేశారు. అవినీతి, దోపిడీకి కాంగ్రెస్ గ్యారెంటీ అయితే.. అభివృద్ధి, పేదల సంక్షేమం, నల్లధనం వెలికితీయడం వంటి వాటికి మోదీ గ్యారెంటీ అని అన్నారు. అవినీతిపరులు తిన్న సొమ్మంతా మోదీ కక్కిస్తారన్నారు. మధ్యప్రదేశ్ సీఎం ఎంపికపై ఒకటి రెండురోజుల్లో స్పష్టత వస్తుందని లక్ష్మణ్ తెలిపారు.

మల్లారెడ్డికి రైతుబంధు ఇవ్వాలా?

టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: ఆరువందల ఎకరాలున్న మాజీమంత్రి మల్లారెడ్డికి రైతుబంధు ఇవ్వాలో, వద్దో మాజీ మంత్రి హరీశ్‌రావు చెప్పాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ నిలదీశారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండ్రోజులు కాకముందే బీఆర్ఎస్ నేతలకు కళ్లు మండుతున్నాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు రైతుబంధు వేసి లబ్ధి పొందాలనే బీఆర్ఎస్ ప్రయత్నం బెడిసికొట్టిందని ఎద్దేవా చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతుల కళ్లలో మట్టికొట్టారని, పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా పలువిధాలుగా మోసం చేశారని ఆరోపించారు. రైతుల పేరుతో కొందరు దళారులు రైతుబంధు పథకం కింద లబ్ధి పొందారని, వారిని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.

ఉద్యమకారుడికి మంత్రి పదవి భేష్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉద్యమకారుడికి కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి పదవి ఇవ్వడం శుభపరిణామమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా నియమితులైన పొన్నం ప్రభాకర్‌ను ఆదివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల ఆధ్వర్యంలో పలువురు నేతలు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉద్యమాలు చేసిన నేపథ్యం మంత్రి ప్రభాకర్‌దని పేర్కొన్నారు. ఇక రాష్ట్రంలోని బీసీ విద్యార్థుల సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇప్పుడేం చేద్దాం!?



హిందూత్వ ఎజెండాను మరింతగా ఎత్తుకోవాల్సిందా..
మళ్లీ కొత్త అధ్యక్షుడిగా ఎవరైతే బాగుంటుంది..
ఎంపీ ఎన్నికల్లోనైనా సరైన ఫలితాలకు ఏం చేయాలి
బండిని తప్పించడం చేటుచేసిందా!
బీజేపీ నేతల్లో అంతర్మథనం.. శ్రేణుల్లో అంతర్గత చర్చ

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో జాతీయ, రాష్ట్ర నాయకత్వాల అంచనాలు తప్పడానికి కారణాలు ఏమై ఉంటాయా అన్న దానిపై బీజేపీలో ప్రస్తుతం 'పోస్ట్ మార్టమ్' సాగుతోంది. అన్ని రకాలుగా కసరత్తు చేసి, తగిన జాగ్రత్తలతో బరిలో దిగినా చివరికి నిరాశ కలిగించేలా ఫలితాలు రావడానికి ప్రభావం చూపిన అంశాలు ఏమిటన్న దానిపై లోతైన పరిశీలనలో పార్టీ నేతలు నిమగ్నమయ్యారు. ఈ ఎన్నికల్లో పార్టీ ఆశించిన ఫలితాలను సాధించి రాష్ట్ర రాజకీయాల్లో కీలకభూమి పోషిస్తుందనే అంచనాలు తప్పి కేవలం ఎనిమిది సీట్లకే పరిమితం కావడాన్ని పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. గెలిచిన 8లో ఏడు స్థానాలు ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచే ఉండడం, పార్టీకి అత్యధిక పట్టు, ప్రజల ఆదరణ, మద్దతు అధికంగా ఉందని భావిస్తున్న గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల నుంచి గోషామహల్ సీటు మాత్రమే రావడం వంటి పరిణామాలు నేతల అంచనాలకు పూర్తి స్థాయిలో అందడం లేదంటున్నారు. బీసీ సీఎం నినాదం, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు మద్దతు, సకల జనుల సౌభాగ్య తెలంగాణ పేరిట ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో ప్రజలపై ప్రభావం చూపించలేకపోయాయని విశ్లేషిస్తున్నారు. ఇక బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేక ఓటు బీజేపీకి అనుకూలంగా మారకపోగా, కర్ణాటక గెలుపుతో ఊపు మీదున్న కాంగ్రెస్ పార్టీ దాన్ని విజయవంతంగా అనుకూలంగా మలుచుకోగలిగిందని లెక్కలు వేస్తున్నారు.

ఎందుకు కమలాన్ని పట్టించుకోలేదంటే..

బీజేపీకి ట్రేడ్ మార్క్‌గా ఉన్న 'హిందూత్వ'ఎజెండాను మరింత బలంగా తీసుకెళ్లాల్సి ఉండిందా? సామాజిక కోణంలో తీసుకున్న బీసీ సీఎం నినాదం పనిచేయక పోవడానికి కారణాలేంటి? బయటి నుంచి వచ్చిన నేతలకు ఎన్నికల్లో కీలక బాధ్యతలు అప్పగించడం నష్టం చేసిందా? వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనైనా పార్టీ సరైన ఫలితాలు సాధించాలంటే ఏయే మార్పులు చేయాలి? తదితర ప్రశ్నలు ఇప్పుడు బాధ్యులైన నేతల మధ్య ప్రధానంగా చర్చకు వస్తున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. బీఆర్ఎస్–బీజేపీ ఒకటేనని, రెండింటి మధ్య లోపాయికారి మిత్రుత్వం ఉందంటూ జరిగిన ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టలేకపోవడం, కాళేశ్వరం, ఇతర ప్రాజెక్ట్‌ల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని స్వయంగా కేంద్రపెద్దలు విమర్శించినా ఆ మేరకు కనీస చర్యలు తీసుకోకపోవడం, ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవిత ప్రమేయం, అరెస్ట్ ఖాయమంటూ ప్రకటనలు చేసినా ఆ మేరకు యాక్షన్ లేకపోవడం, కేసీఆర్ సర్కార్‌పై రాజీలేని పోరాటం చేసి పార్టీ కేడర్‌లో నూతనోత్సాహం నింపిన బండి సంజయ్‌ని హఠాత్తుగా అధ్యక్షుడిగా తొలగించడం, బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఈటల రాజేందర్‌కు వివిధ కీలక బాధ్యతలిచ్చి ప్రాధాన్యతనివ్వడం తదితరాలు బీజేపీ ఓటమికి ప్రధాన కారణాలు కావొచ్చుననే చర్చ ఇప్పుడు పార్టీలో సాగుతోంది. అభ్యర్థుల ఖరారు ఆలస్యం కావడం, బలంలేని జనసేనకు 8 సీట్లు కేటాయించడం, పార్టీ నాయకులు ఓ జట్టుగా సమన్వయంతో పనిచేయకపోవడం వెరసి ప్రజలు బీఆర్ఎస్‌కు బీజేపీని ప్రత్యామ్నాయంగా చూడకపోవడంతో తీసికట్టుగా ఫలితాలు వచ్చాయని ఆ పార్టీ నేతలు విశ్లేషిస్తున్నారు.

లోక్‌సభ ఎన్నికలకు ఎలా ?

వచ్చే మార్చి, ఏప్రిల్‌లలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లోనైనా తెలంగాణ నుంచి గణనీయమైన సంఖ్యలో (గతంలో గెలిచిన 4 ఎంపీ సీట్ల కంటే అధికంగా) సీట్లు సాధించాలనే పట్టుదల రాష్ట్ర పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల ఓటమి భారంతో మునిగిన పార్టీలో నూతనోత్తేజాన్ని నింపేందుకు వెంటనే ఎలాంటి చర్యలు చేపట్టాలనే దానిపై పార్టీ నాయకులు సమాలోచనల్లో నిమగ్నమయ్యారు. కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగే విషయంలో పెద్దగా ఆసక్తి చూపించడం లేదన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మళ్లీ అధ్యక్షుడిగా బండి సంజయ్‌ను తీసుకొస్తే ప్రయోజనం ఉంటుందా? ఈటలకు ఆ బాధ్యతలు అప్పగిస్తే ఎలా ఉంటుంది? లేదా లోక్‌సభ ఎన్నికల దాకా కిషన్‌రెడ్డినే కొనసాగించి ఆ తర్వాత వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు దీర్ఘకాలిక వ్యూహంతో ముందుకెళితే మంచిదా అన్న ఆలోచనల్లో జాతీయ నాయకత్వం ఉన్నట్టు తెలుస్తోంది.

ఆ రహదారిని ఆరు వరుసలకు విస్తరిస్తాం

- హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- సచివాలయంలో బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిని త్వరలోనే ఆరు వరుసలుగా విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టును రెండేళ్లలోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ ప్రాజెక్టు పూర్తయితే విజయవాడకు అతి తక్కువ సమయంలోనే చేరుకునే అవకాశముందని కోమటిరెడ్డి వెల్లడించారు. తన పార్లమెంటు సభ్యత్వానికి రాజీనామా చేసేందుకు ఢిల్లీకి వెళ్తున్న నేపథ్యంలో, కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీతో భేటీ అయి పెండింగ్‌లో ఉన్న 14 జాతీయ రహదారుల ప్రతిపాదనలపై చర్చించనున్నట్టు వెల్లడించారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రిగా ఆదివారం ఆయన సచివాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వారంలో మూడు రోజులు సచివాలయంలో, మూడు రోజులు జిల్లా పర్యటనలో ఉంటానన్నారు. రాష్ట్రంలోని రోడ్లను మెరుగుపరిచి దేశంలోనే ఒక మోడల్ రాష్ట్రంగా అభివృద్ధి చేయనున్నట్టు వెల్లడించారు.

నాలుగు వరుసలకు విస్తరిస్తాం

నల్గొండ నుంచి ముషంపల్లి మీదుగా ధర్మాపురం వరకు సింగిల్ రోడ్డుగా ఉండి ఎన్నో ప్రమాదాలకు కారణమవుతున్న రోడ్డును రూ.100 కోట్లతో నాలుగు వరుసలకు విస్తరిస్తామని కోమటిరెడ్డి వెల్లడించారు. కొడంగల్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే లింగంపల్లి– దుగ్యాల రోడ్డును రూ.4.15 కోట్లతో మెరుగుపరుస్తామన్నారు. వారం రోజులు కూడా కాకముందే తమ ప్రభుత్వం రైతుబంధు నిధులు ఇవ్వటం లేదని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించటం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో రోడ్లు భవనాల శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీనివాసరాజు, ప్రత్యేక కార్యదర్శి విజేంద్రబోయి, ఈఎన్సీలు గణపతిరెడ్డి, రవీందర్‌రావు, న్యాక్ డీజీ భిక్షపతి, ఈఈ శశిధర్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను పరామర్శించిన మంత్రి

సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోమటిరెడ్డి ఆదివారం పరామర్శించారు. అనంతరం అక్కడే ఉన్న కేసీఆర్ కుమారుడు కేటీఆర్, కుమార్తె కవిత, హరీశ్‌రావును కలిసి కేసీఆర్ ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఫైళ్లు మాయంపై దర్యాప్తు జరగాల్సిందే...

- బాధ్యులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలి
- ఎంపీ ధీరజ్ సాహు ఇంట్లో దొరికిన డబ్బుతో దేశం విస్తుపోయింది
- దీనిపై కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఎందుకు మాట్లాడటం లేదు
- బీజేపీ శాసనసభాపక్షనేత ఎంపికపై పార్టీలో చర్చించి నిర్ణయం
- మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ విభాగాల్లో ఫైళ్లు మాయం కావడంపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేయించాలని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బాధ్యులు ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివారం బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రి ఆఫీసుతో పాటు ఇతర విభాగాల్లో కూడా ఫైళ్లు, ఇతర వస్తువులను తరలించే ప్రయత్నాన్ని ప్రజలందరూ చూశారని, స్థానికులు, పోలీసులు అప్రమత్తమవడంతో వదిలేసి వెళ్లిపోయారని వివరించారు. ఇలాంటి ఘటనలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు.

ధీరజ్‌పై రాహుల్‌కు ఎందుకంత ప్రేమ?

మూడు రోజులుగా కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహు ఇంటిపై ఐటీ అధికారుల దాడులు నిర్వహిస్తున్న తీరు దేశం మొత్తం విస్తుపోయేలా చేసిందని, నగదు దొరకడం చరిత్రలోనే మొదటిసారి అని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ధీరజ్ సాహు ఆపార్టీ నేత రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడని, చిన్న చిన్న విషయాలకు స్పందిస్తూ ట్విట్టర్ లో పోస్టులు పెట్టే రాహుల్ ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో మూడు సార్లు ఓడిపోయినా కూడా ధీరజ్ సాహును మూడు సార్లు రాజ్యసభ ఎన్నుకున్నారని, ధీరజ్‌పై ఎందుకంత ప్రేమ చూపిస్తున్నారో రాహుల్ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి చేసే ముఖ్యమంత్రులను, ఎంపీలను ఏటీఎంలుగా మార్చుకుందని, ఆ పార్టీ ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ అవినీతి మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుందని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రం నుంచి రూ. వందల కోట్లను తెలంగాణ ఎన్నికలకు తరలిస్తూ పట్టుబడటం చూశామన్నారు. ధీరజ్ సాహు లాగే కర్ణాటకలో మరో నాయకుడు నుండి ఈ డబ్బు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కర్ణాటకలో ప్రజలు పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్రంలో బీజేపీ శాసనసభాపక్షనేత ఎంపికపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

అదంతా దుష్ప్రచారం

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తుకు సంబంధించి తాను జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు సోషల్ మీడియాలో కొందరు ప్రచారం చేస్తున్నారని.. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇలాంటి అసత్యాలను ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నవారిపై సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

గత ప్రభుత్వ అవినీతిపై విచారణ జరిపిస్తాం

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



చౌటుప్పల్ : మునుగోడు నియోజకవర్గంలో గత ప్రభుత్వం పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిందని, త్వరలోనే దానిపై విచారణ జరిపిస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా ఆదివారం మునుగోడు నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. దండుమల్కాపురం గ్రామంలోని శ్రీఆందోల్ మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత చౌటుప్పల్‌లోని క్యాంపు కార్యాలయానికి వెళ్లగా అక్కడ పార్టీ నాయకులు కార్యకర్తలు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ...గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం లేకపోవడంతో అభివృద్ధి చేయలేకపోయానన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో ఉన్నది ప్రజా ప్రభుత్వమని, ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి నియోజకవర్గ సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. చౌటుప్పల్ మండలంలోని దండుమల్కాపురంలో పలు సర్వేనంబర్లలో కాందిశీకుల భూముల వ్యవహారంపై కూడా విచారణ జరిపిస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా చౌటుప్పల్ మండలాన్ని కాలుష్యం పట్టి పీడిస్తోందని చౌటుప్పల్‌తోపాటు పరిసర గ్రామాల్లోని కాలుష్యకారక పరిశ్రమలను తరలించేందుకు చర్యలు తీసుకుంటానని రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి జూపల్లి బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం సాయంత్రం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పర్యాటక సాంస్కృతిక, పురావస్తు శాఖ ఫైళ్లపై సంతకాలు చేశారు.

మహబూబ్‌గర్ జిల్లా ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్, కూచుకుళ్ల రాజేశ్వర్ రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్ శర్మ, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, ఎక్సైజ్ శాఖ కమిషనర్, పర్యాటక సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నిఖిల, డైరెక్టర్ కల్చరల్ మామిడి హరికృష్ణ తదితరులు కూడా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, రాష్ట్రంలో పర్యాటక రంగాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తెలంగాణ ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకుంటానన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, సుపరిపాలనకు కృషి చేస్తానని కృష్ణారావు అన్నారు.

అధికారమే కాదు.. విచక్షణ కూడా కోల్పోయారు

బీఆర్ఎస్ నేతలపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపాటు



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నేతలు అధికారంతో పాటు విచక్షణ కూడా కోల్పోయారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండురోజులు గడవకముందే ఆ పార్టీకి చెందిన మాజీమంత్రులు ప్రభుత్వాన్ని విమర్శించడం చూస్తుంటే నవ్వొస్తోందని ఎద్దేవా చేశారు. రవాణా మంత్రిగా నియమితులైన తర్వాత పొన్నం తొలిసారి గాంధీభవన్‌కు వచ్చారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్, టీపీసీసీ ఫిషర్‌మెన్ సెల్ చైర్మన్ మెట్టు సాయికుమార్, అధికార ప్రతినిధులు బండి సుధాకర్, శ్రీకాంత్‌యాదవ్‌తో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, బీఆర్ఎస్ నేతలు తమకు సుద్దులు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉన్నందునే అధికారంలోకి వచ్చిన రెండురోజుల్లోనే రెండు గ్యారంటీలను అమల్లోకి తెచ్చామని, మహిళలకు ఉచితబస్సు ప్రయాణం ద్వారా రోజుకు 45 లక్షలమంది ప్రయాణిస్తున్నారని చెప్పారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటోడ్రైవర్లు నష్టపోతున్నారనే వాదన వినిపిస్తోందని, దీనిపై కూడా ప్రభుత్వం చర్చిస్తుందన్నారు. గతంలో ప్రజలు రాష్ట్ర సచివాలయం, ప్రగతిభవన్‌లోకి వెళ్లే వీలు ఉండేదికాదని, తాము అధికారంలోకి రాగానే పరిస్థితిని మార్చామని చెప్పారు. ప్రజాదర్బార్‌ను జిల్లాలకు కూడా విస్తరిస్తామని మంత్రి వెల్లడించారు.

పర్యాటక ఆదాయం పెంపుపైనే ప్రపంచ దేశాల దృష్టి

- ప్రపంచవ్యాప్తంగా పర్యాటక విభాగం కీలక పాత్ర
- భారత్‌లో స్వదేశీ, విదేశీ పర్యాటకుల పెంపునకు చొరవ: కిషన్‌రెడ్డి

హఫీజ్‌పేట్ (హైదరాబాద్): ప్రపంచవ్యాప్తంగా పర్యాటక విభాగం కీలక పాత్ర పోషిస్తోందని, ప్రపంచ దేశాలన్నీ పర్యాటక రంగం ద్వారా వచ్చే ఆదాయ పెంపుదలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. పెట్టుబడులను ఆహ్వానించేందుకు హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో ఆదివారం నిర్వహించిన 'దక్షిణ భారత్, ఈశాన్య రాష్ట్రాల్లో పర్యాటక, ఆతిథ్యరంగం– 2023'కార్యక్రమాన్ని కిషన్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...స్వదేశీ పర్యాటకంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సి ఉందన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో అందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఇటీవలి కాలంలో విదేశాల నుంచి వస్తున్న పర్యాటకుల సంఖ్య విపరీతంగా పెరిగిందన్నారు. దేశంలోని సరిహద్దు ప్రాంతాలతోపాటు ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలను పర్యాటక ప్రదేశాలుగా అభివృద్ధి చేసి టూరిజం రంగంలో కోట్ల మందికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. దేశంలోని అన్ని ప్రాంతాలకు రోడ్డు మార్గాలతో పాటు ఇతర మార్గాలను కూడా అనుసంధానం చేసి పర్యాటక ప్రాంతాలకు సులువుగా రాకపోకలు సాగించేలా చేస్తామన్నారు. సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటక, అస్సాం, మేఘాలయ రాష్ట్రాలకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడిగా లచ్చిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల సంఘం నూతన కమిటీ ఎన్నికైంది. హైదరాబాద్‌లోని మారీ గోల్డ్ హోటల్‌లో ఆదివారం జరిగిన డిప్యూటీ కలెక్టర్ల ఆత్మీయ సమ్మేళనంలో కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షునిగా వి.లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా కె.రామకృష్ణ, ఎస్.ఆర్.సరిత, సెక్రటరీ జనరల్‌గా రమేశ్ రాథోడ్, కోశాధికారిగా కె.వెంకట్‌రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్స్‌గా ఎం.కృష్ణారెడ్డి, చిన్న వెంకటస్వామి, రమాదేవి, ఎం.జనార్దనరెడ్డి, ఎం.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పి.పద్మప్రియ, ఎస్.రాజేందర్‌రెడ్డి, షేక్ అమీద్, ఎం.విజయకుమారి, ఎల్.అలివేలు, కార్యదర్శులుగా ఎం.ప్రభాకర్, వి.శేఖర్‌రెడ్డి, జీఎస్వీ రాజువర్మ, ఈ.అర్చన, పి.రాంరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా టి.శ్యాంప్రసాద్, కేఎంవీ జనార్దనరావు, కె.వీణ, కదం సురేష్, రాథోడ్ మోహన్‌సింగ్, డి.దేవుజ, సాంస్కృతిక కార్యదర్శులుగా భావయ్య, కె.సురేష్, వి.శ్రీదేవి, కార్యవర్గ సభ్యులుగా ఎస్.ఎల్లారెడ్డి, శ్రీరాందత్, ఆర్.గంగాధర్, అంబదాస్ రాజేశ్వర్, వై.శ్రీనివాస్‌రెడ్డి, టి.వెంకటేష్, డి.శ్రీధర్, దూలం మధు, కోమల్‌రెడ్డి ఎన్నికయ్యారు. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్(విశ్రాంత) రవీంద్రబాబు ఎన్నికలకు ఇన్‌చార్జిగా వ్యవహరించారు.

కరెక్ట్ కాదు.. కామ్రేడ్!

ఆ పార్టీ కేడర్‌లో తీవ్ర అసంతృప్తి

- ఎన్నికల్లో డిపాజిట్లు కూడా రాకపోవడంపై విమర్శలు
- కాంగ్రెస్‌తో సర్దుబాటు చేసుకోకపోవడంపైనా ఆగ్రహం
- ఘోర పరాజయానికి బాధ్యులపై చర్యలుంటాయన్న వాదనలు
- 12, 13, 14 తేదీల్లో పార్టీ సమావేశాలు



సాక్షి, హైదరాబాద్: ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ రాష్ట్ర కమిటీ తీసుకున్న నిర్ణయంపై సీపీఎంలో తీవ్రమైన అసంతృప్తి నెలకొంది. కాంగ్రెస్‌తో సర్దుబాటు చేసుకోకుండా చివరి నిమిషం వరకు గందరగోళ నిర్ణయాలు తీసుకోవడం... అనంతరం ఒంటరిగా పోటీ చేసి డిపాజిట్లు కోల్పోవడంపై ఆ పార్టీ కార్యకర్తల్లో ఆగ్రహ జ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీ తీసుకున్న నిర్ణయం పరోక్షంగా బీఆర్ఎస్‌కు ప్రయోజనం చేకూరేదిగా ఉందన్న ఆరోపణలను రాష్ట్ర అగ్రస్థాయి నాయకులు కూడా వ్యక్తం చేస్తున్నారు. దీంతో పార్టీ పోటీ చేసిన 19 నియోజకవర్గాల్లోనూ క్రాస్ ఓటింగ్ జరిగిందని పార్టీ అంతర్గత విచారణలో తేలింది. పార్టీకి చెందిన యువ ఓటర్లు కాంగ్రెస్‌కు ఓటు వేసినట్లు స్పష్టమైందని అంటున్నారు. అందువల్లే ఎన్నడూలేని స్థాయిలో పార్టీ ఎన్నికల్లో ఘోరమైన పరాభవాన్ని చవిచూడాల్సి వచ్చిందంటున్నారు. మిర్యాలగూడ, పాలేరు, భద్రాచలం వంటి స్థానాల్లోనూ ఘోరమైన పరాజయాన్ని మూటగట్టుకోవాల్సి వచ్చిందని విశ్లేషిస్తున్నారు. మొత్తంగా కాంగ్రెస్‌ను గెలిపించేలా క్రాస్ ఓటింగ్ జరిగిందని పార్టీ వర్గాలు అంచనాకు వచ్చినట్లు తెలిసింది.

సీపీఐ మాదిరిగా ఎందుకు వ్యవహరించలేదు?

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో పొత్తు పొడవకపోవడంతో కాంగ్రెస్‌తో సర్దుబాటు చేసుకోవాలని సీపీఎం నిర్ణయించిన సంగతి తెలిసిందే. చివరకు కాంగ్రెస్‌తోనూ సర్దుబాటు కుదరలేదు. మిర్యాలగూడ కేటాయించి, అధికారంలోకి వచ్చాక రెండు ఎమ్మెల్సీలు ఇస్తామని కాంగ్రెస్ విధించిన షరతును సీపీఎం తోసిపుచ్చింది. దీంతో ఒంటరిగా 19 స్థానాల్లో పోటీ చేసిన ఆ పార్టీ ఎక్కడా డిపాజిట్లు కూడా దక్కించుకోలేకపోయింది. సీపీఐ కొత్తగూడెం సీటు, రెండు ఎమ్మెల్సీలకు ఒప్పుకొని కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని ప్రయోజనం పొందగలిగింది. ఇలా ఎందుకు చేయలేదన్న చర్చ సీపీఎంలో కొందరు నేతలు లేవనెత్తుతున్నారు.

రాష్ట్రం వచ్చినప్పటి నుంచి తప్పుడు నిర్ణయాలే?

తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో పార్టీ నాయకత్వం తప్పుడు నిర్ణయాలే తీసుకుంటోందని రాష్ట్రస్థాయి నాయకుడొకరు వ్యాఖ్యానించారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవడంతో 2014లోనూ సీపీఎం భారీ నష్టాన్ని మూటగట్టుకుంది. 2018 ఎన్నికల్లో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్)ను ఏర్పాటు చేసి విఫలమైంది. బీఎల్ఎఫ్ ఏర్పాటు విఫల ప్రయోగమని పార్టీ కేంద్ర కమిటీ చీవాట్లు పెట్టిందని అంటున్నారు. ఇక ఇప్పుడు మూడోసారి కాంగ్రెస్‌తో సర్దుబాటు చేసుకోవడంలో విఫలమై మరోసారి పరాభవాన్ని మూటగట్టుకోవాల్సి వచ్చిందని ఒక నాయకుడు విశ్లేషించారు. 'పార్టీ సిద్ధాంతం గొప్పది. మార్క్సిజం అజేయమే. కానీ ఆ సిద్ధాంతాన్ని సరిగా అమలు చేయకపోవడం వల్ల ప్రజల్లో సీపీఎం పలుచన అవుతోంది. ఇది కొందరు వ్యక్తులు తీసుకుంటున్న తప్పుడు నిర్ణయాలే'నని ఆ నాయకుడు అన్నారు.

ఆ మూడురోజుల్లో చర్చ

పార్టీ ఓటమి, భవిష్యత్ కార్యాచరణపై ఈ నెల 12వ తేదీన రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం, 13, 14 తేదీల్లో రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహించాలని సీపీఎం నిర్ణయించింది. మరోవైపు పార్టీకి వ్యతిరేకంగా ఎన్నికల్లో పనిచేసిన వ్యక్తులపై చర్యలు తప్పవని అంటున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనైనా సరైన వ్యూహాన్ని అనుసరించి ఎన్నికలకు వెళ్లాలని సీపీఎం కార్యకర్తలు కోరుకుంటున్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు వినతి

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి 250 గజాల స్థలం, పెన్షన్ తదితర సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ కోరారు. ప్రొఫెసర్ కోదండరామ్‌కు ప్రభుత్వంలో ప్రాధాన్యం కల్పించాలని, ఉద్యమకారులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశమివ్వాలని, ప్రొఫెసర్ జయశంకర్‌ను తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.



ఎల్లవేళలా తనను స్తుతించమని కోరుకునే దేవుడిని నేను నమ్మలేను.

– ఫ్రెడరిక్ నీషే

సాక్షి

సోమవారం, 11 డిసెంబర్ 2023

రెండో గొంతు

మనదైనది ఏదో వ్యక్తం చేయడానికి మనదైన భాష ఒకటి ఉండాలనుకుంటాం. కానీ భాష చిత్రమైంది. ఒక్కోసారి అనుకున్న మాట వెంటనే తట్టదు. ఇంకో సందర్భంలో ఆ ఒక్కమాటకు పది మాటలు కనబడి గందరగోళ పరుస్తాయి. రెండు సందర్భాల్లోనూ మనిషి మూగ కావడం గమనార్హం. ఇదంతా భాష సమస్య కాదేమో; మన లోపలి భావానికి అనుగుణంగా భాష మనల్ని ఇలా ఒంటరిగా మాట తోడులేకుండా నిలబెట్టే స్థితిని కల్పిస్తుందేమో! భావం అనేది చాలా సంక్లిష్టమైంది కదా మరి! దాన్ని భాషలోకి తేవాలని అనుకున్నప్పుడు, ఎంతో తెలుసు అనుకున్నది కూడా, ఏ కొసను అందుకోవాలో తెలియక తికమక పరుస్తుంది. ఒక తేనెతుట్టె ఏదో లోపల కదిలినట్టయి గందరగోళం తలెత్తుతుంది. అనుకున్న వ్యక్తీకరణ గాడి తప్పుతుంది. భావాన్ని వ్యక్తపరచడానికి ఏ భాష అయితే కావాలో అదే అవరోధంగా మారడం తమాషా కదా! మరి దానికేమిటి దారి? సంజ్ఞలైతే పనికిరావు. కాబట్టి మళ్లీ భాషే దిక్కు. పోనీ, ఇంకేదో భాష అయితే? అందులో మనకు అంతగా ప్రవేశం లేనిదైతే? ఒక్కోమాటా వాక్యంగా పేర్చుకునేదైతే? నిజంగా అలా రాయడం సాధ్యమా? ప్రపంచ సాహిత్యంలో పేరెన్నికగన్న కొందరు రచయితలు 'తమది కాని' భాషలో సాహిత్యం సృజించారు.

1978లో బేస్‌బాల్ గేమ్ చూస్తున్నప్పుడు, ఆటగాడు బంతిని బలంగా కొట్టిన బ్యాట్ శబ్దం టోక్యో శివార్లలోని 'జింగు' స్టేడియం మొత్తం ప్రతిధ్వనించిన ఒకానొక క్షణాన ఇరవైల్లో ఉన్న హరూకీ మురకామీకి ఉన్నట్టుండి తానూ రాయగలనని అనిపించింది. ఆ క్షణం ఆయనలో ఏదో ఎల్లలు లేని సృజనావేశం తన్నుకొచ్చింది. దాన్ని అలాగే పోనీయకుండా కొన్ని నెలలు శ్రమించి, రాత్రుళ్లు కుస్తీపట్టి జపనీస్ భాషలో మొదటి నవల రాయడానికి ప్రయత్నించాడు. అంతా అయ్యాక చదివితే ఆయనకే నచ్చలేదు. దీనికి కారణం – తన మాతృభాషలో 'పశువుల కొట్టంలో పశువులు క్రిక్కిరిసినట్టుగా' ఆలోచనలు రొద పెట్టడమే! దీనివల్ల ఉక్కిరిబిక్కిరికి లోనయ్యాడు. 'ఒకరి భావాలను అలవోకగా ఒక క్రమంలో పెట్టడం గురించి మాట్లాడటం సులభమేగానీ, అలా చేయడం అంత సులభం కాదు. బొత్తిగా అప్పుడే రాయడం మొదలుపెట్టిన నా లాంటివాడికి అది మరింత కష్టం. కొత్తగా మళ్లీ ప్రారంభించడానికి, నేను చేయాల్సివచ్చిన మొదటి పని నా రాతప్రతుల కుప్పనూ, ఫౌంటెన్ పెన్‌నూ వదిలించుకోవడం! అవి నా ముందు ఉన్నంతసేపూ నేనేదో 'సాహిత్యం' లాంటిదాన్ని రాస్తున్నట్టనిపించింది. వాటి స్థానంలోకి నా పాత అలవెటీ టైప్‌రైటర్‌ను అల్మారా లోంచి తెచ్చాను. తర్వాత, ఒక ప్రయోగం లాగా, నా నవల ప్రారంభాన్ని ఇంగ్లీష్‌లో రాయాలని నిర్ణయించుకున్నాను. ఎటూ ఏదైనా కొత్తగా ప్రయత్నించాలనుకున్నప్పుడు ఇలా ఎందుకు చేయకూడదనిపించింది?' అంటూ మురకామీ తాను తన జపనీస్‌ను కాదని ఆంగ్లంలో రాయడానికి పూనుకోవాల్సి వచ్చిన నేపథ్యం చెబుతాడు. అయితే, ఆంగ్లం ఆయనకేమీ మంచినీళ్ల ప్రాయం కాదు. ఈ భాష పరిమితి వల్ల సంక్లిష్ట వాక్యాలు రాయడం కుదరదు. ఆ ఉన్న కొద్దిపాటి పదసంపద, వ్యాకరణాలనే ప్రతిభావంతంగా ఉపయోగించుకోవాలి. 'మై కిచెన్ టేబుల్ ఫిక్షన్' ధోరణిగా వర్ణించే ఆయన రచనలు అలా మొదలయ్యాయి. ఈ ధోరణిలో వచ్చిన 'హియర్ ద విండ్ సింగ్' నవలిక మురకామీని అమాంతం పైకి ఎత్తేసింది.

కృత్యాదిలోనే మురకామీ అవస్థ పడ్డాడు. కానీ ఝుంపా లాహిరిది ఇంకో కథ. లండన్‌లో పుట్టి, అమెరికాలో పెరిగిన భారత(బాంగ్లా) సంతతి ఝుంపా 'ఇంటర్‌ప్రిటర్ ఆఫ్ మాలడీస్' నవలకు 'పులిట్జర్' గెలుచుకుంది. 'నేమ్‌సేక్'తో మరింత పేరొచ్చింది. ఉన్నట్టుండి తన నలభై ఐదేళ్ల వయసులో ఇటాలియన్‌లో రాయాలని నిర్ణయించుకుంది. కొత్త భాషలో రాయడంలో ఒక స్వేచ్ఛ ఉంది అంటారామె. 'పర్ఫెక్టుగా ఉండనక్కరలేని స్వేచ్ఛ'. న్యూయార్క్‌లో కొన్ని ఇటాలియన్ పాఠాలు విన్న అనుభవం ఉంది. కానీ ఆ భాష కోసమే 2015లో ఆమె కుటుంబంతో సహా రోమ్‌కు వెళ్లి, కొన్నేళ్లు ఉండివచ్చింది. తర్వాత మూడు పుస్తకాలు ఇటాలియన్‌లో వెలువరించింది. తర్వాత అవి ఆంగ్లంలోకి వచ్చాయి. సహజంగానే ఇటాలియన్‌లో రాయడమేంటని చాలామందే ఆమెను ప్రశ్నించారు. ఒక్కొక్క పదం, వాక్యం ద్వారా వ్యక్తీకరణను కూడగట్టుకొని కొత్త లోకపు ద్వారంలోకి ప్రవేశించినట్టుగా అనుభూతి చెందానంటుంది. పాత, కొత్త ప్రపంచాల మధ్య అదొక సవాలు కూడా! 'ఇటాలియన్ భాష నా జీవితాన్నేమీ మార్చలేదు; అది నాకు రెండో జీవితాన్ని ఇచ్చింది; మరో అదనపు జీవితం'.

తన అసంబద్ధ రచన 'వెయిటింగ్ ఫర్ గోడో' ద్వారా ఖ్యాతినొందిన శామ్యూల్ బెకెట్ పుట్టుకతో ఐరిష్‌వాడు అయినప్పటికీ ఫ్రెంచ్‌ను తన రచనాభాషగా ఎంచుకున్నాడు. దానికి ఆయన చెప్పిన కారణాలు సాధారణంగా రచయితలు కోరుకునే లక్షణాలకు పూర్తి విరుద్ధమైనవి. తన మాతృభాషకు దూరం కావడం అనేది, ఒక ముసుగును చించుకోవడంతో సమానంగా చూశాడు. ఫ్రెంచ్‌లో (పరాయి భాష) మాత్రమే ఒక శైలి లేకుండా రాయడం సాధ్యమవుతుందన్నాడు. అలాగైతేనే తనకు తగిన వనరులు లేకుండా పోతాయన్నాడు. అందువల్లేనేమో, ఆయన ప్రసిద్ధ 'మినిమలిస్ట్' రచయిత కాగలిగాడు.

వేర్వేరు కారణాల వల్ల తమ మాతృభాషలకు దూరమైన రచయితలు ఎందరో ఉన్నారు. పరిస్థితులు వారికి అలాంటి పరీక్ష పెట్టాయి. ఆ వేదన ఇక్కడ అప్రస్తుతం. కానీ భాష అనేదాన్ని ఒక అవరోధంగా పెట్టుకుని రాయాలనుకోవడం దానికదే ఒక సవాలు. ప్రాణవాయువును మరీ ఎక్కువగా పీల్చకుండా పొదుపుగా వాడుకుంటూ బతికే యోగసాధన లాంటిది అది.

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, తిథి: బ.చతుర్దశి తె.5.49 వరకు (తెల్లవారితే మంగళ వారం), తదుపరి అమావాస్య, నక్షత్రం: విశాఖ ఉ.11.38 వరకు, తదుపరి అనూరాధ, వర్జ్యం: ప.3.43 నుండి 5.19 వరకు, దుర్ముహూర్తం: ప.12.16 నుండి 1.04 వరకు, తదుపరి ప.2.29 నుండి 3.17 వరకు, అమృతఘడియలు: రా.1.24 నుండి 3.04 వరకు; సూర్యోదయం: 6.24, సూర్యాస్తమయం: 5.23, రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు

భారత్‌పై అభియోగాల పత్రం

కామెంట్



కరణ్ థాపర్

విలియం షేక్‌స్పియర్ నాటకం 'ద మర్చెంట్ ఆఫ్ వెనిస్'లో షైలాక్ కనికరం లేని వడ్డీ వ్యాపారి. స్నేహితుడి కోసం 'నాదీ పూచీ' అంటూ డబ్బు తీసుకుని చివరికి తీర్చలేకపోతాడు ఆంటోనియో. పరిహారంగా ఒక పౌండు ఆంటోనియో మాంసాన్ని అడుగుతాడు షైలాక్. భారత్‌పై యూఎస్ తాజా అభియోగ పత్రంలోని నేరారోపణలు కొంతవరకు ఆంటోనియోను గుర్తు చేసే విధంగా ఉన్నాయి. అమెరికన్ పౌరుడు గురుపత్‌వంత్ సింగ్ పన్నూపై కొద్దిరోజుల క్రితం జరిగిన హత్యాయత్నం వెనుక భారత ప్రభుత్వ హస్తం ఉందన్నది అమెరికా ఆరోపణ. సంబంధాలు ఇరు దేశాలకూ ముఖ్యమే కనుక యూఎస్ ఈ విషయంలో మౌనంగా ఉండి, షైలాక్‌లాగా భారత్ నుంచి పరిహారంగా 'ఒక పౌండు మాంసాన్ని' కోరుతుందా?



భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్



భారత సంతతి ఖలిస్తానీ ఉగ్రవాది గురుపత్‌వంత్ సింగ్ పన్నూ

చేర్పులు, జోడింపులతో మరింతగా బలపరిచి అమెరికా ప్రభుత్వం తాజాగా బహిర్గతపరచిన పూర్వపు అభియోగ పత్రాన్ని ఒక కల్పిత కథనంగా మీరు విశ్వసిస్తే తప్ప, అందులోని వెల్లడింపుల పట్ల ఆందోళన చెందవలసిన అవసరం లేదు. కానీ, విచారణకు వెళ్లనున్న కేసు అది. తేలిగ్గా కొట్టిపడేసి పక్కకు తోసేయవలసినది కాదు. కాబట్టి, సహాయకారిగా ఉంటుందనుకుంటే కనుక మనం దృష్టి సారించవలసిన అంశాలను కొన్ని ప్రశ్నలను లేవనెత్తడం ద్వారా ఒక జాబితాగా పొందుపరుస్తాను.

మొదటిది – అమెరికా గడ్డ మీద ఒక అమెరికన్ పౌరుడిని (నిషేధిత 'సిఖ్స్ ఫర్ జస్టిస్' సంస్థ నేత గురుపత్ వంత్ సింగ్ పన్నూ) హత్య చేయించేందుకు సిసి–1 అనే సంకేత నామధారి పథక రచన చేయడం! యు.ఎస్. తిరగ రాసిన అభియోగ పత్రంలోని ఆరోపణలను బట్టి– 'భద్రతా నిర్వహణ', 'ఇంటెలిజెన్స్' విభాగాలలో బాధ్యతలు నిర్వర్తిస్తూ తనను తాను 'సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్'నని చెప్పుకుంటున్న ఆ సంకేత నామధారి భారత ప్రభుత్వ సంస్థలో గుర్తింపు పొందిన ఉద్యోగిగా ఉన్నాడు. గతంలో అతడు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌లో కూడా పని చేశాడు. మరీ ముఖ్యంగా ఈ సిసి–1 అనే వ్యక్తి ఆ అభియోగ పత్రంలో పేర్కొన్న అన్ని సమయాలలోనూ భారత ప్రభుత్వం నియమించిన విధుల నిర్వహణలో ఉన్నాడు. ఇండియాలోనే ఉన్నాడు. ఇండియా నుంచే హత్యకు కుట్ర పన్నాడు. ఇదేం సూచిస్తోంది? సిసి–1 వెనుక భారత ప్రభుత్వం ఉందనా? లేక సిసి–1 అనే అతడు ఒక మోసగాడు అయి ఉండవచ్చుననా?

రెండవది – ప్రస్తుత పరిస్థితుల్లో ఆ మోసగాడు ఎలా ఉండి ఉంటాడు? ఒంటరి తోడేలు మాదిరిగానా? లేక, దేశ అత్యుత్తమ ప్రయోజనాల కోసం పనిచేస్తున్న ఒక చిన్న సమూహంలో భాగంగానా? లేదా అన్ని అధికారిక అనుమతులతో వ్యూహాత్మక టక్కరిగా నటిస్తున్న అత్యున్నతస్థాయి ప్రభుత్వ అధికారి అయివుంటాడా?

మూడవది – ఆ సిసి–1 ఎవరైనా గానీ అసమర్థంగా ఈ పనిని నిర్వహించాడా? 'నిఖిల్ గుప్తా అనే ఒకానొక అంతర్జాతీయ మాదక ద్రవ్యాల రవాణా వ్యాపారిని సిసి–1 పనిలోకి దింపాడు.' తనకు తెలియకుండానే అలా చేశాడా? తెలియకపోతే తెలుసుకోవలసిన పని లేదా? ఒకవేళ ఉద్దేశపూర్వకంగానే నిఖిల్ గుప్తాను ఎంచుకుని ఉంటే అది తెలివైన ఎంపికేనా?

నాల్గవది – ఇక నిఖిల్ గుప్తా ఏం చేశాడంటే 'డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్' (డి.ఇ.ఎ.)కు రహస్య సమాచారం అందించే వ్యక్తిగా మారిన ఒక భాగస్వామ్య నేరస్థుడిని సంప్రదించాడు. ఆ వ్యక్తి కిరాయి హంతకుడిగా నటిస్తున్న ఒక రహస్య ప్రభుత్వ అధికారి (అండర్ కవర్ ఏజెంట్) దగ్గరికి గుప్తాను తీసుకెళ్లాడు. దీన్నిబట్టి డి.ఇ.ఎ. గుప్తాను నీడలా వెంటాడుతోందనీ, కాబట్టి గుప్తా గురించి మన వరకు రాని అనేక విషయాలు డి.ఇ.ఎ.కు తెలిసి ఉంటాయనీ అనుకోవచ్చా? మరీ ముఖ్యంగా, ఇదొక దారుణమైన గందరగోళంగా అనిపించడం లేదా? బహుశా దీనికంటే 'డాడ్స్ ఆర్మీ' (హోంగార్డులు) నయం కదా?

ఐదవది – కెనడాలో జూన్ 18న హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య జరిగిన కొన్ని గంటల తర్వాత, 'రక్తంతో తడిసిన నిజ్జర్ మృతదేహం ఆయన వాహనంపై పడివున్నట్లు చూపించే వీడియో క్లిప్పును గుప్తాకు సిసి–1 పంపించాడు.' ఈ ఆరోపణ... సిసి–1కి నిజ్జర్ హత్యతో నేరుగా సంబంధం ఉందని చెప్పడానికి యు.ఎస్. అధికారులు సాక్ష్యాధారాలను సృష్టించడాన్ని సూచిస్తోందా? అదే నిజమైతే భారత్‌పై జస్టిన్ ట్రూడో ఆరోపణలకు ఆ సాక్ష్యాధారాలే బలం చేకూరుస్తున్నాయా?

కలవరపరిచే సమాచార వ్యవస్థ

ఆరవది – 'హత్య తర్వాత కొన్ని వారాల పాటు గుప్తా... భాగస్వామ్య నేరస్థునితో, ఆ తర్వాత కిరాయి హంతకుడితో – ఫోన్, వీడియో, టెక్స్ట్ మెసేజ్‌ల వంటి వాటి ద్వారా వరుసగా ఎలక్ట్రానిక్, రికార్డెడ్ సంభాషణలను జరిపాడు' అని యు.ఎస్. అభియోగ పత్రం చెబుతోంది. ఆ సంభాషణలు సంకేత నిక్షిప్త సందేశాల రూపంలో ఉన్నప్పటికీ వాటిని అడ్డగించి ఉంటారు. అంటే యు.ఎస్. అధికారుల వద్ద ఇప్పటికీ బయట పెట్టని సమాచారం గుట్టలు గుట్టలుగా మిగిలి ఉందనేనా? అది కూడా మన సమాచార వ్యవస్థ తాలూకు పటిష్ఠత, భద్రతల గురించి కలవరపరిచే ప్రశ్నలను రేకెత్తిస్తోంది.

ఏడవది – కనీసం నాలుగు వేర్వేరు చోట్ల హత్యకు వ్యూహం పన్నినట్లు యు.ఎస్. అభియోగ పత్రం చెబుతోంది. వాటిల్లో ఒకటి న్యూయార్క్‌లో... బహుశా గురుపత్‌వంత్ సింగ్ పన్నూని హత్య చేయడం కోసం... మరొకటి క్యాలిఫోర్నియాలో, మరో రెండు కెనడాలో! నిజానికి ఒక దశలో గుప్తా... ''మేము ప్రతి నెలా 2–3 జాబ్ వర్క్‌లు ఇస్తాం'' అని అన్నట్లు యు.ఎస్. ఆరోపణలలో ఉంది. ఇదెలా వినిపిస్తోంది? ఒకే ఒకసారి హత్యలన్నిటికీ లేదా వరుస హత్యల ప్రారంభానికి పథక రచన జరిగిందనే అర్థం ధ్వనించడం లేదా?

చివరిగా – యు.ఎస్. ప్రభుత్వ స్పందన. అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సల్లివాన్ ఆగస్టు నెలలో భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఎదుట అమెరికా స్పందనను ప్రస్తావనకు తెచ్చారు. ఒక వారం తర్వాత సి.ఐ.ఎ. అధినేత విలియమ్ బర్న్స్ భారత్‌లోని ఆర్.అండ్ ఎ.డబ్ల్యు.(రా) అధినేతతో మాట్లాడేందుకు ఢిల్లీ వచ్చారు. తర్వాత అధ్యక్షుడు జో బైడెన్ సెప్టెంబరులో జి–20 సదస్సులో ఈ అంశాన్ని లేవనెత్తారు. ఆ నెలాఖరున వాషింగ్టన్‌లో మళ్లీ సల్లివాన్, యు.ఎస్. విదేశాంగ కార్యదర్శి బ్లింకెన్... విషయాన్ని జైశంకర్ దృష్టికి తెచ్చారు. చివరిగా అక్టోబర్‌లో నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ అవ్రిల్ హెయిన్స్ మరిన్ని అభియోగ వివరాలతో భారతదేశానికి వచ్చారు. దీనర్థం... వైట్ హౌస్ ఈ విషయాన్ని చాలా తీవ్రంగా పరిగణిస్తోందనే కదా! వాస్తవానికి దోవల్‌తో సల్లివాన్ ''ఇలాంటిది మరోసారి జరగదన్న హామీని అమెరికా ప్రభుత్వం కోరుతోంది'' అని అన్నట్లు వాషింగ్టన్ పోస్ట్ నివేదించింది. కఠినమైన భాష కాదా ఇది?

యు.ఎస్. అభియోగ పత్రం మొత్తం అంతా కల్పితం అని విశ్వసించినప్పుడు మాత్రమే మనం ఈ ప్రశ్నలన్నిటినీ విస్మరించగలం. కానీ మీరు ఈ ప్రశ్నలను పూర్తి పరిగణనలోకి తీసుకుంటే కనుక మరొక ప్రశ్న కూడా తలెత్తుతుంది. ఒకవేళ, చివరికి వాషింగ్టన్ ఈ వ్యవహారాన్నంతా చూసీ చూడనట్లు ఉండిపోయేందుకు నిర్ణయించుకుంటే – భాగస్వామ్య వ్యూహాత్మక ప్రయోజనాలు ముఖ్యం కాబట్టి – భారత్ నుంచి ఒక 'మాంస ఖండాన్ని'(పౌండ్ ఆఫ్ ఫ్లెష్) ప్రతిఫలంగా కోరుతోందా?

అమెరికన్ షైలాక్ దయతో నేనొక భారతీయ ఆంటోనియోగా ఉండటాన్ని ద్వేషిస్తాను. లేదా మనల్ని కాపాడేందుకు పోర్షియా వంటి కారుణ్యమూర్తి ఎవరైనా రెక్కలు కట్టుకుని ముందుకొస్తుందా?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వివేకం



నా జీవితంలో నేను ఎలాంటి దశకు వచ్చానంటే, అనవసర వాదనలకు దూరంగా ఉండటానికి ప్రయత్నిస్తాను. ఆఖరికి మీరు రెండు, రెండు కలిపితే ఆరు అవుతుంది అన్నా కూడా, 'బహుశా మీరే కరెక్టు' అంటాను.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

హింసానంతర శాంతి?



కొందరు పండితుల అభిప్రాయానికి ఇది విరుద్ధమే గానీ, ఒక తీవ్రవాద గ్రూపును సమూలంగా నాశనం చేయడం శాంతికి దారితీస్తుంది. మొన్నటికి మొన్న 2009లోనే శ్రీలంక సైన్యం ఎల్టీటీఈని నిర్వీర్యం చేసింది. విషాదకరంగా, ఈ సైనిక చర్య వల్ల చాలామంది పౌరులు మరణించారు. కానీ చివరకు శ్రీలంకలో (తమిళులు, సింహళులు ఇరువురికీ) మెరుగైన పరిస్థితులు ఏర్పడ్డాయి. గాజాలో కూడా అదే జరగనుందా?

– సదానంద్ ధూమే, కాలమిస్ట్

ఏం మాట్లాడాలి?



నాకు వయసు పెరుగుతున్నకొద్దీ బంధువులతో సంభాషించడానికి నా దగ్గర ఏ విషయాలూ లేవని అనిపిస్తోంది.

– కార్తీక్ బాలచంద్రన్, వైద్యుడు

దైవమే రక్ష



ఈ రోజు దీన్ని గుర్తుచేసుకోండి: 'దైవ ప్రేమ, శక్తులు నన్ను కాపాడుతున్నాయి. దైవశక్తి నా చుట్టూ, నా కుటుంబం చుట్టూ వలయంలా ఉంది. నేను ప్రేమించేవాళ్లు సురక్షితం. ఈ గ్రహం మీది ప్రతి జీవినీ దైవశక్తి చేరుతోంది. ప్రతి ఒక్కరూ సురక్షితంగా, భయం లేకుండా, శక్తిమంతులుగా ఉన్నారు.'

– బి.కె. శివాని, బ్రహ్మకుమారి

వారెవ్వా!



గుజరాత్‌లో ఐదుగురు ఒక నకిలీ టోల్ గేటు పెట్టారు. 50 శాతం తక్కువ టోల్ ఆఫర్ పేరుతో జాతీయ హైవే నుంచి ట్రాఫిక్‌ను పక్కకు మళ్లించారు. ఎవరి కంటాబడకుండా ఏడాదిన్నర పాటు ఈ వ్యవహారం సాగింది. 75 కోట్లు సంపాదించారు. దీన్నే 'ఎంటైర్ పొలిటికల్ సైన్స్' అంటారు.

– కాజోల్ శ్రీనివాసన్, స్టాండప్ కమెడియన్

బలహీనత



ప్రపంచంలోని చాలా సమస్యలు ఓటర్లు చేసే సాధారణ తప్పిదం వల్ల వస్తాయి: చాలా పెద్ద మాటలు మాట్లాడేవాళ్లను 'బలమైన మనుషులు' అని వారు అనుకుంటారు. కానీ వాస్తవానికి అది వ్యతిరేకం. వాళ్ల బలహీనతలు, అభద్రతలను కప్పిపుచ్చుకోవడానికి వాళ్లు డంబాలు కొడుతుంటారు.

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

వారే సమర్థకులు



కొంచెం వ్యవస్థీకృతమైన స్టార్టప్స్‌తో నేను మాట్లాడుతున్నప్పుడు – వారి వృద్ధిరేటు ఎంత, లాభాల్లోనే ఉన్నారా అని అడిగిన తర్వాత, నేను తెలుసుకోవాలనుకునే మొదటి విషయం–వ్యవస్థాపకులకు ఇప్పటికీ బోర్డు మీద నియంత్రణ ఉన్నదా అని! ఒకవేళ జవాబు అవును అయితే, ఆ కంపెనీ గురించి నేను మరింత ఆశావాదంతో ఉంటాను.

– పాల్ గ్రాహమ్, కంప్యూటర్ శాస్త్రవేత్త

ఇన్ బాక్స్

పర్వత పర్యావరణ పునరుద్ధరణ

'రెస్టోరింగ్ మౌంటెయిన్ ఎకో సిస్టం' నినాదంతో ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 'ప్రపంచ పర్వత దినోత్సవం' జరుపుకొంటున్నారు. పర్వత పర్యావరణాన్ని పునరుద్ధరించే దిశలో వివిధ ప్రభుత్వ, స్వచ్ఛంద, పర్వతారోహణ సంస్థలు ప్రజలకు... ముఖ్యంగా భావి పౌరులైన యువతకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా మంచుతో కూడుకున్న పర్వతాలు అనేకం ఉన్నాయి. ఈ పర్వతాల మీద ప్రపంచ జనాభాలో 15 శాతం ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారు. చాలా పర్వతాలపై వాతావరణ మార్పు ప్రభావం తీవ్రంగా ఉంది. మంచుతో కూడిన పర్వతాలు అత్యంత అకర్షణీయ సాహస పర్యాటక ప్రాంతాలుగా పర్యాటకంపై ఆధారపడిన వారికి ఆదాయ మార్గం అయ్యాయి. ముఖ్యంగా నేపాల్, యూరప్‌లోని కొన్ని దేశాలు, ఆఫ్రికాలోని కొన్ని దేశాలు పూర్తిగా ఈ పర్వతాలపై ఆధారపడి మనుగడ సాగిస్తున్నాయి.

మన భారత దేశంలో హిమాలయ శ్రేణులు ఉత్తరాన పెట్టని గోడగా ఉండటమే కాక, దేశంలోని ఆ ప్రాంతం జీవనదులతో సస్యశ్యామలం కావడానికి కారణమవుతున్నాయి. ప్రాచీన కాలం నుంచి మన నాగరికతా సంస్కృతులకు ఈ నదీ లోయలూ, మైదానాలే కేంద్రాలుగా ఉన్న విషయం గమనార్హం.

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లలో స్థాపితమైన ఎడ్వంచర్ క్లబ్‌లు పర్వతారోహణ వంటి సాహస కృత్యాలను ప్రోత్సహిస్తూనే పర్వతారోహకులకు వాస్తవ పరిస్థితులను తెలియచేస్తున్నాయి. ఇందువల్ల పర్వతావరణం కలుషితం కాకుండా పర్వతారోహకులు మసలుకునే అవకాశం ఉంది. ఫలితంగా వివిధ ప్లాస్టిక్, ఇతర హానికారక వ్యర్థాల నుండి పర్వతాలూ, కొండలూ రక్షించబడతాయి.

– కె. రంగారావు, ఏసీఏపీ–ఏసీటీఏస్ వ్యవస్థాపకులు

(నేడు అంతర్జాతీయ పర్వత దినోత్సవం)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

సమానత్వానికి ప్రతీక చాపకూడు

భారతదేశ చరిత్రలో మొట్టమొదటి 'సమతా సమానతా వాదం' పల్నాటి వీరుల మస్తిష్కంలో మనకు గోచరిస్తుంది. అప్పటి వరకు ఉన్న కుల నిచ్చెన మెట్లను ధ్వంసం చేసి సమతాస్మృతి నిర్మాణం జరిగేట్లు పల్నాటి వీరులు కృషిచేశారు. కాబట్టే వెయ్యేండ్ల క్రితం ఆ వీరులు నేలకొరిగిన 'కార్యమపూడి' (కారెంపూడి) రణక్షేత్రంలో నేటికీ వారిని స్మరించుకుంటూ, వారి ఆయుధాలను పూజించుకుంటూ, సమతావాదం కోసం పల్నాటి ఆచారవంతులు కృషి చేస్తున్నారు. భారత దేశ చరిత్రలో అంటరానితనం నిర్మూలనకు వెయ్యేండ్ల క్రితమే పల్నాడులో బ్రహ్మనాయుడు కృషి చేశాడు. దళితులకు ఆలయ ప్రవేశం గావించాడు. 'చాపకూడు సిద్ధాంతా'న్ని అమలు చేశాడు. రాజ్యాధికారంలో అన్ని కులాల వారికీ... అంటే శూద్రులకూ, రేచర్ల మాలలకూ సమ ప్రాధాన్యం ఇచ్చాడు. మొదటగా రేచర్ల మాలలకు రాజ్య సర్వసైన్యాధ్యక్ష పదవిని ఇచ్చింది పల్నాటి రాజ్యమే!

పల్నాడు ప్రాంతంలో 1182వ సంవత్సరంలో జరిగిన యుద్ధం 'పల్నాటి యుద్ధం'గా చరిత్రలో నిలిచింది. మహాభారతానికీ, పల్నాటి వీర చరిత్రకూ దగ్గరి పోలికలు ఉండటం చేత పల్నాటి చరిత్రను 'ఆంధ్ర భారతం' అని కూడా అంటారు.

పల్నాటి చరిత్రలో నలగామరాజు, నరసింగ రాజు, మలిదేవరాజులు ముప్పురూ వేర్వేరు తల్లుల బిడ్డలు. వీరి తండ్రి అనుగురాజు. వీరి మధ్య కోడిపందాల మూలంగానూ, రాజకీయ కుట్ర మూలంగానూ ద్వేషాలు రగిలి యుద్ధానికి దారితీసింది. ఈ యుద్ధం కూడా రాజ్యభాగం కోసమే జరిగింది. బాలచంద్రుని మరణానికీ మహాభారతంలో అభిమన్యుని మరణానికీ మధ్య సారూప్యం ఉంది.

పల్నాటి యుద్ధంలో వాడిన ఆయుధాలను ప్రతి సంవత్సరం కార్తీకమాసం చివరి అమావాస్య రోజున నాగులేటిలో స్నానమాచరింప చేసి వీరారాధన ఉత్సవాలను ప్రారంభించటం ఆనవాయితీ. మార్గశిర మాసంలోని మొదటి రోజు నుంచి పంచమిరోజు వరకు 5 రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. బ్రహ్మనాయుని ఆజ్ఞను పాటిస్తూ... పల్నాటి 'వీరాచార పీఠం' ఈ వేడుకలు నిర్వహిస్తూ వస్తోంది. మొదటి రోజు 'రాచగావు', రెండవ రోజు 'రాయబారం' మూడవ రోజు 'మందపోటు' (చాపకూడు), నాల్గవ రోజు 'కోడి పోరు', ఐదవ రోజు 'కల్లిపాడు' కార్యక్రమాలతో వీరారాధన ఉత్సవాలుగా జరుపుతూ ఉన్నారు. ఈ ఉత్సవాల్లో 'వీరవిద్యావంతులు' ఆలపించే కథలు భావి తరాలకు ముందస్తు హెచ్చరికలు! తగిన జాగ్రత్తలు! మనో వికాస విజ్ఞానిక విపంచులు!



పల్నాటి వీరారాధన ఉత్సవాలు

ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పల్నాటి ఆచారవంతులంతా కారెంపూడిలో జరిగే ఈ వేడుకలకు కుటుంబ సమేతంగా వేలాదిగా హాజరవుతూ ఉంటారు. సమతా ధర్మం పాటించే వారికి ఇష్టమైన ప్రీతికరమైన దేవుడు చెన్న కేశవుడు. బ్రహ్మ నాయుడు వాడిన 'నృసింహకుంతం' రూపంలో చెన్న కేశవుని భక్తులు పూజిస్తారు.

చాలా ఊళ్లలో ఈ రూపంలో పూజలందుకుంటున్న ఈ దైవాలు (నృసింహ కుంతాలు) ప్రతి కార్తీక చివరి అమావాస్య రోజున కార్యమపూడిలోని నాగులేటి ఒడ్డున స్నాన మాచరించి భక్తులకు దర్శనమిస్తాయి. ఈ 5 రోజుల పల్నాటి వీరారాధన ఉత్సవాలలో ముచ్చటగా మూడవరోజు జరిపే 'చాపకూడు' ఉత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామాల్లో అధికారికంగా నిర్వహించాలని భక్తులు కోరుతున్నారు. సమతా భావం మరింతగా వెల్లివిరియడానికి ఇది అవసరం.

– ధర్మాశి చిరంజీవి । 70950 91228

(రేపటి నుంచి 16వ తేదీ వరకు కారెంపూడిలో 'పల్నాటి వీరారాధన' ఉత్సవాలు)

శాంతి – అశాంతి

ఒక ఊళ్ళో ఆగర్భ శ్రీమంతుడున్నాడు. ఒకరోజు అతనికి అర్ధరాత్రి అయినా నిద్ర పట్టక డాబా మీదకు వెళ్లి, ఆకాశంలో నక్షత్రాలనూ, చందమామనూ చూస్తుండగా, అతని దృష్టి తన ఇంటి పక్కన ఉన్న పూరిపాక మీద పడింది. అందులో ఉండే కూలి పని చేసుకునే వ్యక్తి, పాక బయట నేల మీద చింకి చాప మీద గురక పెట్టి నిద్ర పోతూ ఉండటం ధనవంతుడు చూశాడు. 'కటిక నేల మీద అంత హాయిగా ఎలా నిద్ర పోతున్నాడు? రేపటి గురించి అతనికి ఆలోచన లేదా?' అనుకున్నాడు.

మర్నాడు ధనవంతుడు తన గురువు దగ్గరకు వెళ్లి, తన నిద్ర పట్టని సమస్య, పేదవాని నిశ్చింత నిద్రలను గురించి చెప్పి, 'అతను అంత బాగా ఎలా నిద్ర పోయాడు?' అనడిగాడు. అప్పుడు గురువు, ధనవంతునితో 'నువ్వు అతనికి ఇవాళ ఒక బస్తా బియ్యం, వంట సామాను, ఓ వెయ్యి రూపాయలు ఇవ్వు. ఈ రాత్రి ఏమవుతుందో చూడు' అన్నారు. ధనవంతుడు ఆ పేదవానికి అలాగే ఇచ్చాడు. ఆ రాత్రి మళ్ళీ ధనికుడు నిద్ర పట్టక డాబా మీదకు వెళ్లాడు. పాక వైపు చూశాడు. పేద వ్యక్తి కూడా నిద్ర పట్టక అటూ ఇటూ పొర్లుతూ ఉండటం చూశాడు. మర్నాడు పేదవానిని పిలిచి ధనికుడు 'నిన్న రాత్రి నీకు నిద్ర బాగా పట్టిందా?' అనడిగాడు. అతను 'లేదు' అన్నాడు. 'ఎందుకని' అడిగాడు ధనికుడు. అప్పుడా పేద వ్యక్తి 'నా గుడిసె తలుపుకి లోపల గడియ లేదు. మీరిచ్చిన డబ్బు, సామాను ఎవరైనా ఎత్తుకుపోతారేమోనన్న భయంతో నిద్ర పట్టలేదు' అన్నాడు.

నాది అనుకునే భౌతిక సంపద ఎక్కువయ్యే కొద్దీ మనిషి దాన్ని కాపాడుకోవాలనే తపనతో శాంతికి దూరమవుతాడని ధనికుడు గ్రహించాడు. గురువు సందేశం అతనికి బాగా అర్థమయింది.

'ఈశావాస్యోపనిషత్తు' చెప్పేది ఇదే. ఈ లోకంలోని ఐశ్వర్యాలు, అవి అందించే సుఖ భోగాలు మార్పులకు లోనయ్యేవి. అశాశ్వతాలు. శాశ్వతానందాన్ని ఇచ్చేది, అశాంతి నుంచి ముక్తిని కలిగించి శాంతి నిచ్చేది భగవంతుని చింతన మాత్రమే!

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

క్లుప్తంగా...

మదర్ డెయిరీ పాలకవర్గం రద్దు

- రంగారెడ్డి జిల్లా సహకార అధికారి ఉత్తర్వులు జారీ

నల్లగొండ అగ్రికల్చర్/యాదాద్రి: నల్లగొండ, రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం (మదర్ డెయిరీ) పాలకవర్గాన్ని రద్దు చేస్తూ రంగారెడ్డి జిల్లా సహకార అధికారి ధాత్రిదేవి ఉత్తర్వులను జారీ చేశారు. నూతన డైరెక్టర్ల ఎంపికకు మూడు పేర్లతో కూడిన అడ్ హక్ కమిటీని ఏర్పాటు చేయాలని సంఘం ఎండీకి సూచించారు. ఈ ఏడాది సెప్టెంబర్ చివరి నాటికి ముగ్గురు నూతన డైరెక్టర్ల ఎంపికకు ఎన్నికలను నిర్వహించలేదని కొందరు సభ్యులు రంగారెడ్డి జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె సహకార శాఖ సీనియర్ అధికారితో విచారణ జరిపించారు. ఆ విచారణ నివేదికల ఆధారంగా ప్రస్తుత పాలకవర్గ సభ్యులను అనర్హులుగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల కాపీలను పాలకవర్గ సభ్యులకు, సంఘం ఎండీకి, సహకార శాఖ కమిషనర్‌కు పంపించారు. కాగా, రద్దు అయిన పాలకవర్గం సభ్యులు మూడేళ్ల వరకు పోటీ చేయడానికి అనర్హులుగా ప్రకటించారు.

పార్టీ మారడానికి సిద్ధమైన పాలకవర్గం

పాలకవర్గం రద్దవుతుందన్న విషయం పసిగట్టిన సభ్యులు దాన్ని అడ్డుకునేందుకు పార్టీ మారేందుకు కూడా సిద్ధమయ్యారు. మాజీమంత్రికి అత్యంత సన్నిహితుడైన ఓ డైరెక్టర్ మధ్యవర్తిగా ఉండి అధికార పార్టీ ఎమ్మెల్యేను కలిసి పాలకవర్గం రద్దు కాకుండా అడ్డుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించారు. ఖాళీగా ఉన్న డైరెక్టర్ల స్థానంలో మాజీ చైర్మన్‌ను డైరెక్టర్‌గా ఎన్నుకోవడానికి కూడా ఒప్పుకున్నారు. కానీ, టీఎస్ మాక్స్ చట్టం ప్రకారం పాలకవర్గం రద్దవుతుందని తెలియడంతో ఎమ్మెల్యే కూడా వారికి ఎటువంటి హామీ ఇవ్వలేదని తెలుస్తోంది.

ఎక్స్‌ప్రెస్ రైలు కింద చెలరేగిన మంటలు

- అప్రమత్తమైన సిబ్బంది.. తప్పిన ప్రమాదం



మరమ్మతులు చేపడుతున్న రైల్వే సిబ్బంది

బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ రైల్వేస్టేషన్ మీదుగా వెళ్తున్న సిర్పూర్–కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద ఒక్కసారిగా మంటలు చెలరేగిన ఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. సికింద్రాబాద్ నుంచి ఉదయం 8 గంటలకు బయలుదేరిన ఎక్స్‌ప్రెస్ రైలు బీబీనగర్ మండలం కొండమడుగు మెట్టు సమీపంలోకి రాగానే రైలు వీల్స్ లోపలి భాగాల్లో బ్రేక్ లైనర్లు ఒక్కసారిగా పట్టుకోవడంతో మంటలు చెలరేగాయి. మంటలను గమనించిన రైల్వేసిబ్బంది అప్రమత్తమై బీబీనగర్ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్‌ను నిలిపివేయించారు. అనంతరం సిబ్బంది, అధికారులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి మరమ్మతులు చేయించారు. ఆ తర్వాత రైలును పంపించివేశారు. రైలు అరగంటకు పైగా స్టేషన్‌లో నిలిచిపోవడంతో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అయితే ఎలాంటి ప్రమాదం తలెత్తకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఐజేఎస్ఓ-2023లో నారాయణ విద్యార్థుల విజయం

సాక్షి, హైదరాబాద్: పదహారేళ్లలోపు విద్యార్థుల్లో సైన్స్‌రంగంలో ప్రతిభావంతుల్ని గుర్తించడంలో భాగంగా థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్ వేదికగా నిర్వహించిన 20వ అంతర్జాతీయ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్ (ఐజేఎస్ఓ) -2023లో నారాయణ విద్యా సంస్థలకు చెందిన ఇద్దరు విద్యార్థులు స్వర్ణ పతకాలు గెలుచుకున్నారు. నారాయణ విద్యాసంస్థలకు చెందిన కనిష్క్ జైన్, సోహమ్ పెద్నేకర్‌లు అద్భుతమైన ప్రతిభా పాటవాలను ప్రదర్శించి ఈ బంగారు పతకాలు సాధించారు. ఈ మేరకు నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు పి.సింధూర, పి.శరణ నారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఐడీ లేక.. వేతనం రాక..

- వీఆర్ఏల వేతన వెతలు
- నాలుగు నెలల కిందట వివిధ శాఖల్లో సర్దుబాటు
- అప్పటి నుంచి అందని జీతాలు
- రాష్ట్రవ్యాప్తంగా 14,954 మంది ఎదురుచూపులు



సాక్షి, కామారెడ్డి: గ్రామ రెవెన్యూ అసిస్టెంట్ (వీఆర్ఏ) వ్యవస్థను రద్దు చేసిన గత ప్రభుత్వం వారిని వివిధ శాఖల్లో సర్దుబాటు చేసి నాలుగు నెలలు గడుస్తున్నా ఎంప్లాయ్ ఐడీ ఇవ్వకపోవడంతో వేతనాలు అందడం లేదు. జీతాల కోసం రాష్ట్రంలో 14,954 మంది వీఆర్ఏలు ఎదురు చూస్తున్న దుస్థితి నెలకొంది. రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేయాలని భావించిన గత సర్కారు.. మొదట వీఆర్వో వ్యవస్థను రద్దు చేసి, ఉద్యోగులను వివిధ శాఖల్లో సర్దుబాటు చేసింది. తర్వాత వీఆర్ఏలను కూడా వారి విద్యార్హతలను బట్టి వివిధ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్లుగా, రికార్డు అసిస్టెంట్లుగా, ఆఫీసు సబార్డినేట్లుగా సర్దుబాటు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 23 వేల మంది గ్రామ సేవకులు (వీఆర్ఏ) ఉండగా వారిలో తొలి విడతలో 14,954 మందిని వివిధ శాఖల్లో సర్దుబాటు చేశారు. రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్లుగా 2,451 మంది, మున్సిపాలిటీల్లో జూనియర్ అసిస్టెంట్లు, వార్డ్ ఆఫీసర్లుగా 1,266 మంది, రెవెన్యూ శాఖలో రికార్డు అసిస్టెంట్లుగా 2,113 మంది, ఆఫీసు సబార్డినేట్లుగా 680 మంది, నీటి పారుదల శాఖలో 5వేల మంది, మిషన్ భగీరథలో 3,372 మందిని సర్దుబాటు చేశారు. మరికొన్ని శాఖల్లో మరో 72 మందిని సర్దుబాటు చేసినట్టు తెలుస్తోంది. ఇక వృద్ధాప్యంతో ఉన్న వారు, వారసులు లేకపోవడం వంటి కారణాలతో కొందరి ఉద్యోగాలు సర్దుబాటు కాలేదు. ఈ ఏడాది ఆగస్టు 10న వీఆర్ఏలను వివిధ శాఖల్లో సర్దుబాటు చేస్తూ పోస్టింగ్‌లు కూడా ఇచ్చారు. ఎక్కడ పోస్టింగ్ ఇచ్చారో అక్కడే జాయిన్ కావాలని ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో దూరమైనా సరే వెళ్లి ఉద్యోగాల్లో జాయిన్ అయి పని చేస్తున్నారు.

ఇంకా ఎంప్లాయ్ ఐడీ జనరేట్ కాలేదు

ఎంప్లాయ్ ఐడీ నమోదైన తర్వాతనే వారిని ప్రభుత్వ ఉద్యోగుల కింద లెక్కగట్టి వేతనాల ప్రక్రియను మొదలుపెడతారు. వీఆర్ఏలను ఆయా ఉద్యోగాల్లో సర్దుబాటు ప్రక్రియను చేపట్టిన గత ప్రభుత్వం వారికి ఐడీ ఇంకా ఇవ్వలేదు. ఇంతలో ఎన్నికల ప్రక్రియ మొదలుకావడంతో ఆ విషయం పక్కకు వెళ్లింది. ఫలితంగా నాలుగు నెలలుగా వేతనాలు అందక వీఆర్ఏలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బదిలీలతో ఊరు కాని ఊరు వెళ్లిన తాము అప్పులు చేసి జీవనం సాగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త ప్రభుత్వం పరిష్కరించాలి



వీఆర్ఏలుగా పనిచేస్తున్న మమ్మల్ని వివిధ శాఖల్లో రెగ్యులర్ ఉద్యోగాల్లో సర్దుబాటు చేయడంతో ఎంతో సంతోషించాం. అయితే మాకు వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం మా సమస్యను వెంటనే పరిష్కరించాలి. – ముదాం చిరంజీవి, వీఆర్ఏల సంఘం ప్రతినిధి, కామారెడ్డి

మహిళకు టికెట్ జారీ అవాస్తవం

- పురుషులకోసమని భావించి టికెట్ జారీ
- కండక్టర్ తప్పిదం లేదు
- ఆర్టీసీ అధికారుల విచారణలో వెల్లడి

ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): నిజామాబాద్ జిల్లా బోధన్ డిపో పరిధిలో మహిళకు టికెట్ జారీ చేసిన ఘటనలో కండక్టర్ తప్పిదం లేదని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ జరిపిన విచారణలో వెల్లడైంది. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 9న మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మహిళకు టికెట్ జారీ చేశారంటూ వైరల్ అయిన వార్తపై టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు కండక్టర్‌ను డిపో స్పేర్‌లో ఉంచి పూర్తిస్థాయిలో ఆర్టీసీ అధికారులు విచారణ జరిపారు. ఈ మేరకు విచారణలో కండక్టర్ ఉద్దేశపూర్వకంగా టికెట్ జారీ చేయలేదని వెల్లడైంది. నిజామాబాద్–బోధన్ రూట్ పల్లె వెలుగు బస్సులో నిజామాబాద్ టౌన్ బస్టాండ్ వద్ద ఆదివారం ముగ్గురు ఎక్కారు. అందులో ఒక పురుషుడు, ఇద్దరు మహిళలు ఉన్నారు. పురుష ప్రయాణికుడు ముగ్గురికి బోధన్‌కు టికెట్ ఇవ్వమని కండక్టర్‌ను కోరారు. ఒక్కొక్కరికి రూ.30 చొప్పున ముగ్గురికి రూ.90 టికెట్‌ను కండక్టర్ జారీ చేశారు. నిజామాబాద్ టౌన్ దాటిన తర్వాత పురుష ప్రయాణికుడు కండక్టర్ వద్దకు వచ్చి.. మహిళలకు ఉచితం కదా?.. టికెట్ ఎందుకు జారీ చేశారని ప్రశ్నించారు. ముగ్గురు పురుషులే అనుకుని టికెట్ జారీ చేశానని, అన్యథా భావించవద్దని కండక్టర్ సమాధానం ఇచ్చారు. వెంటనే ఆ టికెట్‌ను వెనక్కి తీసుకుని పూర్తి డబ్బును తిరిగి ప్రయాణికుడికి అందజేశారు.

పకడ్బందీగా మహాలక్ష్మి పథకం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి–మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం పకడ్బందీగా అమలవుతోందని టీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ సౌకర్యంపై క్షేత్రస్థాయి సిబ్బంది అందరికీ ఇప్పటికే అవగాహన కల్పించామని తెలిపారు. క్షేత్ర స్థాయిలో టికెట్ జారీ ఘటనలు పునరావృతం కాకుండా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు సజ్జనర్ వెల్లడించారు.

పాము కాటుతో రైతు మృతి



ఊదరి లింగస్వామి

భూదాన్‌పోచంపల్లి: పాము కాటుతో రైతు మృతి చెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం వంకమామిడి గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనపై గ్రామస్తులు తెలిపిన వివరాలివి. గ్రామానికి చెందిన రైతు ఊదరి లింగస్వామి (45) ఆదివారం మధ్యాహ్నం భార్య అనితతో కలిసి పొలం పనులకు వెళ్లాడు. పనులు ముగించుకొని సాయంత్రం పొలం గట్టుపై నుంచి నడుచుకుంటూ వస్తుండగా లింగస్వామి కాలిపై పాము కాటు వేసింది. మెరుగైన చికిత్స నిమిత్తం వెంటనే అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.



క్యూలైన్లలో బారులుతీరిన భక్తులు

భక్త జన యాదాద్రి

- 70వేల మందికి పైగా భక్తుల రాక

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. కార్తీకం చివరి వారం కావడం.. స్వాతి నక్షత్రం కలిసి రావడంతో 70 వేల మందికి పైగా భక్తులు జంట నగరాలు, వివిధ రాష్ట్రాలతో పాటు ఆయా జిల్లాల నుంచి తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణ కట్ట, ఘాట్‌రోడ్లు, మెట్ల మార్గం, గిరిప్రదక్షిణ దారి, కొండపై, కొండ కింద బస్టాండ్లు, పార్కింగ్ ప్రాంతాలు భక్తులతో కళకళలాడాయి. భక్తులు అధికంగా రావడంతో శ్రీస్వామి వారి ధర్మదర్శనానికి 6 గంటలు, వీఐపీ దర్శనానికి రెండున్నర గంటలు, బ్రేక్ దర్శనానికి 30 నిమిషాల సమయం పట్టింది. ఈ క్రమంలో భక్తులు క్యూలైన్లలో ఇబ్బందులు పడ్డారు. కొండ కిందినుంచి కొండపైకి, కొండపై నుంచి కొండ కిందకు బస్సుల్లో వెళ్లే భక్తులు సీట్ల కోసం వాగ్వాదానికి దిగారు. మెట్ల మార్గంలో, ఘాట్ దారిలో వందల సంఖ్యలో భక్తులు కాలి నడకన కొండపైకి చేరుకున్నారు. అటు శివాలయం, అనుబంధ పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాల్లో భక్తుల సందడి కనిపించింది. వివిధ పూజలతో రూ.1,09,40,868 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

వైభవంగా వ్రతాలు: ఆలయంలో ఆదివారం శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలను భక్తులు వైభవంగా నిర్వహించారు. ఉదయం 6.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఆరు బ్యాచ్‌లుగా భక్తులు వ్రత పూజలను జరిపించారు. పూజల్లో 1,558 జంటలు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. దీంతో శ్రీస్వామి వారి ఆలయానికి రూ.12,46,400 ఆదాయం వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

హామీల అమలుకు ఒత్తిడి తేవాలి

- బీఆర్ఎస్‌పై వ్యతిరేకతతోనే కాంగ్రెస్‌కు అధికారం
- మావోయిస్టు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్

ఏటూరునాగారం: 'తెలంగాణలో దశాబ్ద కాలంపాటు ప్రజావ్యతిరేక నిరంకుశ పాలన కొనసాగించిన బీఆర్ఎస్ పార్టీని తిరస్కరించిన ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించారు. అయితే ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని ఒత్తిడి తేవాలి' అని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ ప్రజలను కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంవత్సరంలోపే జాబ్ కేలండర్ ప్రకటించి, నిరుద్యోగులకు ప్రభుత్వరంగ సంస్థల్లో అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్లు లేని తెలంగాణను ప్రజలు కోరుకుంటున్నారని, జైళ్లలో మగ్గుతున్న రాజకీయ ఖైదీలను విడుదల చేయాలన్నారు. పంటలకు న్యాయమైన ధరలు కల్పించాలని, భూస్వాములకు అనుకూలమైన ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని, రాష్ట్రంలో మిగులు, ప్రభుత్వ, బంజరు భూములను వ్యవసాయ కూలీలకు పంచడంతోపాటు ప్రాజెక్టుల పేరుతో జరుగుతున్న పర్యావరణ విధ్వంసాన్ని, ప్రజల నిర్వాసిత సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాలకు స్వయంప్రతిపత్తి, జల్–జంగల్–జమీన్‌పై పూర్తిగా ఆదివాసీలకే అధికారం కల్పించాలని డిమాండ్ చేశారు.

ముళ్లపొదల్లో శిశువు మృతదేహం

- పీక్కుతిన్న కుక్కలు, పందులు
- జహీరాబాద్‌లో దారుణం

జహీరాబాద్: ముళ్లపొదల్లో పసికందు మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో ఆదివారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం... గుర్తుతెలియని మహిళ అప్పుడే పుట్టిన శిశువును అహ్మద్‌నగర్ కాలనీ చివరన రైల్వేట్రాక్ సమీపంలో గల ముళ్లపొదల్లో పారేసి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. రెండురోజుల క్రితం ఇది జరిగి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఆ సమయంలో శిశువు ప్రాణంతో ఉందా? లేదా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. అయితే మృతదేహాన్ని సగం వరకు కుక్కలు, పందులు పీక్కుతిన్నాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ శ్రీకాంత్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పత్తి ఏరేందుకు వెళ్లి..

- ముగ్గురు మహిళల దుర్మరణం
- ఆటోను మినీ ట్రక్ ఢీకొట్టడంతో ప్రమాదం
- తొమ్మిది మందికి కూలీలకు తీవ్ర గాయాలు
- సిద్దిపేట జిల్లా వట్టిపల్లి సమీపంలో దుర్ఘటన




రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

జగదేవ్‌పూర్(గజ్వేల్): మరో ఇరవై నిమిషాల్లో ఇంటికి చేరుకునే లోగానే టాటా ఏస్(ట్రాలీ ఆటో– మినీ ట్రక్) రూపంలో దారి కాచిన మృత్యువు ముగ్గురి కూలీలను కబళించింది. ఈ విషాద ఘటన ఆదివారం రాత్రి సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం వట్టిపల్లి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. కొమురవెల్లి మండ లం గురువన్నపేట గ్రామానికి చెందిన 12 మంది కూలీలు ఆదివారం ఉదయం అదే గ్రామానికి చెందిన మహేశ్ ఆటోలో జగదేవ్‌పూర్ మండలం బీజీవెంకటాపూర్ గ్రామానికి చెందిన పొలంలో పత్తి తీసేందుకు వచ్చారు. పనులు ముగించుకుని తిరిగి అదే ఆటోలో వెళ్తున్న క్రమంలో వట్టిపల్లి గ్రామ సమీపానికి రాగానే కొండపోచమ్మ వైపు నుంచి ఎదురుగా వస్తున్న టాటా ఏస్ బలంగా ఢీ కొంది. దీంతో ఆటోలో ఉన్న పుట్ట జయమ్మ(60), వైనాల శిరీష (17) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గుర్రాల లక్ష్మి (45) గజ్వేల్ ఆస్పత్రిలో మృతి చెందింది. మరో తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏడాదిలో 119 మంది ఖైదీల ఆత్మహత్య

- వీరిలో 109 మంది ఉరేసుకుని బలవన్మరణం
- దేశవ్యాప్తంగా 2022లో 1,955 మంది మృతి
- 1,773 మంది ఖైదీల సహజ మరణం
- 159 మంది అసహజ కారణాలతో మృత్యువాత
- తెలంగాణలో 13 మంది మరణించారన్న ఎన్‌సీఆర్‌బీ



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఉన్న అన్ని జైళ్లలో కలిపి 2022 సంవత్సరంలో 119 మంది ఖైదీలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరిలో 109 మంది ఉరి వేసుకున్నారు. ఈ ఏడాది తెలంగాణలోని అన్ని జైళ్లలో కలిపి 11 మంది ఖైదీలు సహజ మరణం పొందగా, ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారని తెలిపింది. కాగా 2021తో పోల్చుకుంటే ఖైదీల మరణాలు తగ్గడం గమనార్హం. దేశవ్యాప్తంగా జైళ్లలో పరిస్థితులు, ఖైదీల మరణాలపై నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) ఒక నివేదిక రూపొందించింది. ఇందులోని వివరాలను ఇటీవల కేంద్ర హోంశాఖ వెల్లడించింది. 2022లో దేశవ్యాప్తంగా అన్ని జైళ్లలో కలిపి 1,955 మంది ఖైదీలు మృతి చెందారు. 1,773 మందిది సహజ మరణం కాగా, 159 మంది అసహజ రీతిలో మరణించారు. మిగతావి మిస్టరీ మరణాలు. సహజ మరణం పొందిన 1,773 మందిలో 1,670 మంది అనారోగ్యంతో, మరో 103 మంది వృద్ధాప్యం కారణంగా మృతి చెందారు. అనారోగ్య మృతుల్లో 428 మంది ఖైదీలు గుండె సంబంధ వ్యాధులతో, 190 మంది ఊపిరితిత్తుల సమస్యలతో, మరో 100 మంది క్యాన్సర్ కారణంగా మరణించారు. టీబీ కారణంగా 89 మంది, కిడ్నీ సమస్యలతో 81 మంది, బ్రెయిన్ హెమరేజ్‌తో 58 మంది, డ్రగ్స్, ఆల్కహాల్ విత్ డ్రావల్ లక్షణాల కారణంగా 37 మంది మృతి చెందారు. అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 351 మంది అనారోగ్యంతో మరణించారు. పశ్చిమ బెంగాల్ (174), బిహార్ (167) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

అసహజ మరణాల్లో హత్యలు, దాడులు

అసహజ మరణాల్లో 109 మంది ఉరేసుకోగా 10 మంది ఇతర ప్రమాదాల్లో మృతి చెందారు. తోటి ఖైదీల చేతుల్లో నలుగురు హత్యకు గురయ్యారు. బయటి వారి దాడిలో ఒకరు, కారణాలు తెయని మరణాలు మరో 25 వరకు నమోదయ్యాయి. అసహజ మరణాల్లోనూ అత్యధికంగా ఉత్తర ప్రదేశ్‌లోనే 24 మంది మృతి చెందారు. 17 మందితో కర్ణాటక, 15 మందితో హరియాణ ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

పారిపోయింది 257 మంది.. పట్టుకుంది 113 మందిని

మొత్తం 257 మంది ఖైదీలు జైళ్ల నుంచి పారిపోయినట్టు ఎన్‌సీఆర్‌బీ నివేదిక వెల్లడించింది. వీరిలో 113 మందిని తిరిగి పట్టుకోగలిగారు. 2020లో 355 మంది, 2021లో 312 మంది పారిపోయినట్టు నివేదిక తెలిపింది.

భారత్‌- దక్షిణ కొరియా బంధం బలీయం: మోదీ

న్యూఢిల్లీ: భారత్, దక్షిణకొరియాల సంబంధం పరస్పర గౌరవం, ఉమ్మడి విలువల ఆధారంగా మరింత బలపడుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. 'భారత్, దక్షిణ కొరియాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి నేటితో 50 ఏళ్లు పూరయ్యాయి. ఇది పరస్పర గౌరవం, ఉమ్మడి విలువలు, పెరుగుతున్న భాగస్వామ్యాలు కలగలిసిన ప్రయాణం'అని ఆయన పేర్కొన్నారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రెండు దేశాల మధ్య ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించుకునేందుకు ఆయనతో కలిసి పనిచేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. రెండు దేశాల మధ్య ఏర్పడిన సంబంధాలకు 50 ఏళ్లయిన సందర్భంగా ఆయన ఆదివారం ఈ మేరకు 'ఎక్స్‌'లో పోస్ట్‌ చేశారు.

19న 'ఇండియా' భేటీ

న్యూఢిల్లీ: ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు ఢిల్లీలో ఈ నెల 19న భేటీ కానున్నారు. ఈ సమావేశంలో సీట్ల పంపకం, ఉమ్మడి ఎజెండా, ఉమ్మడిగా ర్యాలీల నిర్వహణ వంటి కీలక అంశాలపై నేతలు ఒక అంగీకారానికి రావాల్సి ఉంది. కూటమి నాలుగో సమావేశం ఢిల్లీలో 19న సాయంత్రం 3 గంటలకు జరుగుతుందని కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్‌ 'ఎక్స్‌'లో ఆదివారం తెలిపారు. ప్రధాని మోదీకి దీటుగా మనం, నేను కాదు(మైనహీ, హమ్‌)అనే ఐక్య ఇతివృత్తంతో ఇండియా కూటమి నేతలు ముందుకు సాగుతారని ఆయన చెప్పారు. రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌ అసెంబ్లీలకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌ ఘోర పరాజయం పాలైన నేపథ్యంలో ఈ సమావేశం జరగనుండటం గమనార్హం. టీఎంసీ చీఫ్, పశ్చిమ బెంగాల్‌ సీఎం మమతా బెనర్జీ సహా కీలక నేతలు ఈ భేటీకి హాజరవుతారని భావిస్తున్నారు.

అమెరికాలో కాల్పులు.. ముగ్గురు దుర్మరణం

అట్లాంటా: అమెరికాలోని అట్లాంటాలో శనివారం సాయంత్రం చోటుచేసుకున్న కాల్పుల ఘటనలో ముగ్గురు మృతి చెందగా, ఒకరు గాయపడ్డారు. పీచ్‌ట్రీ రోడ్డులో సాయంత్రం 6.25 గంటల సమయంలో జరిగినట్లు సమాచారం అందిందని పోలీసు విభాగం తెలిపింది. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించామన్నారు. ఘటనకు సంబంధించిన ఇతర వివరాలేమీ వెల్లడికాలేదు.

టెన్నెసీలో తుఫానుకు ఆరుగురు బలి

నాష్‌విల్లే: అమెరికాలోని టెన్నెసీ రాష్ట్రాన్ని భీకర తుపాను వణికిస్తోంది. ఇళ్లు కూలిన ఘటనల్లో ఆరుగురు మృతి చెందగా 25 మందికి పైగా గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. నాష్‌విల్లేలోని మాంట్‌ గోమెరీ కౌంటీలో ఒక చిన్నారి సహా ముగ్గురు చనిపోయారు. నాష్‌విల్లే శివారులో జరిగిన ఘటనలో మరో ముగ్గురు చనిపోయారు.

దక్షిణ అమెరికాలోనూ యుద్ధ మేఘాలు!

గయానాతో కయ్యం దిశగా వెనెజులా ఎసెక్విబో ప్రాంతాన్ని ఆక్రమించే యత్నం

- అక్కడి అపార చమురు నిక్షేపాలపై కన్ను
- విలీనంపై రిఫరెండం, 95 శాతం సమర్థన
- గయానాకు మద్దతుగా అమెరికా

అటు రష్యా-ఉక్రెయిన్‌. ఇటు ఇజ్రాయెల్‌-పాలస్తీనా. ఇలా ఇప్పటికే రెండు యుద్ధాలతో దాదాపు రెండేళ్లుగా ప్రపంచం అల్లకల్లోలమవుతోంది. ఇవి చాలవన్నట్టు దక్షిణ అమెరికా ఖండంలో కూడా యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వాతావరణం అంతర్జాతీయ సమాజాన్ని తీవ్రంగా కలవరపెడుతోంది. బుల్లి దేశమైన గయానా అధీనంలో ఉన్న ఎసెక్విబో ప్రాంతంలోని అపార చమురు నిల్వలపై పొరుగు దేశం వెనెజులా కన్నేసింది. ఈ వివాదాస్పద ప్రాంతాన్ని పూర్తిగా కబళించే దిశగా పావులు కదుపుతోంది. ఈ పరిణామం తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీస్తోంది. గయానాకు అమెరికా దన్నుగా నిలుస్తుండటంతో పరిస్థితులు క్రమంగా ముదురు పాకాన పడుతున్నాయి...

దక్షిణ అమెరికాలోని ఎసెక్విబో ప్రాంతం రెండు శతాబ్దాలుగా వెనెజులా, గయానా మధ్య వివాదాలకు కారణంగా ఉంటూ వస్తోంది. ఇది తమదంటే తమదని రెండు దేశాలూ వాదిస్తున్నాయి. కాకపోతే దాదాపు గత వందేళ్లుగా ఈ ప్రాంతం గయానా అధీనంలోనే ఉంది. దీని విషయమై కొద్ది దశాబ్దాలుగా ఇరు దేశాల నడుమ అడపాదడపా కీచులాటలు సాగుతూనే వస్తున్నాయి. ఈ వివాదానికి ఫుల్‌స్టాప్‌ పెడుతున్నట్టు 2004లో అప్పటి వెనెజులా అధ్యక్షుడు హ్యూగో చావెజ్‌ ప్రకటనతో పదేళ్లపాటు ఉద్రిక్తతలు చల్లారాయి. కానీ ఎసెక్విబోను ఆనుకుని ఉన్న అట్లాంటిక్‌ సముద్ర జలాల్లో ఏకంగా 11 బిలియన్‌ బ్యారెళ్ల చమురు నిక్షేపాలున్నట్టు 2015లో బయట పడటంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఆ నిల్వలపై కన్నేసిన వెనెజులా అధ్యక్షుడు నికోలస్‌ మదురో, ఎసెక్విబో నిజానికి తమదేనన్న వాదనను తిరగదోడారు. దీన్ని ఇంటా బయటా పదేపదే ప్రస్తావిస్తూ వచ్చారు. ఎసెక్విబోను వెనెజులాలో కలిపేసుకుంటామని ప్రకటించి తాజాగా ఉద్రిక్తతలకు తారస్థాయికి తీసుకెళ్లారు. విలీనంపై వెనెజులాలో రిఫరెండం నిర్వహిస్తామని ప్రకటించడంతో గయానా అంతర్జాతీయ న్యాయస్థానానికి ఫిర్యాదు చేసింది. ఎలాంటి దుందుడుకు చర్యలూ చేపట్టొద్దన్న కోర్టు ఆదేశించిన రెండు రోజులకే వాటిని బేఖాతరు చేస్తూ మదురో డిసెంబర్‌ 3న వెనెజులావ్యాప్తంగా రిఫరెండం జరిపారు. ఏకంగా 95 శాతం మందిఎసెక్విబో విలీనానికి జై కొట్టినట్టు ప్రకటించారు. వెంటనే ఆ ప్రాంతాన్ని గయానా ఎసెక్విబా పేరిట వెనెజులాలో నూతన రాష్ట్రంగా చూపుతున్న కొత్త మ్యాపులను మదురో విడుదల చేసేశారు!


మదురో

రంగంలోకి అమెరికా

గయానాపై వెనెజులా సైనిక చర్యకు దిగవచ్చన్న వార్తలు కొద్ది రోజులుగా జోరందుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా హుటాహుటిన రంగంలోకి దిగింది. గయానాకు అన్నివిధాలా బాసటగా నిలుస్తామని ప్రకటించింది. డిసెంబర్‌ 7 నుంచి ఆ దేశంలో సంయుక్తంగా సైనిక విన్యాసాలు చేస్తూ వెనెజులాకు హెచ్చరికలు పంపుతోంది. దీని వెనక అమెరికా స్వీయ చమురు ప్రయోజనాలు దాగున్నాయి. ఎసెక్విబోలో చమురు నిల్వలను గుర్తించిన ఎక్సాన్‌ మొబిల్‌ అమెరికా చమురు దిగ్గజమే. ఒక్క 2022లోనే చమురు వెలికితీత ద్వారా ఆ కంపెనీకి ఏకంగా 600 కోట్ల డాలర్ల ఆదాయం సమకూరింది! వాటిని వదులుకోవడం అగ్ర రాజ్యానికి సుతరామూ ఇష్టం లేదు. దట్టమైన అడవులతో కూడిన ఎసెక్విబోపై దాడి చేయాలంటే సముద్ర మార్గమే వెనెజులాకు శరణ్యం. లేదంటే ఇరు దేశాలతో సరిహద్దు పంచుకుంటున్న బ్రెజిల్‌ గుండా వెళ్లాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో బ్రెజిల్‌ కూడా వెనెజులాతో తమ సరిహద్దుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేసింది. శాంతియుతంగా తేల్చుకోవాలని బ్రెజిల్‌ అధ్యక్షుడు లులా డసిల్వా మదురోకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో డిసెంబర్‌ 14న ఆయన సమక్షంలో సమావేశమై వివాదంపై చర్చించుకునేందుకు మదురో, గయానా అధ్యక్షుడు మొహమ్మద్‌ ఇర్ఫాన్‌ అలీ అంగీకరించినట్టు చెబుతున్నారు.

శతాబ్దాల వివాదం...

వెనెజులా, గయానా మధ్య ఎసెక్విబో వివాదం ఈనాటిది కాదు. వెనెజులా అప్పట్లో స్పెయిన్‌ వలస రాజ్యంగా ఉన్న రోజుల్లో ఈ ప్రాంతం వెనెజులా అధీనంలోనే ఉండేది. 1899 దాకా అలాగే కొనసాగింది. 1899లో జరిగిన అంతర్జాతీయ ఒప్పందం ప్రకారం గయానాకు దఖలు పడింది. కానీ అది మోసపూరిత ఒప్పందని వెనెజులా ఆరోపిస్తూ వస్తోంది. తమ ప్రాతినిధ్యం లేకుండా తమ తరఫున అమెరికా, బ్రిటన్‌ దీనికి తలూపాయని చెబుతోంది.

రాజకీయ ఎత్తుగడే!

నిజంగా గయానాపై దండెత్తడం మదురో ఉద్దేశం కాదని పరిశీలకులు భావిస్తున్నారు. 2013 నుంచీ అధికారంలో ఉన్న మదురోపై వెనెజులాలో తీవ్ర వ్యతిరేకత నెలకొని ఉంది. ఆయన పదేళ్ల పై చిలుకు పాలనలో దేశం పేదరికం కోరల్లో చిక్కిందన్న అభిప్రాయముంది. ఈ నేపథ్యంలో యుద్ధం పేరిట భావోద్వేగాలు రెచ్చగొట్టడం ద్వారా ప్రజల్లో వ్యతిరేకతను తగ్గించి, అధ్యక్ష ఎన్నికలను వీలైనంత కాలం వాయిదా వేసేందుకే ఆయన ఈ ఎత్తు వేశారని చెబుతున్నారు.



సహజ వనరుల గని

- ఎసెక్విబో ప్రాంతం అపార సహజ వనరులకు ఆలవాలం
- దీని విస్తీర్ణం దాదాపు 1.59 లక్షల చదరపు కిలోమీటర్లు
- గయానా మొత్తం భూభాగంలో మూడింట రెండొంతులు ఈ ప్రాంతమే విస్తరించి ఉంది
- కానీ గయానా మొత్తం జనాభా దాదాపు 8 లక్షలైతే అందులో ఎసెక్విబోలో ఉన్నది 1.2 లక్షల మందే
- ఈ ప్రాంతం నిండా దట్టమైన అమెజాన్‌ వర్షారణ్యాలే విస్తరించి ఉన్నాయి
- భారీ పరిమాణంలో బంగారం, రాగి తదితర ఖనిజ నిల్వలు కూడా ఉన్నాయి

- సాక్షి, నేషనల్‌ డెస్క్‌

శబరిమలలో భారీ రద్దీ.. దర్శన సమయం గంట పెంపు

పత్తనంతిట్ట: కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయానికి మాలధారుల తాకిడి పెరిగింది. దీంతో దర్శన సమయాన్ని గంట పొడిగించినట్లు ట్రావెన్‌కోర్‌ దేవస్వోమ్‌ బోర్డు(టీడీబీ)ఆదివారం ప్రకటించింది. సాయంత్రం దర్శనం 4 బదులు 3 గంటల నుంచే మొదలవనుంది. రోజూ వర్చువల్‌ క్యూ ద్వారా 90 వేల బుకింగ్‌లు, 30 వేల స్పాట్‌లో బుకింగ్స్‌ ఉంటున్నాయని ఆలయ ఏర్పాట్లను చూసే ఐజీ స్పర్జన్‌ కుమార్‌ చెప్పారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో వస్తుండటంతో దర్శనాలను త్వరత్వరగా సాఫీగా సాగేలా చూడాలన్న ప్రయత్నాలకు విఘాతం కలుగుతోందని వివరించారు. దర్శనానికి 15 నుంచి 20 గంటల వరకు భక్తులు ఎదురుచూపులు చూడాల్సి వస్తోందని అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వీడీ సతీశన్‌ పేర్కొన్నారు.

ఒడిశా ఐటీ దాడుల మొత్తం రూ.351 కోట్లు

న్యూఢిల్లీ/భువనేశ్వర్‌: ఒడిశా కేంద్రంగా మద్యం వ్యాపారం చేస్తున్న సంస్థకు సంబంధించిన ప్రాంతాల్లో ఆదాయ పన్ను(ఐటీ) అధికారులు చేసిన సోదాల్లో దొరికిన నగదు మొత్తం రూ.351 కోట్లకు చేరింది. దేశంలో ఒక దర్యాప్తు సంస్థ ఒకేసారి చేసిన సోదాల్లో ఇంతటి భారీస్థాయిలో కరెన్సీ బయటపడటం ఇదే తొలిసారి! బౌద్ధ్‌ డిస్టిలరీ ప్రైవేట్‌ లిమిటెడ్, దాని ప్రమోటర్లు, ఇతరులకు సంబంధించిన చోట్ల ఐటీ అధికారుల సోదాలు ఐదోరోజైన ఆదివారమూ కొనసాగాయి. మద్యం వ్యాపారం ద్వారా పొందిన దాంట్లో లెక్కల్లో చూపని ఆదాయం గుట్టుమట్లను ఐటీ శాఖ రట్టుచేస్తోంది. తనిఖీల్లో భాగంగా రాంచీలోని కాంగ్రెస్‌ రాజ్యసభ సభ్యుడు ధీరజ్‌ ప్రసాద్‌ సాహూ సంబంధిత ప్రాంతాల్లోనూ ఐటీ అధికారులు చెక్‌చేశారు. ఇక్కడ ఎంత మొత్తంలో నగదు, ఇతర పత్రాలు లభించాయనేది అధికారులు వెల్లడించలేదు. 'ఈ అంశం ధీరజ్‌ సాహూ కుటుంబ విషయం. దాదాపు వందేళ్లకు పైగా వారి కుటుంబం ఉమ్మడి వ్యాపారం చేస్తోంది. అందులో సాహూకు చిన్న వాటా ఉంది. ఏదేమైనా ఆయనకు సంబంధించిన చోట్ల సోదాలు జరిగాయికాబట్టి ఆయన ఈ విషయంలో వివరణ ఇవ్వాల్సిందే. అందుకే ఆయన నుంచి వివరణ తీసుకున్నాం. కాంగ్రెస్‌ పార్టీకి ఈ సోదాలకు సంబంధం లేదు'' అని జార్ఖండ్‌ కాంగ్రెస్‌ ఇన్‌చార్జ్‌ అవినాశ్‌ పాండే ఆదివారం స్పష్టంచేశారు.

విపక్షాలపై అమిత్‌ విమర్శలు

ఐటీ దాడులపై కేంద్ర హోం మంత్రి అమిత్‌ షా విమర్శించారు. '' దర్యాప్తు సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తుందని ఇన్నాళ్లూ విపక్షాలు ఎందుకు అన్నాయో ఇప్పుడు అర్థమవుతోంది. విపక్షాలు తమ అవినీతి, అక్రమ సొమ్ము వ్యవహారం ఎక్కడ బయటపడుతుందోనన్న భయంతోనే ఇన్నాళ్లూ విషప్రచారం చేశాయి. తీరా ఇప్పుడు కరెన్సీ కట్టలు బయటపడ్డాక కాంగ్రెస్, టీఎంసీ, జేడీయూ, డీఎంకే, ఆర్జేడీలు మౌనం వహిస్తున్నాయి'' అమిత్‌ వ్యాఖ్యానించారు.


నర్గీస్‌ తరఫున బహుమానం స్వీకరిస్తున్న ఆమె పిల్లలు (ఇన్‌సెట్లో నర్గీస్‌)

తల్లి తరఫున నోబెల్‌ శాంతి బహుమతి స్వీకరణ

కార్యక్రమంలో పాల్గొన్న ఇరాన్‌ కార్యకర్త నర్గీస్‌ కవలపిల్లలు

హెల్సింకీ: ఇరాన్‌ మానవ హక్కుల మహిళా కార్యకర్త నర్గీస్‌ మొహమ్మదీకి నోబెల్‌ కమిటీ ప్రకటించిన శాంతి బహుమతిని ఆమె తరఫున ఆమె కుమారుడు, కుమార్తె అందుకున్నారు. ఇరాన్‌లో మహిళల అణచివేత, మానవ హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా పోరాడుతున్న 51 ఏళ్ల నర్గీస్‌ను ఇరాన్‌ ప్రభుత్వం అక్రమ కేసులు మోపి టెహ్రాన్‌ జైలులో పడేసిన విషయం విదితమే. శనివారం నార్వేలోని ఓస్లోలో నర్గీస్‌ కవల పిల్లలు అలీ, కియానా రహ్మనీ పురస్కారాన్ని స్వీకరించారు. ''ఇరాన్‌ సమాజానికి అంతర్జాతీయ మద్దతు అవసరం. ప్రభుత్వ అరాచక పాలనకు వ్యతిరేకంగా గళమెత్తిన మానవహక్కుల కార్యకర్తలు, నిరసనకారులు, పాత్రికేయుల గొంతుకను సభావేదికగా గట్టిగా వినిపించండి'' అంటూ నర్గీస్‌ ఇచ్చిన సందేశాన్ని వేదికపై వారు చదివారు.

ఛత్తీస్‌ సీఎంగా విష్ణుదేవ్‌ సాయ్‌

బీజేపీ శాసనసభా పక్షసమావేశంలో ఎన్నుకున్న నేతలు

రాయ్‌పూర్‌: బీజేపీ అగ్రనాయకత్వం తీవ్ర చర్చోపచర్చల తర్వాత ఛత్తీస్‌గఢ్‌లో నూతన ముఖ్యమంత్రి ఎవరు? అనే ప్రశ్నకు సమాధానం లభించింది. ఆదివారం రాయ్‌పూర్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు హాజరైన పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో విష్ణుదేవ్‌ సాయ్‌ను సభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. 59 ఏళ్ల విష్ణుదేవ్‌ రాష్ట్రంలోని సుర్గుజా ప్రాంతంలోని జష్‌పూర్‌ జిల్లా కుంకురీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ ప్రాంతంలోని మొత్తం 14 స్థానాల్లోనూ బీజేపీనే విజయబావుటా ఎగరేసింది. ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యాక ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌ షా, బీజేపీ చీఫ్‌ నడ్డాలకు విష్ణుదేవ్‌ కృతజ్ఞతలు తెలిపారు. సీఎంగా బాధ్యతలు చేపట్టగానే ఎన్నికల హామీ ప్రకారం వెంటనే హౌజింగ్‌ పథకం కింద 18 లక్షల ఇళ్లు ఇస్తామని ఆయన ప్రకటించారు. రాయ్‌పూర్‌లో బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఎమ్మెల్యేల భేటీకి 54 మంది పార్టీ ఎమ్మెల్యేలతో పాటు పార్టీ అధిష్టానం పంపిన పర్యవేక్షకులు అర్జున్‌ ముండా, శర్బానంద సోనోవాల్, దుష్యంత్‌ కుమార్‌ గౌతమ్‌లు హాజరయ్యారు. సమావేశం తర్వాత రాష్ట్ర గవర్నర్‌ను విష్ణుదేవ్‌ తదితరులు కలిశారు. దీంతో నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలని కాబోయే ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌ను గవర్నర్‌ బిశ్వభూషణ్‌ హరిచందన్‌ ఆహ్వానించారని రాజ్‌భవన్‌ ఒక ప్రకటనలో పేర్కొంది. 90 సీట్లున్న ఛత్తీస్‌గఢ్‌ అసెంబ్లీలో బీజేపీ 54 చోట్ల గెలిచింది.

సర్పంచ్‌గా మొదలై ఆదివాసీ సీఎం దాకా...

ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ కీలక నేతల్లో విష్ణుదేవ్‌ ఒకరు. రాజకీయ నేపథ్యం నుంచి వచ్చారు. సర్పంచ్‌గా రాజకీయ జీవితం మొదలెట్టి ఆ తర్వాత పలు మార్లు లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి మోదీ తొలి కేబినెట్‌లో కేంద్ర మంత్రిగా సేవలందించారు. పార్టీ రాష్ట్ర చీఫ్‌గా మూడుపర్యాయాలు పనిచేసి అధిష్టానం మెప్పు పొందారు. 1990లో బగియా గ్రామ సర్పంచ్‌గా గెలిచారు. అదే ఏడాది అవిభాజ్య మధ్య ప్రదేశ్‌లో తపకారా ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1999, 2004, 2009లో రాయ్‌గఢ్‌ ఎంపీగా గెలిచారు. మోదీ తొలిసారి ప్రధాని అయ్యాక కేంద్ర ఉక్కు, గనుల శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. ఛత్తీస్‌గఢ్‌ అసెంబ్లీలో మెజారిటీ సీట్లు గెలిస్తే విష్ణుదేవ్‌ను 'పెద్దనేత'ను చేస్తామని ఇటీవల ఎన్నికల ప్రచారసభలో అమిత్‌ షా ప్రకటించడం తెల్సిందే.



ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రం ఏర్పడ్డాక అజిత్‌ జోగీ తొలి ఆదివాసీ సీఎంగా రికార్డులకెక్కారు. ఆయన తర్వాత ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబోతున్న ఆదివాసీ నేతగా విష్ణుదేవ్‌ పేరు నిలిచిపోనుంది. విష్ణుదేవ్‌ తాత బుద్ధనాథ్‌ సాయ్‌ 1947–52 వరకు నామినేటెడ్‌ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈయన పెదనాన్న నరహరి ప్రసాద్‌ రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఎంపీగా, జనతాపార్టీ ప్రభుత్వంలో సహాయ మంత్రిగాచేశారు. ఇంకో పెదనాన్న సైతం గతంలో ఎమ్మెల్యేగా గెలిచారు.

భార్యకు 18 ఏళ్లు దాటితే.. భర్తపై వైవాహిక అత్యాచారం కేసుండదు

ప్రయాగ్‌రాజ్‌: భార్య వయస్సు 18 ఏళ్లు, అంతకు మించి ఉన్న సందర్భాల్లో వైవాహిక అత్యాచారం(మారిటల్‌ రేప్‌) అభియోగం నుంచి వ్యక్తికి రక్షణ ఉంటుందని అలహాబాద్‌ హైకోర్టు పేర్కొంది. ఇందుకు సంబంధించి భర్తపై ఐపీసీ సెక్షన్‌ 377ను వర్తింప జేయడంపై గతంలో మధ్యప్రదేశ్‌ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ఉదహరించింది. అయితే, ఇండిపెండెంట్‌ థాట్‌ వర్సెస్‌ యూనియన్‌ ఆఫ్‌ ఇండియా(2017)కేసులో సుప్రీంకోర్టు తీర్పునను సరించి వ్యక్తి, 15–18 మధ్య వయస్సున్న అతడి భార్య మధ్య జరిగే ఎలాంటి లైంగిక సంపర్కమైనా అత్యాచారం కిందికే వస్తుందని స్పష్టం చేసింది. ఓ వ్యక్తి వేసిన రివిజన్‌ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ నెల 6న ఈ మేరకు పేర్కొంది. అయితే, పిటిషనర్‌పై కట్నం వేధింపులకు సంబంధించిన ఆరోపణలపై తమ తీర్పు ప్రభావం ఉండబోదని తెలిపింది. ఘజియాబాద్‌కు చెందిన ఓ వ్యక్తిపై 2013లో ఐపీసీ సెక్షన్లు 498ఏ, 323, 377తోపాటు వరకట్న నిరోధక చట్టం కింద కేసులు నమోదయ్యాయి. ఘజియాబాద్‌లోని దిగువ కోర్టుతోపాటు, అప్పిలేట్‌ కోర్టు కూడా అతడిని దోషిగా పేర్కొన్నాయి. వీటిని సవాల్‌ చేస్తూ అతడు అలహాబాద్‌ హైకోర్టులో రివిజన్‌ పిటిషన్‌ వేశాడు. విచారించిన హైకోర్టు.. పిటిషనర్‌పై ఐపీసీ సెక్షన్లు 498ఏ, 323 కింద నమోదైన కేసుల్లో దిగువ కోర్టులిచ్చిన తీర్పులను సమర్థిస్తూ తీర్పు వెలువరించింది.

పనిపిల్లపై యజమాని కుటుంబం దాష్టీకం

13 ఏళ్ల టీనేజర్‌ను వివస్త్రను చేసి బంధించిన వైనం

గురుగ్రామ్‌: పదమూడేళ్ల పనిపిల్ల పట్ల ఓ ఇంటావిడ దారుణంగా ప్రవర్తించింది. హరియాణాలోని గురుగ్రామ్‌ పట్టణంలోని సెక్టార్‌ 51 పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. పనికి కుదిర్చిన వ్యక్తితో కలిసి ఎట్టకేలకు తల్లి.. ఆమె కూతురుని విడిపించుకుంది. తాను అనుభవించిన చిత్రహింసను కూతురు ఏడుస్తూ చెప్పడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులకు అందిన ఫిర్యాదు ప్రకారం.. బిహార్‌కు చెందిన ఈమె తన కూతురును జూన్‌ 27వ తేదీన ఒకావిడ ఇంట్లో పనికి కుదిర్చింది. ఇంట్లో ఉంచుకుని, పనికి నెలకు రూ.9,000 జీతం ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకుంది. '' మొదట్లో రెండు నెలలు మాత్రమే నా కుతురుకు జీతం ఇచ్చారు. ఆ తర్వాత చిల్లిగవ్వ ఇవ్వలేదు. ఇంటి పని అంతా చేయించుకుని ఇష్టమొచ్చినట్ట కొట్టేవారు. పెంపుడు కుక్కతో కరిపించేవారు. యజమాని ఇద్దరు కుమారులు నా బిడ్డను లైంగికంగా వేధించారు. బలవంతంగా బట్టలూడదీసి ఫొటోలు, వీడియోలు తీసేవారు. అసభ్యంగా తాకేవారు. యజమానురాలు ఇనుప కడ్డీ, సుత్తితో కొట్టి చిత్రహింసలు పెట్టేది. బయటకు తప్పించుకునిపోకుండా గదిలో బంధించేవారు. కట్టేసి అరవకుండా నోటికి టేప్‌ అంటించారు. చేతులపై యాసిడ్‌ పోశారు. విషయం బయటకు పొక్కితే చంపేస్తామని బెదిరించేవారు. నా బిడ్డకు రెండు రోజులకు ఒకసారి భోజనం పెట్టేవారు. ఇంతటి దారుణాలు తెలిశాక స్థానిక వ్యక్తితో కలిసి ఎట్టకేలకు ఆ బిడ్డను విడిపించుకున్నా'' అని టీనేజర్‌ తల్లి వాపోయారు.

పొగాకు ఉత్పత్తుల ప్రకటనల్లో పాల్గొంటున్నందుకు.. షారూక్, అక్షయ్, దేవ్‌గణ్‌లకు కేంద్రం నోటీసులు

లక్నో: పొగాకు కంపెనీల తరఫున ప్రకటనల్లో కన్పిస్తున్న బాలీవుడ్‌ నటులు షారూక్‌ ఖాన్, అక్షయ్‌కుమార్, అజయ్‌ దేవ్‌గణ్‌లకు కేంద్రం నోటీసులు పంపింది. ప్రజల ఆరోగ్యానికి చేటు తెస్తున్న పొగాకు ఉత్పత్తుల ప్రకటనల్లో సెలబ్రిటీలు, ముఖ్యంగా పద్మ అవార్డు గ్రహీతలు నటిస్తుండటంపై మోతీలాల్‌ యాదవ్‌ అనే న్యాయవాది గతంలో అలహాబాద్‌ హైకోర్టులో పిటిషన్‌ వేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలంటూ కేంద్రాన్ని కోర్టు ఆదేశించింది. కేంద్రం స్పందించడం లేదని, ఇది ధిక్కరణేనని పిటిషనర్‌ మరోసారి కోర్టుకు వెళ్లారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం న్యాయస్థానం విచారణ చేపట్టింది. షారూక్, అక్షయ్, అజయ్‌లకు సెంట్రల్‌ కన్జ్యూమర్‌ ప్రొటెక్షన్‌ అథారిటీ అక్టోబర్‌ 20వ తేదీనే నోటీసులిచ్చిందని కేంద్రం తరఫున డిప్యూటీ సొలిసిటర్‌ జనరల్‌ ఎస్‌బీ పాండే కోర్టుకు తెలిపారు. ఈ కేసు సుప్రీంకోర్టులో విచారణలో ఉన్నందున పిటిషన్‌ను కొట్టేయాలని కోరారు. విచారణ 2024 మే 9కి వాయిదా పడింది.

మాయావతి వారసునిగా మేనల్లుడు


మేనల్లుడు ఆకాశ్‌తో మాయావతి

సాక్షి, న్యూఢిల్లీ: బహుజన్‌ సమాజ్‌ పార్టీ(బీఎస్పీ) అధినేత్రి మాయావతి తన తమ్ముడి కుమారుడు, మేనల్లుడు అయిన ఆకాశ్‌ ఆనంద్‌ను వారసుడి (ఉత్తరాధికారి)గా ప్రకటించారు. ఈ విషయాన్ని పార్టీ షాజహాన్‌పూర్‌ జిల్లా చీఫ్‌ ఉదయ్‌వీర్‌ సింగ్‌ ఆదివారం మీడియాకు తెలిపారు. 'యూపీ, ఉత్తరాఖండ్‌ మినహా దేశవ్యాప్తంగా పార్టీ బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో బలోపేతం చేయాల్సిన బాధ్యతలను ఆయనకు అప్పగించారు. తన రాజకీయ వారసుడు ఆకాశ్‌ ఆనంద్‌ అని మాయావతి తెలిపారు'అని వివరించారు. ఆదివారం లక్నోలో జరిగిన బీఎస్పీ అఖిల భారత సమావేశంలో ఈ విషయాన్ని మాయావతి స్వయంగా ప్రకటించారని ఉదయ్‌వీర్‌ చెప్పారు. అయితే దీనిపై పార్టీ అధికార ప్రకటన చేయలేదు. ఆకాశ్‌ బీఎస్పీ జాతీయ సమన్వయకర్తగా ఉన్నారు. ఎంబీయే చదివిన ఆయన 2016లో పార్టీలో చేరిన నాటి నుంచే క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు. 2019 ఎన్నికల్లో స్టార్‌ క్యాంపెయినర్‌గా యువతకు దగ్గరయ్యారు. తాజాగా రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ఎన్నికల్లో బీఎస్పీ ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు.

దాడులతో చెలరేగిన ఇజ్రాయెల్‌

యుద్ధం కోసం రూ.834 కోట్ల ఆయుధాలు అమ్మేందుకు అమెరికా సిద్ధం

'వీటో'తో, ఆయుధాలతో సహకరిస్తున్న అమెరికాకు థాంక్యూ: నెతన్యాహు

డెయిర్‌ అల్‌–బాలాహ్‌(గాజా స్ట్రిప్‌): హమాస్‌ మెరుపుదాడికి ప్రతీకారంగా ఇజ్రాయెల్‌ మొదలుపెట్టిన దాడులు భీకర రూపం దాలుస్తున్నాయి. గాజాలో కాల్పుల విరమణ కోరుతూ ఐక్యరాజ్యసమితి తెచ్చిన తీర్మానాన్ని అమెరికా తన వీటో అధికారంతో కాలదన్నిన దరిమిలా ఇజ్రాయెల్‌ ఆదివారం మరింత రెచ్చిపోయింది. అమెరికా నుంచి తాజాగా మరింతగా ఆయుధ సంపత్తి అందుతుండటంతో ఇజ్రాయెల్‌ భీకర గగనతల దాడులతో చెలరేగిపోతోంది. 23 లక్షల గాజా జనాభాలో దాదాపు 85 శాతం మంది బతుకుజీవుడా అంటూ స్వస్థలాలను వదిలిపోయినా సరే ఆదివారం ఇజ్రాయెల్‌ దాడుల తీవ్రతను తగ్గించకపోవడం గమనార్హం. దాదాపు రూ.834 కోట్ల విలువైన యుద్ధట్యాంక్‌ ఆయుధాలను ఇజ్రాయెల్‌కు అమ్మేందుకు అమెరికా అంగీకరించడం చూస్తుంటే ఇజ్రాయెల్‌ సేనల దూకుడు ఇప్పట్లో ఆగేట్లు కనిపించడం లేదు. 'ఐరాస భద్రతా మండలిలో మాకు బాసటగా అమెరికా నిర్ణయాలు తీసుకుంటోంది. యుద్ధం కొనసాగింపునకు వీలుగా కీలక ఆయుధాలు అందేందుకు సహకరిస్తున్న అమెరికాకు నా కృతజ్ఞతలు' అని ఆదివారం ఇజ్రాయెల్‌ ప్రధాన మంత్రి బెంజమిన్‌ నెతన్యాహు వ్యాఖ్యానించారు.

యుద్ధం ఆగదు: ఇజ్రాయెల్‌

'హమాస్‌ను ఈలోపే అంతంచేయాలని అమెరికా మాకు ఎలాంటి గడువు విధించలేదు. హమాస్‌ నిర్మూలన దాకా యుద్ధం కొనసాగుతుంది. హమాస్‌ అంతానికి వారాలు కాదు నెలలు పట్టొచ్చు. బంధీలందర్నీ విడిపిస్తాం'' అని ఇజ్రాయెల్‌ జాతీయ భద్రతా సలహాదారు టజాచీ హెనెగ్బీ శనివారం అర్ధరాత్రి తేల్చిచెప్పారు. '' గాజాలో సరైన సాయం అందక సరిదిద్దుకోలేని స్థాయిలో అక్కడ మానవ విపత్తు తీవ్రతరమవుతోంది. ఇది పశ్చిమాసియా శాంతికి విఘాతకరం'' అని ఖతార్‌లో ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్‌ ఆందోళన వ్యక్తంచేశారు. షిజాయాహ్, జబాలియా శరణార్థి శిబిరాల వద్ద నిరంతరం దాడుల కొనసాగుతున్నాయి. ''కదిలే ప్రతి వాహనం పైనా దాడి జరుగుతోంది. శిథిలాలతో నిండిన మా ప్రాంతాలకు అంబులెన్స్‌లు రాలేకపోతున్నాయి'' అని జబాలియా ప్రాంత స్థానికురాలు ఒకరు ఏడుస్తూ చెప్పారు. ఖాన్‌ యూనిస్‌ పట్టణ చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ హమాస్, ఇజ్రాయెల్‌ సేనల మధ్య పరస్పర దాడులు జరుగుతున్నాయి.

గంటలు నిలబడినా పిండి దొరకట్లేదు

సెంట్రల్‌ గాజాలో ఆహార సంక్షోభం నెలకొంది. '' ఇంట్లో ఏడుగురం ఉన్నాం. ఐరాస ఆహార కేంద్రానికి రోజూ వస్తున్నా. ఆరేడు గంటలు నిలబడ్డా రొట్టెల పిండి దొరకట్లేదు. రెండు వారాలుగా ఇదే పరిస్థితి. పిండి కరువై ఉట్టిచేతుల్తో ఇంటికెళ్తున్నా'' అని అబ్దుల్లాసలాం అల్‌–మజ్దాలావాలా చెప్పారు. ఇప్పటిదాకా 17,700 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు.

కుక్కపిల్లను కొట్టిచంపాడు

భోపాల్‌: అటుఇటు తిరుగుతూ తన వద్దకు వచ్చిన కుక్కపిల్లను ఓ వ్యక్తి అత్యంత నిర్దయగా నేలకేసి కొట్టి చంపాడు. మధ్యప్రదేశ్‌లోని గుణ జిల్లాలో జరిగిన ఈ దారుణం అక్కడి సీసీటీవీలో రికార్డయింది. వీడియో వైరల్‌గా మారడంతో వేలాది మంది.. ఆ వ్యక్తి కర్కశ చర్యపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మధ్యప్రదేశ్‌ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్‌ చౌహాన్‌ దృష్టికి తీసుకెళ్లడంతో అరెస్ట్‌కు ఆదేశాలిచ్చారు. కఠిన శిక్ష పడేలాచూస్తామని ముఖ్యమంత్రి శివరాజ్‌ హామీ ఇచ్చారు. శనివారం సాయంత్రం గుణ జిల్లాలోని సుభాష్‌ కాలనీలో జరిగిన ఈ దారుణ ఘటన తాలూకు వీడియో చూసిన వారంతా వ్యక్తిని తీవ్రంగా శిక్షించాలంటూ పోస్టులు పెట్టారు. దాదాపు 30 ఏళ్ల వయసున్న ఆ వ్యక్తి ఆరుబయట కూర్చోగా అక్కడికి రెండు బుల్లి కుక్క పిల్లలు తిండి కోసం తచ్చాడుతూ వచ్చాయి. వాటిల్లో ఒకటి ఇతడి సమీపానికి రాగానే వెంటనే ఆగ్రహంతో కుక్క పిల్లను ఎత్తిపట్టుకుని నేలకేసి బలంగా కొట్టాడు. అక్కడి నుంచి లేచి వచ్చి దానిని కుడికాలితో పలుమార్లు తొక్కిచంపాడు. ఈ హృదయవిదారక దృశ్యాలు సీసీటీవీలో రికార్డయ్యాయి. ''ఇది నా హృదయాన్ని కలిచివేసింది. అతనికి కఠిన శిక్ష పడేలా చేస్తాం'' అని ముఖ్యమంత్రి చౌహాన్‌ 'ఎక్స్‌'లో వ్యాఖ్యానించారు.

సాక్షి
కరీంనగర్
సోమవారం ၊ 11 ၊ డిసెంబర్ ၊ 2023



రాజన్నకు జనజాతర

వేములవాడ: రాజన్నను ఆదివారం 35 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. కార్తీకమాసం చివరి అంకానికి చేరుతుండటంతో చలిని లెక్కచేయకుండా తరలివచ్చారు. - 8లో

నేడు ప్రజావాణి

కరీంనగర్ అర్బన్: ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సుమారు రెండు నెలలపాటు కార్యక్రమాన్ని రద్దు చేశామని, ఇకపై కొనసాగుతుందని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గరిష్టం/కనిష్టం
28.0/17.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. పాక్షికంగా ఎండ వస్తుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మంత్రులను కలిసిన డీటీసీ



మంత్రి శ్రీధర్‌బాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీటీసీ చంద్రశేఖర్ గౌడ్

తిమ్మాపూర్(మానకొండూర్): ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌లను కరీంనగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు.


ఎంపీని కలిసిన ముధోల్ ఎమ్మెల్యే



ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను సత్కరిస్తున్న ఎంపీ సంజయ్

కరీంనగర్‌టౌన్: ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌ని కలిశారు. ఆదివారం మధ్యాహ్నం కరీంనగర్ వచ్చిన ఆయన ఎంపీ కార్యాలయానికి వెళ్లి, సంజయ్‌తో అరగంటకు పైగా మాట్లాడారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేశాక ఎంపీని మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. అనంతరం సంజయ్ రామారావు పటేల్‌ను సన్మానించారు.

పీఆర్‌టీయూ జిల్లా కార్యవర్గం



గోనె శ్రీనివాస్



అట్ల శ్రీనివాస్ రెడ్డి

కరీంనగర్: పీఆర్‌టీయూ జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పాతూరి రాజిరెడ్డి పరిశీలకుడిగా, చొల్లేటి శ్రీనివాస్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా గోనె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా అట్ల శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడిగా నరహరి రాంరెడ్డి, కె.సత్యనారాయణ రెడ్డి, కోమటి శ్రీనివాస్, మహిళా అసోసియేట్ అధ్యక్షులుగా పబ్బ జ్యోతిలక్ష్మి, కె.సుమ, ఉపాధ్యక్షుడిగా కట్ట వేణుగోపాలాచారి, మొగిలి శ్రీనివాస్, గజ్జెల నల్లగొండయ్య, ఒడ్నాల శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షులుగా పర్వత్ షాహిన్, డి.ఇందిరాజ్యోతి, జిల్లా కార్యదర్శులుగా వరుకోలు నాగరాజు, మనోహర్ రెడ్డి, రమణారెడ్డి, జిల్లా మహిళా కార్యదర్శులుగా బి.కవిత, అరుణ ఎన్నికయ్యారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కేతిరి తిరుపతిరెడ్డి, పల్లెపాటి వేణుగోపాల్‌రావు, జయేందర్ రెడ్డి, నాయకులు పులిపాక కిషన్, నర్సింగరావు, నరుకుల్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కంప్యూటర్ శిక్షణ

కరీంనగర్: మహిళలు ఉన్నత స్థితికి చేరాలన్న సదుద్దేశంతో స్పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ వివిధ కోర్సుల్లో వారికి కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జంజిరాల వేణు ఒక ప్రకటనలో తెలిపారు. డీసీఏ, పీజీడీసీఏ, ఎంఎస్ ఆఫీస్, ట్యాలీ ప్రైమ్, ఫొటోషాప్, జావా, ఆడియో, వీడియో ఎడిటింగ్, గ్రాఫిక్ డిజైనింగ్ కోర్సుల్లో అతి తక్కువ ఫీజుతో శిక్షణనిచ్చి, తర్వాత రూ.8 వేల నుంచి రూ.20 వేల జీతంతో ఉద్యోగాలు కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ చదివిన వారు అర్హులని, ఈ నెల 11, 12, 13 తేదీల్లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరై, అడ్మిషన్ పొందాలన్నారు. మరిన్ని వివరాలకు స్పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఆఫీసులో లేదా 90801 24777 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రేపు ఉమ్మడి జిల్లాస్థాయి హాకీ ఎంపిక పోటీలు

హుజూరాబాద్‌రూరల్: ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14, 17 హాకీ ఎంపిక పోటీలను ఈ నెల 12న హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, క్రీడాకారులు స్టడీ, డేట్ ఆఫ్ బర్త్ డే సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

గ్యాస్ రీ ఫిల్లింగ్ దందా

- రాయితీ, వాణిజ్య సిలిండర్లు బ్లాక్‌లో కొనుగోలు
- మినీ సిలిండర్లలో గ్యాస్ నింపి, విక్రయం
- జిల్లా కేంద్రంలోని పలు హోంనీడ్స్ దుకాణాల్లో యథేచ్ఛగా వ్యాపారం



ఓ నిర్వాహకుని వద్ద మినీ సిలిండర్లు



రాయితీ గ్యాస్ సిలిండర్లను వాహనాలకు ఎక్కువగా వినియోగిస్తున్నారు. పలు గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు అక్రమార్కులతో కుమ్మక్కై దందాను నిరాటంకంగా కొనసాగిస్తున్నారు. వినియోగదారులకిస్తే కమీషన్ తక్కువగా రావడంతో పక్కదారి పట్టిస్తున్నారు.



బైక్‌పై మినీ సిలిండర్లు తీసుకెళ్తున్న ఈ వ్యక్తి రాంనగర్‌లో దుకాణం నిర్వహిస్తుంటాడు. షాపు వెనక వైపు గ్యాస్ రీ ఫిల్లింగ్ చేసి, విక్రయించడం ఇతని దినచర్య. పైకి దుకాణంలో మరమ్మతు అని రాసి ఉన్నప్పటికీ జరిగేది మాత్రం అక్రమ దందా.

కరీంనగర్ అర్బన్: పేదలకు ఇస్తున్న రాయితీ వంట గ్యాస్‌ను అక్రమార్కులు నిబంధనలకు విరుద్ధంగా మినీ సిలిండర్లలో నింపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం రాయితీ సిలిండర్‌కు ధర రూ.975, కమర్షియల్ సిలిండర్‌కు రూ.2,080 ఉండగా కొందరు బ్లాక్‌లో కొనుగోలు చేస్తూ యథేచ్ఛగా వ్యాపారం సాగిస్తున్నారు. 4 కిలోలున్న చిన్న సిలిండర్లలో గ్యాస్ నింపి, అదనంగా రూ.1,000 వరకు సంపాదిస్తుండగా ప్రభుత్వ ఖజానాకు తీరని నష్టం వాటిల్లుతోంది. ప్రభుత్వ అనుమతి లేకున్నా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పలు హోంనీడ్స్ దుకాణాల్లో ఈ దందా కొనసాగుతోంది. పౌరసరఫరాల శాఖ అధికారులు కిమ్మనకపోవడం విమర్శలకు తావిస్తోంది. నిర్వాహకులు వారిని మామూళ్లతో కట్టిపడేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన

జిల్లా కేంద్రంలోని రాంనగర్, మంకమ్మతోట, గణేశ్‌నగర్, కోతిరాంపూర్, పెద్దపల్లి రోడ్, కోర్టు చౌరస్తా ఇలా చాలాచోట్ల వందల సంఖ్యలో దుకాణాలున్నాయి. జనావాసాల మధ్య గ్యాస్ అక్రమ దందా నడుస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే నామమాత్రంగా కేసులు పెడుతూ తర్వాత యథావిధిగా దందా నడిచేలా సహకరిస్తున్నట్లు చెబుతున్నారు.

హైదరాబాద్ నుంచి తీసుకువచ్చి..

జిల్లా కేంద్రంలోని పలు హోంనీడ్స్ దుకాణాల నిర్వాహకులు హైదరాబాద్ నుంచి చిన్న సిలిండర్లు తీసుకువచ్చి, ఇక్కడ వ్యాపారం చేస్తున్నారు. రాయితీ, వాణిజ్య సిలిండర్లను వినియోగదారులు, ఏజెన్సీ నిర్వాహకుల సాయంతో కొనుగోలు చేసి, రహస్య ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్న గోదాంలకు తరలిస్తున్నట్లు సమాచారం. మరికొందరు దుకాణాల్లోనే వెనక వైపు రీ ఫిల్లింగ్ చేస్తున్నారు. వాటిని జిల్లాలోని పలు మండలాలకు తరలించి, విక్రయిస్తున్నారు.

జనావాసాల మధ్యే గ్యాస్ నింపడం

నగరంలోని భగత్‌నగర్, కోతిరాంపూర్, మంకమ్మతోట, రాంనగర్, విద్యానగర్, సీతారాంపూర్ తదితర ప్రాంతాల్లో జనావాసాల మధ్యే కార్లలో గ్యాస్ నింపుతున్నారు. ప్రభుత్వ ఆమోదం పొందిన పలు గ్యాస్ కంపెనీలు మార్కెట్లో 5 కిలోల సిలిండర్లు సరఫరా చేస్తున్నాయి. వీటిని వినియోగించేందుకు జనం ఆసక్తి చూపడం లేదు. దీనిపై అవగాహన కల్పించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

ఫోన్ చేస్తే.. ఇంటికే వస్తారు

పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో కార్లకు గ్యాస్ వినియోగం పెరుగుతోంది. కారులో గ్యాస్ నింపాలని ఫోన్ చేస్తే ఇంటికే వస్తారు. వీరికి మినీ సిలిండర్లు విక్రయించేవారు దళారులుగా వ్యవహరిస్తున్నారు. ఈ సేవలకు రూ.100 వసూలు చేస్తున్నారు. మూడేళ్లుగా తనిఖీలే కరువయ్యాయి. అయితే రీ ఫిల్లింగ్ చట్టరీత్యా నేరమని, కఠినచర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల ఇన్‌స్పెక్టర్ కమలేశ్ తెలిపారు. తనిఖీలు, నిఘాను తీవ్రతరం చేస్తామని పేర్కొన్నారు.

ఎంపీ సీటుపై ‘బండి’ ఫోకస్

- నెలాఖరు నుంచి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమీక్ష
- బీజేపీ గెలుపు కోసం రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్న ఎంపీ



ఎంపీ సంజయ్

కరీంనగర్‌టౌన్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి సారించారు. రాబోయే ఎన్నికల్లో కరీంనగర్ నుంచి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న ఆయన తన పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలపై ఫోకస్ పెట్టారు. పార్లమెంట్ సమావేశాల అనంతరం ఈ నెలాఖరు నుంచి నియోజకవర్గాల వారీగా నాయకులు, కార్యకర్తలతో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సరళిపై సమీక్షించనున్నారు. ఏ మండలాలు, గ్రామాలు, పోలింగ్ కేంద్రాల్లో బీజేపీకి అధిక ఓట్లు వచ్చాయి? ఏయే గ్రామాల్లో పార్టీ సంస్థాగతంగా బలంగా ఉంది? అత్యంత బలహీనంగా ఉన్న మండలాలు, గ్రామాలు ఏవి? అక్కడ పార్టీకి వచ్చిన ఓటింగ్ శాతం ఎంత? అనే అంశాలపై లోతుగా విశ్లేషించనున్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం 5 జిల్లాల్లో విస్తరించి ఉంది. మొత్తం 40 మండలాలు, 671 గ్రామాలు దీని పరిధిలో ఉన్నాయి. 16,51,534 మంది ఓటర్లు ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం ఎంపీ సంజయ్ రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్నారు. రాబోయే 45 రోజుల పాటు మండలాల వారీగా నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించనున్నారు. సంక్రాంతి తర్వాత నేరుగా ప్రజల వద్దకు వెళ్లేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

ఉత్తీర్ణత లక్ష్యం.. శతశాతం

- పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ‘లక్ష్య’ పేరిట కార్యక్రమానికి శ్రీకారం
- జిల్లాలో 149 ఉన్నత పాఠశాలలు



మార్చిలో వార్షిక పరీక్షలు

కరీంనగర్: పదోతరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు జిల్లా విద్యాశాఖ లక్ష్య పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు అధికారులకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఇందులో భాగంగా గత నెల 6వ తేదీ నుంచి ఈ నెల 30 వరకు ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు విద్యార్థులకు ప్రతీరోజు ఒక సబ్జెక్టు ఉపాధ్యాయుడు తరగతి నిర్వహించడం, ముఖ్యమైన అంశాలను చదివించడం వంటివి చేయాలని సూచించింది. జనవరి 2 నుంచి సాయంత్రం పాఠశాల సమయం ముగిసిన తర్వాత గంటపాటు సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు చేపట్టాలని ఆదేశించింది.

కరీంనగర్ జిల్లాలో 149 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వాటిల్లో 3,183 మంది పదోతరగతి విద్యార్థులున్నారు. వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించే పదో తరగతి వార్షిక పరీక్షలకు వారిని టీచర్లు సన్నద్ధం చేస్తున్నారు. అన్ని సబ్జెక్టులు పాసయ్యేలా ముందుకెళ్తున్నారు. ఉన్నతాధికారులు సైతం తరచూ పాఠశాలలు తనిఖీ చేస్తూ లక్ష్య కార్యక్రమం అమలు తీరును పర్యవేక్షిస్తున్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఉత్తీర్ణత శాతం మెరుగయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఎస్‌ఎంసీల గడువు పొడిగింపు

- ఈ నెలాఖరు వరకు పాత కమిటీలే
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- జిల్లాలో 678 మంది చైర్మన్లు



ఒద్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

కరీంనగర్: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ)ల గడువును పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ నెల 31వ తేదీ వరకు పాత కమిటీలే పని చేయనున్నాయి. సాధారణంగా పాఠశాలల్లో విద్యార్థుల పదో తరగతి పూర్తయ్యాక వారి తల్లిదండ్రులు ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్లుగా లేదా సభ్యులుగా ఉంటే వారి స్థానంలో కొత్తవారిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా మొదటి విడత మన ఊరు–మన బడి కార్యక్రమంలో అభివృద్ధి పనులు చివరి దశలో ఉన్నాయి. చాలా స్కూళ్లలో ప్రస్తుతం ఉన్న ఎస్‌ఎంసీల చైర్మన్లు, సభ్యుల తీర్మానాలతోనే ఈ పనులు చేస్తున్నారు. వాటికి ఆటంకం కలగకుండా ఈ నెలాఖరు వరకు పాత కమిటీలనే కొనసాగించేందుకు సర్కారు నిర్ణయం తీసుకుంది. మరోవైపు మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు అందే ప్రతీ సంక్షేమ పథకంలో ప్రస్తుత కమిటీలకే బాధ్యతలు ఉండటంతో ఉన్న ఫలంగా తొలగించి, కొత్త కమిటీలకు ఎన్నుకోవడం సాధ్యం కాదన్న ఆలోచనకు వచ్చింది.

జిల్లాలో 651 పాఠశాలలు..

జిల్లాలోని వివిధ యాజమాన్యాల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 678 మంది ఎస్‌ఎంసీ చైర్మన్లు ఉన్నారు. వీరి పదవీకాలం ముగియడంతో మరో నెల పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లాలోని 16 మండలాల్లో 651 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా తొలి విడతగా 230 స్కూళ్లను మన ఊరు–మనబడి కార్యక్రమం కింద ఎంపిక చేశారు. మౌలిక వసతుల కల్పనకు రూ.2 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. విద్యాకమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయుల జాయింట్ అకౌంట్‌తో ఒక్కో పాఠశాలకు రూ.30 లక్షల నుంచి అవసరం మేరకు నిధులు కేటాయించింది. నీటి సౌకర్యంతో కూడిన టాయిలెట్లు, విద్యుదీకరణ, తాగునీటి సరఫరా, విద్యార్థులకు సరిపడా ఫర్నిచర్, పాఠశాలల భవనాలకు పేయింటింగ్, పెద్ద, చిన్న మరమ్మతులు, గ్రీన్‌చార్ట్ బోర్డులు, ప్రహరీ నిర్మాణం, కిచెన్ షెడ్లు, శిథిలమైన గదుల స్థానంలో కొత్తవి నిర్మాణం, ఉన్నత పాఠశాలల్లో డైనింగ్ హాల్, డిజిటల్ విద్య అమలు వంటి సదుపాయాల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటివరకు 80 శాతానికి పైగా పూర్తయ్యాయి. ఈ పనుల్లో నాణ్యత, ఇతర అంశాల పరిశీలన బాధ్యత ఎస్‌ఎంసీలదే. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని, సర్కారు వాటి పదవీకాలాన్ని పొడిగించింది.

ప్రస్తుతానికి ఎన్నికలు లేనట్టే



ఎస్‌ఎంసీల గడువును ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు పొడిగించింది. మళ్లీ ఆదేశాలు వచ్చేవరకు పాత కమిటీలే పాఠశాలల్లో అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రస్తుతానికి ఎస్‌ఎంసీల ఎన్నికలు లేనట్టే.

– జనార్దన్‌రావు, డీఈవో

ఆరోగ్యశ్రీ @ రూ.10 లక్షలు

- పరిమితిని రూ.5 లక్షల నుంచి పెంచిన ప్రభుత్వం
- జిల్లాలో 2.5 లక్షల కుటుంబాలకు ప్రయోజనం
- పథకానికి శ్రీకారం చుట్టిన మాజీ సీఎం దివంగత వైఎస్సార్



ఆరోగ్యశ్రీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం కింద పొందే ప్రయోజన పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. ఇది నిరుపేదలకు వరంగా మారింది. రోజురోజుకూ వైద్యం అత్యంత ఖరీదుగా మారుతుండటంతో పెద్ద పెద్ద రోగాలకు పేదలు చికిత్స చేయించుకోలేని దుస్థితి నెలకొంది. చేయించుకునేందుకు ముందుకు వచ్చే వారు ఆస్తులు అమ్ముకొని, అప్పులు చేయాల్సి వచ్చేది. ఉమ్మడి ఏపీలో ఈ పరిస్థితిని గమనించిన మాజీ సీఎం దివంగత వైఎస్సార్ అప్పట్లో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి శ్రీకారం చుట్టారు. అప్పటివరకు కార్పొరేట్ ఆస్పత్రుల దరిదాపుల్లోకి కూడా వెళ్లని నిరుపేదలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే అవకాశం కలిగింది. ఈ పథకం దేశానికి ఆదర్శంగా నిలిచింది. వివిధ పేర్లతో పలు రాష్ట్రాల్లో అమలవుతోంది. దీనికితోడు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ కింద రూ.5 లక్షల వరకు వైద్యసేవలు పొందే వీలుంది.

ఆహార భద్రత కార్డు ఉంటే చాలు

ఆరోగ్యశ్రీ పథకం కింద కరీంనగర్ జిల్లాలో 2.5 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది. ఆహార భద్రత కార్డు కలిగిన వారందరూ అర్హులే. ఆయుష్మాన్ భారత్ పథకానికి కూడా ఇంతే. ఆరోగ్యశ్రీ పరిమితి పెంచడం ద్వారా ఖరీదైన చికిత్సలన్నీ ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా పొందవచ్చు. ముఖ్యంగా గుండె, డయాలసిస్ రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఇబ్బంది లేకుండా వైద్యం



ఆరోగ్యశ్రీ పథకం పరిమితి పెంపు నిరుపేదలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. రెక్కాడితే గానీ డొక్కాడని వారికి రోగాలు వస్తే దేవుడిపై భారం వేసే పరిస్థితి ఉండేది. కానీ ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టాక ఎలాంటి ఇబ్బందుల్లేకుండా వైద్యం పొందుతున్నారు. – నలుమాచు రాణి

నిరుపేదలకు వరం



కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడం హర్షణీయం. చికిత్స అందక ఎంతోమంది నిరుపేదలు మృత్యువు ఒడికి చేరుతున్నారు. దీన్ని గమనించిన సర్కారు ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ఆరోగ్యశ్రీ పరిమితి పెంచడం శుభపరిణామం. – శ్యాంసుందర్

ఖాళీలపై కసరత్తు

- కొత్త కొలువుల భర్తీకి సర్కారు నిర్ణయం
- శాఖల వారీగా ఖాళీలపై ఆరా
- ఆశల పల్లకిలో నిరుద్యోగులు



కరీంనగర్ అర్బన్: కొత్త ప్రభుత్వం కొలువుల భర్తీకి కసరత్తు చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయా ఉద్యోగాల ప్రకటనకు సిద్ధమవుతుండగా ఖాళీలను గుర్తించాలని ఆదేశించారు. జిల్లాల నుంచి ఖాళీల వివరాలను నివేదించాలని సీఎస్ ఆదేశించడంతో ఉమ్మడి జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రతీశాఖలో అవసరం ఉన్న సిబ్బంది ఎంత, ఉన్నవారెంత, ఖాళీలెన్ని అనే కోణాల్లో నివేదికలను రూపొందిస్తున్నారు. గతంలోనే శాఖలవారీగా ఖాళీలను నివేదించిన జిల్లా యంత్రాంగం మరోసారి వివరాలు రాబడుతోంది. జిల్లాస్థాయిలో 48విభాగాల వరకు ఉండగా అటెండర్ నుంచి అధికారి వరకు ఖాళీల లెక్క తీస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 4వేల నుంచి 4,500ల వరకు ఖాళీలు ఉండనుండగా అతి త్వరలోనే పూర్తి లెక్క తేలనుంది.

అన్ని శాఖల్లోనూ ఖాళీలు

దాదాపు అన్ని ప్రభుత్వ విభాగాల్లో ఖాళీలే. పాత జిల్లాకేంద్రం ప్రకారమే 25శాతం ఖాళీ పోస్టులు వెక్కిరించాయి. జిల్లాల విభజన అనంతరం 35–40 శాతం వరకు ఖాళీలున్నాయని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లా నాలుగు జిల్లాలుగా ఏర్పడగా ఇక్కడి ఉద్యోగులనే నాలుగు జిల్లాలకు సర్దుబాటు చేశారు. శాఖల వారీగా మంజూరు పోస్టులకు ఉన్న పోస్టులకు ఒక్కోశాఖలో 60శాతం ఖాళీలున్నాయని స్పష్టమవుతోంది. ప్రధానంగా విద్య, పోలీస్ శాఖల్లో ఎక్కువ ఖాళీలున్నట్లు గుర్తించారు. అలాగే రెవెన్యూ, వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ, ఉద్యానశాఖ, పట్టు పరిశ్రమ, మార్కెటింగ్, ట్రెజరీ, సర్వేలాండ్ రికార్డ్స్, స్త్రీ శిశుసంక్షేమ శాఖ, డీపీఆర్వో, వైద్యశాఖల్లో ఖాళీలున్నాయి. ఉమ్మడి జిల్లాలో పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సిన ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎల్‌ఎఫ్‌ఎల్(లోయర్ ఫిమేల్ లిట్రసీ) పోస్టులు మినహాయిస్తే బోధన సిబ్బంది పోస్టులు 1216 వరకు ఖాళీగా ఉన్నాయి. పదోన్నతుల ద్వారా ఈ పోస్టులను భర్తీ చేస్తే మరిన్ని ఖాళీలు ఏర్పడనున్నాయి. ఇక పోలీస్‌శాఖలో ఉమ్మడి జిల్లా పరిధిలో అన్ని కేటగిరీల్లో 1,200 ఖాళీలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ లెక్కన రెండు శాఖల్లోనే ఉమ్మడి జిల్లాలో సుమారు 2450 పోస్టులు భర్తీ కానున్నాయి. ఇక మిగతా వాటిలో క్రీడాశాఖలో అడ్మినిస్ట్రేటివ్, కోచింగ్, రీజినల్ స్పోర్ట్స్ స్కూల్స్, టీచింగ్, హాస్టల్, మెడికల్ స్టాఫ్ అంతా కలిపి 111 పోస్టులు ఖాళీ ఉన్నాయి. మున్సిపల్‌లో అన్ని కేటగిరీల్లో 270, వ్యవసాయ శాఖలో 18 ఏఈవో, పంచాయతీరాజ్‌లో 15 టైపిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా క్రోడీకరిస్తే 4,500లకు పైగా ఖాళీలున్నట్లు స్పష్టమవుతోంది.

నిరుద్యోగుల్లో ఆశలు

గత ప్రభుత్వంలో వ్యవసాయశాఖలో ఏఈవో, ఏవో పోస్టులను భర్తీ చేసింది. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఏ పోస్టులు భర్తీ చేయగా పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు కల్పించింది. అలాగే తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు అండగా నిలిచి వారి విద్యార్హతలను బట్టి జూనియర్ అసిస్టెంట్, టైపిస్టు పోస్టుల్లో ఉద్యోగాలిచ్చింది. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ విభాగంలో టెక్నికల్ సిబ్బంది సహా సహాయక ఇంజనీర్ల పోస్టులు, టీఎస్‌పీఎస్సీ, ఇతర రిక్రూట్‌మెంట్ బోర్డుల ద్వారా అనేక ప్రభుత్వ ఉద్యోగాలు నింపడంతో వేలాది మందికి ఉద్యోగం లభించింది.

కొత్త జోన్ల ప్రకారమే నియామక ప్రక్రియ

నియామకాల్లో ఏ స్థాయి పోస్టులైనా 95శాతం మనకే. జిల్లాలను విభజించి జోన్లుగా ఖరారు చేయగా కరీంనగర్‌ను రాజన్న జోన్‌గా ఖరారు చేశారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలు రాజన్న జోన్‌లో చేర్చగా పెద్దపల్లి జిల్లాను కాళేశ్వరం జోన్‌లో చేర్చగా జగిత్యాల జిల్లాను బాసర జోన్‌లో చేర్చారు. ఉమ్మడి రాష్ట్రంలో జిల్లాల వారీగా 6 జోన్లుగా విభజించగా 5వ జోన్‌గా ఉమ్మడి జిల్లా కొనసాగుతోంది. 6 జోన్లలో 4 జోన్లు ఆంధ్రా, రాయలసీమకు కేటాయించగా రాష్ట్రంలో 5, 6 జోన్లు ఉన్నాయి. ఇప్పటివరకు కొనసాగుతున్న నియామక ప్రక్రియలో జిల్లాస్థాయి పోస్టులకు సంబంధించి 80శాతం స్థానికత, 20శాతం ఓపెన్ కేటగిరి ఉండేది. జోనల్ స్థాయిలో 70శాతం స్థానికత, 30శాతం ఓపెన్ కేటగిరి, రాష్ట్రస్థాయి పోస్టుల్లో 60శాతం స్థానికత, 40శాతం ఓపెన్ కేటగిరిలో పోస్టులను భర్తీ చేసేవారు. కాగా ఇక జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయి పోస్టులన్నింటికి 95శాతం స్థానికత 5శాతం స్థానికేతరులకు కేటాయించారు.

వయోపరిమితి పెరిగేనా?

ఉద్యోగాల నియామాలకు వయోపరిమితి పెంచాలనే డిమాండ్ నిరుద్యోగుల నుంచి వినిపిస్తోంది. నిరుద్యోగుల అభ్యర్థన మేరకు 2017లో ప్రభుత్వం పదేళ్ల మేర పొడిగించింది. 34 ఏళ్ల నుంచి 44 ఏళ్లకు పొడిగిస్తూ సడలింపు ఇచ్చింది. అలాగే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అదనంగా మరో 5 ఏళ్లు పొడిగించింది. 2023 వరకు ఆ జీవో అమల్లో ఉంటుందని స్పష్టం చేయగా మళ్లీ పొడిగిస్తారనే ప్రచారం జరుగుతోంది.

ఉమ్మడి జిల్లాలో ఉద్యోగుల వివరాలు

మొత్తం ఉద్యోగులు:	23,980
మహిళలు:	6,860
పురుషులు:	17,120
గెజిటెడ్ అధికారులు:	1,535
నాన్‌గెజిటెడ్ అధికారులు:	19,811
నాలుగో తరగతి ఉద్యోగులు(క్లాస్–4): 2,634	

జిల్లాల వారీగా ఉద్యోగుల లెక్క

జిల్లా	గెజిటెడ్ అధికారులు	నాన్‌గెజిటెడ్	క్లాస్–4	మొత్తం
కరీంనగర్	585	6,035	1,151	7,771
రాజన్న సిరిసిల్ల	253	3,779	384	4,416
పెద్దపల్లి	355	4,985	471	5,811
జగిత్యాల	342	5,012	628	5982

క్లుప్తంగా

బేగంపేటలో వడ్ల లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

రామగిరి(మంథని):పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట ప్రదాన రహదారిపై హనుమాన్ ఆలయం మూలమలుపు వద్ద శనివారం రాత్రి వడ్ల లోడుతో వస్తున్న లారీ అదుపు తప్పి పక్కనే ఉన్న ఇంటిపై బోల్తా పడింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ కోనుగోలు కేంద్రం నుంచి వడ్ల బస్తాల లోడ్‌తో వస్తుండగా డ్రైవర్ అజాగ్రతతో ప్రమాదం చోటుచేసుకుంది. లారీ డ్రైవర్ అక్కడి నుంచి పరార్ అయినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో కెక్కర్ల కుమార్‌కు చెందిన ఇల్లు పూర్తిగా ధ్వంసమైనట్లు బాధితుడు వాపోయాడు.

ఆర్టీసీ బస్సులో బ్యాగ్ చోరీ



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్‌లో ఆదివారం ఓ మహిళ నుంచి గుర్తు తెలియని దొంగలు బ్యాగ్ దొంగిలించారు. బాధితురాలి కథనం ప్రకారం.. రాయికల్ మండలం ఆలూరు గ్రామానికి చెందిన ఆముద గంగు తన మేనకోడలుతో కలిసి జగిత్యాలకు పనినిమిత్తం వచ్చింది. ఇంటికెళ్లేందుకు కొత్త బస్టాండులో ఆర్టీసీ బస్సులో సీటు ఆపేందుకు ప్రయత్నించింది. అప్పటికే ఆమె మేనకోడలు బస్సు ఎక్కడంతో గుర్తు తెలియని వ్యక్తులు 'మీ మేనకోడలు బ్యాగు ఇవ్వమంటోంది.. ఇవ్వు ఆమెకిస్తా..' అని నమ్మించారు. నమ్మిన ఆమె చేతిలోని బ్యాగ్ ఇవ్వడంతో అక్కడి నుంచి పరారయ్యారు. బ్యాగులో రూ.పదివేలు, సెల్‌ఫోన్ ఉందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడి దుర్మరణం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం కందికట్కూర్‌లో శనివారం రాత్రి ప్రమాదవశాత్తు కరెంటుపోల్‌ను బైక్‌తో ఢీకొని ఒక యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఇల్లంతకుంట ఎస్సై డి.సుధాకర్ తెలిపిన వివరాలు. పొత్తూరుకు చెందిన కుర్మ అశోక్ కొడుకు మహేశ్(20) శనివారం రాత్రి బైక్‌పై పొత్తూరు నుంచి ఇల్లంతకుంట వైపు వెళ్తుండగా కందికట్కూర్ శివారులో కరెంటుపోల్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి అశోక్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'సాక్షి' స్పెల్ బీ-మ్యాథ్ బీ పోటీలు

- సాధన స్కూల్లో సెకండ్ లెవల్ నిర్వహణ
- పరీక్షలకు ఉత్సాహంగా హాజరైన విద్యార్థులు



సాధన పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కరీంనగర్ కల్చరల్: సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ జ్యోతినగర్‌లోని సాధన స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో నిర్వహించిన సాక్షి స్పెల్ బీ-మ్యాథ్ బీ-2023 జిల్లా సెకండ్ లెవల్ పరీక్షకు స్పందన వచ్చింది. విద్యార్థులు ఉత్సాహంగా హాజరై, ఇంగ్లిష్‌లో మెళకువలు, గణితంలో కొత్త ఫార్ములాలను నేర్చుకున్నారు. కేటగిరీ-1లో భాగంగా 1, 2వ తరగతుల విద్యార్థులకు, కేటగిరీ-2లో 3, 4వ తరగతుల విద్యార్థులకు, కేటగిరీ-3లో 5, 6, 7వ తరగతులు విద్యార్థులకు, కేటగిరీ-4లో 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. విజేతలకు మూడో లెవల్‌లో రాష్ట్రస్థాయి పోటీలు హైదరాబాద్‌లో జరుగుతాయని సాక్షి బ్రాంచి మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. సాధన స్కూల్ చైర్మన్ శ్రీనివాస్‌రావు, సాక్షి అడ్వర్టయిజ్‌మెంట్ ఆఫీసర్ వేముల శ్రీనివాస్, టీచర్ ధనలక్ష్మి, ప్రకాశ్, లింగమూర్తి, తిరుపతి తదితరులున్నారు.

అందరికీ ఉపయోగం



స్పెల్ బీ-మ్యాథ్ బీ లాంటి పరీక్షలు ప్రతీ సంవత్సరం పెట్టాలి. ఇవి అందరికీ ఉపయోగపడేవి. నేను ఇంగ్లిష్‌లో కొన్ని కొత్త పదాలు నేర్చుకున్నాను.

– ఎం.ఆదివ, సాధన స్కూల్

పరీక్ష బాగా రాశాను



సెకండ్ లెవల్ పరీక్ష బాగా రాశాను. ఇంగ్లిష్‌లో కొత్త పదాలను తప్పులు లేకుండా రాసే అవకాశం దొరికింది. మా ఫ్రెండ్స్ కూడా బాగా రాశారు.

– అదితి రెడ్డి, రావూస్ ఈ-టెక్నో స్కూల్

రాష్ట్రస్థాయికి అర్హత సాధిస్తా



స్పెల్ బీ పరీక్షతో ఇంగ్లిష్‌పై అవగాహన పెరిగింది. రాష్ట్ర స్థాయికి పోటీలకు అర్హత సాధిస్తా. వేరే సబ్జెక్టుల్లో కూడా ఇలాంటి పరీక్ష పెట్టాలి.

–సాయిప్రియ, సాధన స్కూల్

థాంక్స్ టు సాక్షి



నేను ఫస్ట్ టైం సాక్షి స్పెల్ బీ పరీక్ష రాశాను. చాలా కొత్త పదాలు నేర్చుకున్నాను. తర్వాత రౌండ్‌కు సెలక్ట్ అవుతా. థాంక్స్ టు సాక్షి.

– షిఫా, రావూస్ ఈ-టెక్నో స్కూల్

మొదటిసారి రాశాను



నేను మొదటిసారి సాక్షి స్పెల్ బీ పరీక్ష రాశాను. ఇంగ్లిష్ పదాలు పలకడం, రాయడం ఎలాగో తెలుసుకున్నాను. హ్యాపీగా ఉంది.

– ఎస్.అక్షయ్, సాధన స్కూల్

కొత్త కాన్సెప్ట్



విద్యార్థుల్లో నైపుణ్యం పెంచడం కోసం సాక్షి మీడియా ఇలాంటి పరీక్షలు నిర్వహించడం సంతోషంగా ఉంది. పుస్తకాలతో పోలిస్తే ఇది కొత్త కాన్సెప్ట్.

–మనోగన, రావూస్ ఈ-టెక్నో స్కూల్

నెట్టింట కోరుట్ల జంట

- ఆకట్టుకుంటున్న ఇన్‌స్టా వీడియోలు
- టిక్‌టాక్ నుంచి ఇన్‌స్టాగ్రామ్ దాకా..
- ఆరు నెలల్లో 1.60లక్షల మంది ఫాలోవర్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కోరుట్ల:

భర్త : ఇగో.. నా పర్సులో ఐదువేలు కనిపించడం లేదు.. నువ్వుగిట్ల తీశావా..?
భార్య : ఏంటి..? వినిపిస్తలే..
భర్త : పర్సులో ఐదువేలులేవు నువ్వు తీసినవా
భార్య వినిపిస్తలేదు.. ఈడకూసుంటే వినిపిస్తలేదు
భార్య : అర్ధరాత్రి 3 గంటలకు ఎవ్వలతో మాట్లాడినవ్..
భర్త : వినిపిస్తలే.. ఈడగుసుంటే నిజంగానే వినిపిస్తలే..
భార్య : గుర్రుగా చూస్తుంటే భర్త పరుగు..

ఇలా ఒకటి రెండు కాదు.. పదుల సంఖ్యలో వీడియోలు ఇపుడు ఇన్‌స్టాగామ్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. ఆరు నెలల వ్యవధిలో లక్షకు మించి సబ్‌స్క్రైబర్స్‌ను దాటిపోయి నెట్టింట హల్‌చల్ చేస్తున్న ఈ ఇన్‌స్టా జంట జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన వారే. వారే బింగి రాకేశ్, మేఘన జంట.

దుబాయ్‌లో టిక్‌టాక్ నుంచి..

కోరుట్లకు చెందిన బింగి రాకేశ్ పదేళ్ల క్రితం ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. అక్కడ ఓ ఐటీ కంపెనీలో టెక్నీషియన్‌గానే పనిచేస్తూ తనకంటూ ఓ ప్రత్యేకత ఉండాలని తపన పడేవాడు. ముందుగా టిక్‌టాక్‌లో సోలో వీడియోలు చేశాడు. ఈ వీడియోలకు స్పందన రావడంతో మరిన్ని వీడియోలు చేస్తూ నెటిజన్లను ఆకట్టుకున్నాడు. తర్వాత ఇండియాలో టిక్‌టాక్ బ్యాన్ కావడంతో రాకేశ్ వీడియోలు చేయడంలో కొంత వెనకబడ్డాడు. రెండేళ్ల క్రితం దుబాయ్ నుంచి కోరుట్లకు వచ్చిన రాకేశ్.. ఉపాధి కోసం ఫిష్ అడ్డా అనే హోటల్ పెట్టాడు. అనంతరం ఇన్‌స్టాగాంపై దృష్టి సారించాడు.

జీవిత భాగస్వామి సహకారంతో..

మొదట సోలో వీడియోలు చేసి లక్షలాది మందిని ఆకట్టుకున్న బింగి రాకేశ్ కోరుట్లకు వచ్చిన తరువాత తన భార్య మేఘన సహకారం తీసుకున్నాడు. మొదట ఇన్‌స్టా వీడియోలు చేయడానికి ఇబ్బందిపడినా.. తర్వాత ఒకరికొకరు పోటీపడి ఇన్‌స్టా వీడియోల్లో నటిస్తూ ఆకట్టుకుంటున్నారు. భర్తతో కలిసి ఇన్‌స్టాలో చేస్తున్న వీరిద్దరు చేస్తున్న వీడియోలు గంభీరంగా మొదలై కడుపుబ్బ నవ్వించే తీరుగా ముగియడంతో చాలామంది నెటిజన్లు ఎంతగానో ఇష్టపడి చూస్తున్నారు. ఆరునెలల వ్యవధిలో వీరి ద్దరూ కలిసి చేసిన వీడియోలను ఇన్‌స్టాగాంలో 1.64 లక్షల మంది సబ్‌స్క్రైబర్స్ ఉండటం విశేషం.

ఉపాధికి ఊతం..

రాకేశ్, మేఘన జంట చేస్తున్న ఇన్‌స్టా వీడియోలతో ఉపాధికి అవకాశం దొరుకుతోంది. వీరి వీడియోలకు ప్రేక్షకులతోపాటు సబ్‌స్క్రైబర్స్ పెరుగుతుండటంతో సారీ కలెక్షన్స్, గిఫ్ట్ ఆర్టికల్స్, బేబీ స్టూడియోలు, ఇతరత్రా కంపెనీలు ప్రమోషన్స్ కోసం యాడ్స్ అందిస్తున్నాయి. ఈ యాడ్స్‌తో ప్రతినెలా రూ.15 నుంచి రూ.20 వేల వరకు ఆదాయం పొందుతున్నారు. ఓ వైపు పాపులారిటీ, మరోవైపు ఆదాయం రావడంతో ఈ జంట మరింత ఉత్సాహంతో వీడియోలు సిద్ధం చేస్తున్నారు. ఈ వీడియోల్లో మ్యూజిక్ మిక్సింగ్, ఎడిటింగ్ వంటి పనులను బింగి రాకేశ్ స్వయంగా చేస్తుండటం గమనార్హం. రానున్న కాలంలో జనం మెచ్చే రీతిలో మరిన్ని కపుల్ వీడియోలు తీయడానికి సన్నాహాలు చేస్తున్నామంటున్నారు రాకేశ్-మేఘన జంట.



సినిమాల్లో నటించాలని ఉంది

– బింగి రాకేశ్, మేఘన

నా మాటలో ఉన్న గాంభీర్యం.. నా భార్య మోములో వెంటవెంటనే మారిపోయే హావాభావాలు మాకు కలిసొస్తున్నాయి. మేమిద్దరం చేసిన ప్రతి కపుల్ వీడియో నెట్టింట ఫేమస్ అయ్యాయి. కొన్ని యూట్యూబ్ చానళ్లు, ఇతరత్రా చానళ్ల ఆఫర్లు ఇస్తున్నప్పటికీ సొంతంగా ఎదిగి సినిమాల్లో లేదా ఫోక్ సాంగ్స్‌లో నటించాలని ఉంది. మాకు ఆర్థికంగా ఎవరైనా మద్దతిస్తే మరిన్ని మంచి వీడియోలతో కోరుట్లకు మంచి పేరు తెస్తాం.
ఇన్‌స్టాగామ్ ఐడీ: రాకేశ్_బింగి6

ట్రాలీఆటో ఢీకొని ఒకరి మృతి

- అపస్మారక స్థితిలో మరొకరు
- దైవదర్శనానికి వెళ్లివస్తుండగా కొదురుపాక వద్ద ఘటన



పూర్ణచందర్ (ఫైల్)



గాయపడిన సాయి కిరణ్

బోయినపల్లి(చొప్పదండి): దైవ దర్శనాకి వెళ్లి వస్తుండగా.. ట్రాలీ ఆటో ఢీకొని ఒకరు మృతి చెందడంతోపాటు మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన బోయినపల్లి మండలం కొదురుపాక పరిసరాల్లో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు. వరంగల్ జిల్లా కాజీపేటకు చెందిన సిరిమల్ల పూర్ణచందర్(39), నూతి సాయికిరణ్(27) వేములవాడ రాజన్న దర్శనానికి బైక్‌పై వచ్చారు. దర్శనం అనంతరం బైక్‌పై వేములవాడ నుంచి కరీంనగర్ వైపు వెళ్తుండగా కొదురుపాక కేడీసీసీబీ పరిసరాల్లో ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటో ఢీకొట్టింది. ఈ సంఘటనలో పూర్ణచందర్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడ్డ సాయికిరణ్‌ను కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సాయికిరణ్ కోమాలోకి వెళ్లి అపస్మారకస్థితిలో ఉన్నట్లు సమాచారం. ప్రమాద సమయంలో బైక్‌పై వస్తున్న కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన జక్కని రాజుకు సైతం స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదంలో మృతిచెందిన పూర్ణచందర్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. పూర్ణచందర్‌కు తండ్రి శేఖర్, భార్య కవిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య కవిత ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



రాజశేఖర్ (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): క్రిమిసంహారక మందు తాగి, ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని వెంకటేశ్వరపల్లికి చంద్రగిరి రాజశేఖర్(28) మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 5న మద్యం కోసం డబ్బులు కావాలని ఇంట్లో గొడవ పడ్డాడు. క్షణికావేశంలో క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య భవాని, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజశేఖర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.

లైంగిక దాడి నిందితుడి రిమాండ్

రాయికల్:పట్టణానికి చెందిన మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడిన సింగు నగేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. బాలిక ఒంటరిగా ఉండగా గమనించిన నగేశ్ ఈనెల 8న లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు నగేశ్‌పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఆదివారం జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి విచారణ చేపట్టి నగేశ్‌ను రిమాండ్‌కు తరలించారని ఎస్సై వివరించారు.

ధర్మారంలో కాంగ్రెస్ ఫ్లెక్సీలు ధ్వంసం

- యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



ధ్వంసం చేసిన ఫ్లెక్సీలు

ధర్మారం(ధర్మపురి):పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు స్వాగతం పలికేందుకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఆదివారం తెల్లవారు జామున కొందరు యువకులు ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై సత్యనారాయణ.. తన సిబ్బందితో కలిసి యువకులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ధర్మపురి ఎమ్మెల్యేగా గెలుపొంది తొలిసారి ధర్మారం మండల కేంద్రానికి వస్తున్న ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు స్వాగతం పలుకుతూ కాంగ్రెస్ నాయకులు శనివారం రాత్రి స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కొందరు బీఆర్ఎస్‌కు చెందిన యువకులు మద్యం మత్తులో ఆదివారం తెల్లవారుజామున ఫ్లెక్సీలు ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు. స్నేహితుడి బర్త్‌డే పార్టీకి వెళ్లిన సదరు యువకులు.. ఫ్లెక్సీలను చూసి ధ్వంసం చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ సంఘటనపై ఫిర్యాదు రాకపోవటంతో కేసు నమోదు చేయలేదని పోలీసులు వివరించారు.

రైల్వేస్టేషన్‌లో యాచకుడి మృతి



వెంకటయ్య మృతదేహం

జమ్మికుంట(హుజూరాబాద్): పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఓ యాచకుడు మృతిచెందాడు. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి వివరాల ప్రకారం.. విటారి వెంకటయ్య(87) అనే యాచకుడు జమ్మికుంట పట్టణంలోని కొత్తపల్లి గ్రామంలో కొన్నేళ్లు ఓ ఇంట్లో అద్దెకు ఉన్నాడు. తర్వాత ఖాళీ చేసి, జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో ఉంటున్నాడు. అక్కడే బసవయ్య వేషధారణలో యాచిస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న వెంకటయ్య శనివారం చనిపోయాడు. మృతుడి కుటుంబసభ్యులు, బంధువుల వివరాలు తెలియకపోవడంతో మున్సిపల్ అధికారులకు సమాచారం అందించి, దహన సంస్కారాలు పూర్తి చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బాలుడి కిడ్నాప్‌నకు యత్నం

- నిందితుడిని చితకబాదిన స్థానికులు



నిందితుడికి దేహశుద్ధి చేస్తున్న స్థానికులు

జగిత్యాలక్రైం : జగిత్యాలలోని వాణినగర్‌కు చెందిన మతిస్థిమితం లేని రాజు (12)ను కిడ్నాప్ చేసేందుకు యత్నించిన వ్యక్తిని ఆదివారం స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వాణినగర్ ప్రాంతానికి చెందిన కొక్కుల గోపి, శైలజా దంపతుల కుమారుడు రాజు ఇంటిబయట ఆడుకుంటుండగా అలీ అనే వ్యక్తి మాయమాటలు చెప్పి కొత్త బస్టాండ్ వద్దకు తీసుకెళ్లాడు. రాజు స్నేహితులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అప్పటికే అలీ రాజుతో బస్సు ఎక్కే ప్రయత్నం చేస్తున్నాడు. స్థానికులు, కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని అలీని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. రాజును సురక్షితంగా ఇంటికి తీసుకవచ్చారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు చోరీ



పోలీస్‌స్టేషన్‌లో రోదిస్తున్న వృద్ధురాలు

జగిత్యాలక్రైం:జిల్లా కేంద్రంలోని శివవీధిలో సిగరెట్ కోసం వచ్చిన గుర్తు తెలియని అగంతకులు ఓ వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు చోరీ చేశారు. ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. శివవీధికి చెందిన బోనగిరి ఇందిరా కిరాణ దుకాణం నిర్వహిస్తోంది. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి సిగరెట్ కొన్నారు. ఆమె ఒంటరిగా ఉండడాన్ని గమనించి ఆమె మెడలో ఉన్న రెండు తులాల పుస్తెలతాడును లాక్కొని పరారయ్యారు. వృద్ధురాలు కేకలు వేయడంతో స్థానికులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. పట్టణ ఎస్సై అబ్దుల్‌రహీం సంఘటన స్థలానికి చేరుకుని సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

'మహాలక్ష్మి, చేయూత'ను సద్వినియోగం చేసుకోండి

- పెద్దపల్లి అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్



ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

మంథని:ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి, చేయూత పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ కోరారు. స్థానిక బస్‌స్టాండ్‌లో ఆదివారం ఆయన మహాలక్ష్మి పథకం ప్రారంభించారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం అందుబాటులోకి తెచ్చారు. స్థానిక మాతాశిశు ఆస్పత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పోస్టర్ ఆవిష్కరించారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా మహిళలు, ట్రాన్స్ జెండర్లు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. పేదలకు ఉచితంగా కార్పొరేట్‌స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో చేయూత ద్వారా రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్యసాయాన్ని రూ.10 లక్షలకు ప్రభుత్వం పెంచిందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్‌కుమార్, తహసీల్దార్ రాజయ్య, ఎంపీపీ కొండా శంకర్, కౌన్సిలర్లు రమాదేవి, హనుమంతరావు, ఆరోగ్య మిత్ర సంగీత పాల్గొన్నారు.

రాజన్నకు జనజాతర

- కోడెమొక్కులు చెల్లించిన భక్తులు
- దర్శనానికి ఐదు గంటల సమయం



రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుంటున్న నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి దంపతులు



ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

వేములవాడ: రాజన్నను ఆదివారం 35 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. కార్తీకమాసం చివరి అంకానికి చేరుతుండడంతో చలిని సైతం లెక్కచేయకుండా భారీగా భక్తులు తరలివచ్చారు. ధర్మగుండంలో స్నానాలు చేసి, కోడెమొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో మహిళలు కార్తీకదీపాలు వెలిగించారు. దర్శనానికి దాదాపు ఐదు గంటల సమయం పట్టడంతో క్యూలైన్‌లో నిల్చునేందుకు భక్తులు ఇబ్బందులు పడ్డారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్.భూపతిరెడ్డి దంపతులు స్వామి వారిని దర్శించుకొని, కోడెమొక్కులు చెల్లించుకున్నారు. వసతిగదులు ఉన్న ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేక దుర్గంధం వస్తోందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఒక్క రోజే భక్తుల ద్వారా రూ.50 లక్షల ఆదాయం సమకూరింది.

క్లుప్తంగా

నేడు రుద్రాభిషేకం

కరీంనగర్‌కల్చరల్: చిన్మయ మిషన్ నేతృత్వంలో పారువెళ్ల ఫణిశర్మ ఆధ్వర్యంలో బ్రహ్మచారి అక్షయ చైతన్య పర్యవేక్షణలో సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి 216 మంది దంపతులతో లక్ష్మీనగరంలోని కేఈఎస్ గార్డెన్‌లో సామూహిక రుద్రాభిషేకం, శివ కల్యాణం, కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు మిషన్ అధ్యక్ష, కార్యదర్శులు గంప జలేందర్, గజవాడ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు రుద్రాభిషేకం, 6 గంటలకు యజ్ఞానందస్వామి ప్రవచనం, రాత్రి 7 గంటలకు శివ కల్యాణం, 8.30 గంటల నుంచి కార్తీక దీపోత్సవం జరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం అల్పాహారం ఉంటుందని తెలిపారు. భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

రాష్ట్ర కార్యవర్గంలోకి కరీంనగర్ యువకులు


జెల్లపల్లి అంజన్న


ప్రమోద్

కరీంనగర్: ఢిల్లీలో జరిగిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) 69వ జాతీయ మహాసభల్లో రాష్ట్ర కమిటీలోకి కరీంనగర్ జిల్లా నుంచి జెల్లపల్లి అంజన్న రాష్ట్ర కార్యాసమితి సభ్యులుగా, నక్క ప్రమోద్ లా ఫోరమ్ రాష్ట్ర కోకన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరు గతంలో కళాశాల వైస్ ప్రెసిడెంట్‌గా, జోనల్ ఇంచార్జ్‌గా, నగర కార్యదర్శిగా వివిధ బాధ్యతల్లో పని చేశారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర శాఖకు, పెద్దలకు, విద్యార్థి పరిషత్ కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా విష్ణు


విష్ణు

కరీంనగర్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జిల్లా కన్వీనర్‌గా పూసాల విష్ణు ఢిల్లీలో జరిగిన ఏబీవీపీ 69వ జాతీయ మహాసభల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీలోకి జిల్లా నుంచి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న విష్ణు కరీంనగర్ నూతన జిల్లా కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. గతంలో నగర సంయుక్త కార్యదర్శిగా, నగర జోనల్ ఇంచార్జ్‌గా, నగర కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వివిధ బాధ్యతల్లో పని చేశారు. తనపై నమ్మకంతో కరీంనగర్ జిల్లా కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర శాఖ, పెద్దలు, విద్యార్థి పరిషత్ కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

తెలుగు సాహిత్య కళా ఉత్సవాలకు ఆహ్వానం


సుధాకర్‌రెడ్డి

కరీంనగర్‌కల్చరల్: ఐఎస్‌వో గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య సామాజిక సేవాసంస్థ శ్రీశ్రీకళా వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ చైర్మన్ కత్తి ముండ ప్రతాప్ సారథ్యంలో డిసెంబర్ 16, 17ల్లో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో 30 గంటల పాటు జరిగే ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలకు కరీంనగర్‌కు చెందిన రచయిత, విశ్రాంత గ్రంథాలయ ఉద్యోగి, తెలుగు విశ్వవిద్యాలయ కీర్తి పురస్కార గ్రహీత డాక్టర్ ముదుగంటి సుధాకర్‌రెడ్డికి ఆహ్వానమందింది. జాతీయ కన్వీనర్ కె.రమావతి నుంచి ఆహ్వానం వచ్చినట్లు సుధాకర్‌రెడ్డి తెలిపారు.

మార్పులకనుగుణంగా అడుగులు వేయాలి


మాట్లాడుతున్న మూర్తి

కొత్తపల్లి: మారుతున్న విద్యావిధానంలో మార్పులకనుగుణంగా విద్యార్థులు అడుగులు వేస్తూ అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని పలువురు వక్తలు సూచించారు. పారమిత హెరిటేజ్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో పద్మనగర్‌లోని పాఠశాలలో నిర్వహించిన పదోతరగతి తర్వాత విద్యార్థుల అడుగులు ఎటువైపు అన్న అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో క్షేత్ర సంస్థల ప్రతినిధి పీవీఆర్‌కే మూర్తి మాట్లాడారు. మారిన ఎన్ఈపీ విద్యావిధానంలో స్టేట్ బోర్డు విద్యావిధానం వైపు వెళ్లడమనేది విద్యార్థికి ఉత్తేజ స్థితి నుంచి నిస్తేజ స్థితి వైపు మరలించడమేనన్నారు. డా.పరంజ్యోతి మాట్లాడుతూ.. సీబీఎస్ఈ, ఐఐటీ వంటి పోటీ పరీక్షలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు మాట్లాడుతూ.. పదోతరగతి తర్వాత విద్యార్థి వేసే ప్రతి అడుగు అంతర్జాతీయ స్థాయిలో ఉనికి చాటేలా ఉండాలన్నారు. గ్లోబల్ వార్మింగ్‌లో పార్టనర్‌గా ఉండేందుకు దోహదపడాలని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేశారు. పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాసంగి సాగు ప్రణాళిక ఖరారు

- 13వేల ఎకరాల్లో పంటల సాగు
- అత్యధికంగా వరి సాగుకే మొగ్గు


ఎలబోతారంలో వరి నారు

కరీంనగర్‌రూరల్: యాసంగి సీజన్ పంటలను సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. వ్యవసాయాధికారులు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచేందుకు యాసంగి 2023–24 సంవత్సరం పంటల ప్రణాళికను ఖరారు చేశారు. మొత్తం13,009 ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తారని అంచనా వేశారు. ప్రధానంగా వరి పంట 12,185 ఎకరాల్లో సాగవుతుంది. ఎస్సారెస్పీతో పాటు చెరువులు, కుంటలు, బావుల్లో నీళ్లు సరిపడేలా ఉండటంతో పలువురు రైతులు ఆరుతడి పంటలకు బదులుగా వరి పంటను సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. వరికి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ప్రభుత్వం ఎలాంటి ప్రకటనలు చేయకపోవడంతో.. మెజార్టీ రైతులు వరి సాగు చేసేందుకు ముందుకొస్తున్నారు. ఇప్పటికే కరీంనగర్ మండలం పలు గ్రామాల్లోని కొందరు రైతులు వరి నార్లు పోయగా.. మరికొందరు రైతులు నార్లు పోసేందుకు దుక్కులు దున్నుతున్నారు. మరికొన్ని రోజుల్లో పంటల సాగు ప్రక్రియ వేగం పుంజుకోనుంది. సాగుకవసరమైన విత్తనాలు, ఎరువులను రైతులు సమకూర్చుకుంటున్నారు. గోపాల్‌పూర్, దుర్శేడ్, గుంటూరుపల్లి, చేగుర్తి, నల్లగుంటపల్లి తదితర గ్రామాల్లో 285 ఎకరాల్లో వివిధ రకాల కూరగాయలను సాగు చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

అందుబాటులో ఎరువులు

పంటల సాగు విస్తీర్ణానికనుగుణంగా ఎరువుల కొరత లేకుండా అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. రైతులకు సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచుతున్నారు. సాగులో వేగం, పంట యాజమాన్య పద్ధతులకనుగుణంగా సరిపడా ఎరువులను సమకూర్చేందుకు అధికారులు ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

వరి నాట్లు వేసేనుంచి సరైన పంట యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులను సాధించే అవకాశముంది. లైసెన్సు పొందిన దుకాణాల్లో ప్రభుత్వ ఆమోదిత విత్తనాలను కొనుగోలు చేయాలి. లాట్ నెంబరుతో సహా బిల్లులు తీసుకోవాలి. స్వల్పకాలిక, మధ్యకాలిక రకాలను 21 రోజుల నుంచి 30 రోజుల మధ్యలో నాట్లు వేసుకోవచ్చు. వెదజల్లడం, డ్రమ్ సీడర్‌తో వరి విత్తనాలను సాగు చేయడం ద్వారా ఎకరానికి రూ.5వేల వరకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి.

– బి.సత్యం, మండల వ్యవసాయాధికారి, కరీంనగర్

యాసంగి పంటల సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)

పంట	ఎకరాలు
వరి	12,185
మొక్కజొన్న	275
పెసర	10
కందులు	24
కూరగాయలు	285

ఎరువుల ప్రణాళిక యాసంగి 2023-24

ఎరువు	స్టాక్(మెట్రిక్ టన్నులు)
యూరియా	1,301
డీఏపీ	650
పొటాష్	325
కాంప్లెక్స్	976

మానవ హక్కుల పరిరక్షణకు పాటుపడాలి


సమావేశంలో పాల్గొన్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్): మానవ హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజు అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం కరీంనగర్‌లోని విక్టరీ అకాడమీలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. భారత రాజ్యాంగం మనిషి స్వేచ్ఛగా సమాజంలో జీవించడానికి అనేక హక్కులను కల్పించిందన్నారు. ఈ హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఈ సమావేశంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు గంగ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు దుస్స లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఉప్పుల మునీష్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ


ఎలబోతారంలో నివాళి అర్పిస్తున్న ఎంపీ సంజయ్

కరీంనగర్‌రూరల్: ఎలబోతారం, ఇరుకుల్లలోని బీజేపీ కార్యకర్తల కుటుంబాలను ఆదివారం ఎంపీ బండి సంజయ్‌కుమార్ పరామర్శించారు. ఎలబోతారానికి చెందిన బీజేపీ బూత్ అధ్యక్షుడు ఆడెపు శ్రీకాంత్ తండ్రి సుధాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఇరుకుల్లకు చెందిన బీజేపీ కార్యకర్త ఏగుర్ల రవి విద్యుదాఘాతంతో మరణించాడు. రెండు కుటుంబాల సభ్యులను ఎంపీ పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. బీజేపీ నాయకులు పుల్లెల పవన్‌కుమార్, దారం జగన్నాథరెడ్డి, వేల్పుల శ్రీనివాస్, ఎం.దేవేందర్, రాజిరెడ్డి, రవి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో అవినీతి నిర్మూలన దినోత్సవం


మెమొంటోలు అందిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారులోని కేజీబీవీలో ఆదివారం అవినీతి నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవినీతి నిర్మూలనలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ మెమొంటోలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హమ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు జి.శ్రీకాంత్, మనీశ్, రాజు, కేజీ బీవీ ప్రత్యేకాధికారి భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

కవ్వంపల్లికి ఘన స్వాగతం


కవ్వంపల్లికి స్వాగతం పలుకుతున్న నాయకులు

మానకొండూర్: మానకొండూర్ ఎమ్మెల్యేగా గెలుపొంది అసెంబ్లీలో ప్రమాణ స్వీరారం చేసిన అనంతరం కవ్వంపల్లి సత్యనారాయణ ఆదివారం మానకొండూర్, ఖాదర్‌గూడెం, చెంజర్ల, గట్టుదుద్దెనపల్లి మీదుగా శంకరపట్నం మండలానికి వెళ్లారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. మహిళలు మంగళ హారతులతో హారతి ఇవ్వగా, కార్యకర్తలు పూలదండలు, గజమాలతో శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే ప్రతి ఒక్కరిని కలుసుకుంటూ అభివాదం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారీ, ఎంపీపీ ముద్దసాని సులోచన, సర్పంచ్ బొల్ల మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్, నాయకులు ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి, మాడ తిరుపతిరెడ్డి, గసికంటి సంపత్, దూలం దేవేంద్ర, సాయిరి దేవయ్య, కానిగంటి మల్లికార్జున్, తాల్ల కుమార్, ఆరెల్లి సంపత్‌గౌడ్, పెంచాల రాజయ్య, ఎండి వలిపాషా, సయ్యద్ అంకూస్, జిల్లెల సంపత్, వంగ రాయమల్లు, జిల్లెల చంద్రయ్య, ఆకునూరి మల్లయ్య, చంటి చంద్రయ్య, పాలవేని సంపత్, సీత పద్మ, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శంకరపట్నం చేరుకోగానే ఆదివారం రాత్రి మండలంలోని తాడికల్, వంకాయగూడెం, కేశవపట్నం, కొత్తగట్టు గ్రామాల్లో ర్యాలీ తీశారు. కవ్వంపల్లికి మహిళలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బత్తినిశ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు బస్వయ్య, పద్మ, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

గన్నేరువరం: ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు గుండ్లపల్లి స్టేజీ వద్ద ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి, జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్, జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సర్పంచులు నర్సింహారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ సంపత్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అనిల్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్, చింతల శ్రీధర్‌రెడ్డి, మల్లేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిగురుమామిడి: ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు జెడ్పీటీసీ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు గీకురు రవీందర్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి స్టేజీ వద్ద కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో శాలువా కప్పి పూలబోకే ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా అధికార ప్రతినిధి దాసరి ప్రవీణ్‌కుమార్, మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, నాయకులు గునుకుల రాజేశ్వర్‌రెడ్డి, వేణుగోపాల్, కాటం సంపత్‌రెడ్డి, సంజీవరెడ్డి, సాంబారి బాబు పలువురు నాయకులు ఉన్నారు.

తిమ్మాపూర్: మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు అడుగుఅడుగున నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. గుండ్లపల్లి నుంచి రేణికుంట, నుస్తులాపూర్, రామకృష్ణకాలనీ, తిమ్మాపూర్ నుంచి అల్గనూర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, ఎస్ఎల్ గౌడ్, జీఎస్ రెడ్డి, పోలు రాము, శ్రీనివాస్, మండలంలోని సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పథకం పేదలకు వరం

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కవ్వంపల్లి


ఉచిత ప్రయాణం పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మానకొండూర్: ఆరోగ్యశ్రీ పథకం పేదలకు వరమని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పథకాన్ని ప్రారంభించి లక్షల మందికి ప్రాణం పోశాడని, జిల్లా కేంద్రంలోని ఆసుపత్రుల్లో పథకం అమలవుతుందన్నారు, గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్యం చేయించుకుంటే బిల్లులు చెల్లించే పరిస్థితి లేదన్నారు. ఆశా కార్యకర్తలు, హెల్త్‌అసిస్టెంట్లు, వైద్యాధికారులు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని కోరారు. అనంతరం మానకొండూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, అదనపు కలెక్టర్ కె.లక్ష్మీకిరణ్, ఎంపీపీ ముద్దసాని సులోచనతో కలిసి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణాన్ని ప్రారంభించి మాట్లాడారు. బస్సులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకూ విద్యార్థినులు మహిళలతో కలిసి ప్రయాణించారు. బస్సులో ప్రయాణిస్తున్న పురుషులందరికి టికెట్లు తీసుకున్నారు. మహిళలు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీసీఈవో పవన్, డీటీసీవో డాక్టర్ రవీందర్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ గోపాల్, సీహెచ్‌వో రాజునాయక్, హెల్త్ అసిస్టెంట్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పురగిరి క్షత్రియ పెరిక సంఘం కార్యవర్గం


రాజేందర్‌వర్మ

తిమ్మాపూర్: పురగిరి క్షత్రియ పెరిక సంఘం తిమ్మాపూర్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. ముందుగా సంఘం సమావేశం నిర్వహించారు. కులబంధువులు ఐక్యత, సమస్యలపై చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాదన రాజేందర్‌వర్మ, ప్రధాన కార్యదర్శిగా దుండె మోహన్, ఉపాధ్యక్షుడిగా పోతురాజు దేవేందర్, కోశాధికారిగా మీస రాజువర్మ, ఉప కోశాధికారిగా మాదన శ్రీనివాస్, సలహాదారులుగా పోతురాజు శ్రీనివాస్, మాదన మహేశ్‌చంద్ర ఎన్నికయ్యారు. నియామకానికి సహకరించిన కుల పెద్దలందరికీ నూతన కార్యవర్గ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో.. కుల ఐక్యతకు పాటుపడి సంఘం బలోపేతానికి కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు మాదన రాజేందర్ తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహానికి నివాళి


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర: చొప్పదండి ఎమ్మెల్యేగా గెలుపొంది అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మొదటిసారిగా గంగాధర మండలానికి వచ్చిన మేడిపల్లి సత్యంకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఘనస్వాగతం పలికారు. మండలంలోని మధురానగర్ చౌరస్తాలో భారీ ఎత్తున వాహనర్యాలీ నిర్వహించి గజమాలతో స్వాగతించారు. చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు పురమల్ల మనోహర్, పుల్కం నర్సయ్య, వేముల భాస్కర్, వొడ్నాల యగ్నేష్, పుల్కం గంగన్న, స్వామి, పెంచాల చందు,గడ్డం ఎల్లయ్య, తదితరులున్నారు.

రామడుగు: ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంకు మండలంలోని కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై దేశరాజ్‌పల్లి గ్రామ శివారులో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. పలువురు నాయకులు పూలబోకేలు అందించి, శాలువాలతో సన్మానించారు. అనంతరం వెదిర గ్రామ పరిధిలోని బొంతలోరి హనుమాన్ దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి 116 టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బి. తిరుపతి, సర్పంచ్ రమేశ్, పార్టీ జిల్లా అధ్యక్షురాలు సత్యప్రసన్న, మాజీ ఎంపీపీ వీర్ల నర్సింగరావు, నాయకులు పంజాల శ్రీనివాస్‌గౌడ్, రత్నాకర్‌రెడ్డి, శ్రీనివాస్, రసూల్, కాడె శంకర్, ఎల్లేష్‌కుమార్, అమిరిశెట్టి సుధాకర్, కనకయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

రామడుగు: ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి కరీంనగర్‌కు చేరుకున్న తొలిరోజే ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మానవత్వం చాటుకున్నారు. గోపాల్‌రావుపేటకు చెందిన ప్రవళిక అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్‌లో పరీక్షలు చేసుకోగా.. వైద్య ఖర్చులకు రూ.5లక్షలు కావాలనడంతో ఎమ్మెల్యేకు తెలిపారు. రూ.ఐదు లక్షల ఎల్‌వోసీని ఆదివారం కరీంనగర్‌లోని స్వగృహంలో అందజేశారు.

అయ్యప్ప పడిపూజ



చొప్పదండి: పట్టణంలోని యెన్నం శ్రీనివాస్ ఇంట్లో ఆదివారం అయ్యప్పస్వామికి పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప భక్తులు భజనలతో హోరెత్తించారు. పూజారి చరణ్, గురుస్వామి శ్రవణ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

స్వీట్లు పంచిపెట్టిన కాంగ్రెస్ నాయకులు


స్వీట్లు పంచుతున్న నాయకులు

జమ్మికుంట: ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్న సందర్భంగా పట్టణంలోని బస్టాండ్‌లో వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం స్వీట్లను పంచారు. సౌకర్యాలను మహిళ ప్రయాణికుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ... ఉచిత బస్సు సౌకర్యం ద్వారా డబ్బులు ఆదా అవుతున్నాయని మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కడియం శ్రీహరి కాంగ్రెస్ ప్రభుత్వం ఆరునెలలు ఉండదని, రైతు బంధు ఎప్పుడు ఇస్తారు అనడం నూతనంగ ఏర్పడిన ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు బీఆర్ఎస్ వద్దనే కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారనేది తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకరి రమేశ్, కసుబోజుల వెంకన్న, ఎండీ సలీం, ఎగ్గని శ్రీనివాస్, పోతుల శ్రీనివాస్, సిలివేరు రాజమౌళి, శ్రీనివాస్, మొలుగూరి సమ్మయ్య, ప్రభుదాస్, సరిపురం కుమార్, మురళి, నవీన్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు



హుజూరాబాద్: పట్టణంలోని 17వ వార్డు మామిళ్లవాడలో గ్యార్మీ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. వేడుకలకు కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కొల్లూరి కిరణ్, మైనార్టీ టౌన్ అధ్యక్షుడు ఎండీ అప్సర్, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...



4,141 అడుగుల ఎత్తులో నీళ్లు!

బి.కొత్తకోట: సముద్రమట్టానికి 4,141 అడుగుల ఎత్తులో బ్రిటిష్ పాలనలో అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై నిర్మించిన బావిలో ఇటీవల కురిసిన వర్షాలకు ఊటనీళ్లు ఉబికి వస్తున్నాయి. దీంతో బావి నిండి..పైకి నీళ్లు వస్తున్నాయి. ఈ దృశ్యాన్ని సందర్శకులు విశేషంగా తిలకిస్తున్నారు. 144 ఏళ్ల క్రితం హార్సిలీకొండలో నీటికోసం అప్పటి ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల కలెక్టర్ డబ్ల్యూ.డీ.హార్సిలీ నిర్మించిన బావి నేటికీ చెక్కు చెదరలేదు. పటిష్టమైన రాతికట్టడంతో నిర్మించిన ఈ బావి ప్రస్తుతం పర్యాటక ప్రదేశంగా మారింది.

శాస్త్రీయ సంగీతంతో మనో వికాసం

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



విజయవాడ కల్చరల్: శాస్త్రీయ సంగీతం నిరంతరం ప్రవహించే గంగా ప్రవాహం వంటిదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ, ఏపీ పర్యాటక శాఖ, కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ, కేంద్ర టెక్స్‌టైల్ శాఖ ఆధ్వర్యంలో 3 రోజులపాటు నిర్వహించే కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమాన్ని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం సంగీత సాహిత్యాలకు పెద్దపీట వేస్తోందని అభినందించారు. శాస్త్రీయ సంగీతం వల్ల మనో వికాసం కలుగుతుందని చెప్పారు. రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి రోజా మాట్లాడుతూ..భారతీయ సంగీత సంప్రదాయాలు విశిష్టమైనవన్నారు. తెలుగు రాష్ట్రాల పునర్విభజన జరిగాక ఏపీలో తొలిసారిగా కేంద్రం సహకారంతో విజయవాడలో 3 రోజులపాటు కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఏపీ బాటలో కేంద్రం

- రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత వైద్యం
- కేంద్ర రోడ్డు రవాణా శాఖ నిర్ణయం

సాక్షి, అమరావతి: రోడ్డు ప్రమాదాల్లో చోటుచేసుకుంటున్న మరణాల సంఖ్యను తగ్గించేందుకు ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాన్ని దేశమంతటా ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత విధానాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. దీనిపై విధి విధానాలు రూపొందించాల్సిందిగా కేంద్ర రోడ్డు రవాణా శాఖను కేంద్ర ప్రభుత్వం ఆదేశించడం ప్రాధాన్యత సంతరించుకుంది. జాతీయ నేర గణాంకాల సంస్థ(ఎన్‌సీఆర్‌బీ) తాజా నివేదిక ప్రకారం గత ఏడాది దేశవ్యాప్తంగా 4,46,768 రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. వాటిలో 4,23,158 మంది గాయపడగా.. 1,71,100 మంది మరణించారు. వారిలో గోల్డెన్ అవర్‌లో మెరుగైన చికిత్స అందకపోవడంతో దాదాపు 50వేల మంది మరణించినట్టు అంచనా. రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన చికిత్స అందించే దిశగా పోలీస్, రవాణా, ఆర్ అండ్ బీ, వైద్య–ఆరోగ్య శాఖలను సమన్వయపరుస్తూ రాష్ట్ర, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశారు. దాంతోపాటు రోడ్డు ప్రమాద బాధితులను వెంటనే ఆస్పత్రికి తరలించే సామాన్యులను ప్రోత్సహించేందుకు 'గుడ్ సమరిటన్' విధానంలో నగదు ప్రోత్సాహకాలు అందిస్తోంది. అయినప్పటికీ ఆశించిన ఫలితాలు లేకపోవడంతో ఇతర విధానాలపై కేంద్ర రవాణా శాఖ దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌తోపాటు దేశంలో ఆరు రాష్ట్రాలు అమలు చేస్తున్న నగదు రహిత వైద్య విధానంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. రోడ్డు ప్రమాద బాధితులకు దేశవ్యాప్తంగా నగదు రహిత వైద్య విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. గోల్డెన్ అవర్‌గా పరిగణించే రోడ్డు ప్రమాదం సంభవించిన తరువాత తొలి గంటలో అత్యవసర చికిత్సతోపాటు అన్నిరకాల ట్రామా కేర్, ఇతర వైద్య సేవలను పూర్తిగా నగదు రహిత చికిత్స అందిస్తారు.



ప్రమాద స్థలానికి సమీపంలోని ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో తప్పనిసరిగా నగదు రహిత వైద్యం అందించే దిశగా విధి విధానాలను రూపొందించనుంది. నగదు రహిత విధానంపై నివేదిక ఇవ్వాలని ఏపీ రవాణా శాఖతోపాటు ఆయా రాష్ట్రాలను కూడా కోరింది. దీనిపై రెండు నెలల్లో నివేదిక సమర్పించిన తరువాత దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత వైద్యసేవల విధానాన్ని అమలులోకి తీసుకురావాలని భావిస్తోంది.



వైఎస్సార్ జిల్లా కమలాపురం చెన్నూరులో జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

కమలాపురం.. జనసంద్రం

- చెన్నూరు సభకు పోటెత్తిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- డప్పుల చప్పుళ్లతో, ఆటపాటలతో ప్రాంగణానికి చేరిక
- నేతలు సీఎం జగన్ పేరు ప్రస్తావించగానే.. సభికుల చప్పట్లు,
- అణగారిన వర్గాల ఆశా జ్యోతి జగనేనని నేతల ప్రశంసలు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ జిల్లా కమలాపురం నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన సామాజిక సాధికార యాత్రకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పోటెత్తారు. చెన్నూరులో నిర్వహించిన బహిరంగ సభకు జనం వెల్లువలా తరలివచ్చారు. వివిధ గ్రామాల నుంచి డప్పుల దరువులు, ఆటపాటలతో ప్రజానీకం ర్యాలీగా ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. ఇలా వేలాది మంది తరలి రావడంతో సభాస్థలిలో అందరూ కూర్చునే పరిస్థితి లేకుండా పోయింది. వెరసి చెన్నూరులో ఎటు చూసినా, ఏ వీధిలో చూసినా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు వైఎస్సార్‌సీపీ జెండాలను రెపరెపలాడిస్తూ కనిపించారు. కమలాపురం ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు తమ ప్రసంగాల్లో సీఎం జగన్ పేరును ఉచ్చరించగా.. సభికులు పెద్దపెట్టున హర్షధ్వానాలు చేశారు.

అంబేడ్కర్ ఆలోచన విధానాలు అమలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావ్ పూలే, కొమురం భీమ్ వంటి మహనీయుల ఆలోచనలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ అన్నారు. అణగారిన వర్గాలకు అండగా, భావి తరాల ఉన్నతికి దూరదృష్టితో పెద్దపీట వేస్తున్న వైఎస్ జగన్‌ను మరోమారు మన కోసం ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కామెడీ యాక్టర్ పవన్, నయవంచకుడు చంద్రబాబు కలిసికట్టుగా వస్తున్నారని, వారి మాయమాటలు నమ్మొద్దని సూచించారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన అడ్రస్ గల్లంతు

- టీడీపీతో పొత్తు వల్లే తెలంగాణలో కాంగ్రెస్‌కు ఆంధ్రా సెటిలర్స్ దూరం
- ఏపీ ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి పునరావృతం: బాలినేని

ఒంగోలు: వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ అడ్రస్ లేకుండా పోతాయని మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఒంగోలులోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఎన్నికల్లో టీడీపీ జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌కు వత్తాసు పలికితే.. జనసేన మరో జాతీయ పార్టీ బీజేపీతో పొత్తుపెట్టుకుందన్నారు. ఏపీలో అనైతిక పొత్తు ద్వారా టీడీపీ–జనసేన ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నాయని స్పష్టమవుతోందన్నారు. ఇటువంటి నైతికతలేని పొత్తులను ఆంధ్రా ప్రజలు అంగీకరించరని చెప్పారు. కాంగ్రెస్ గెలుపు తమ వల్లే అంటూ టీడీపీ వాళ్లు చేసుకున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న ఆంధ్రా సెటిలర్స్ అంతా బీఆర్ఎస్‌కే మద్దతు పలికి గెలిపించారని.. కనీసం కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కలేదని చెప్పారు. టీడీపీతో పొత్తు వల్లే తెలంగాణలో కాంగ్రెస్‌కు ఆంధ్రా సెటిలర్స్ దూరం అయ్యారన్నారు. టీడీపీ



కూడా ఫలితాలు వెలువడిన ఒకటి రెండు రోజులు హడావుడి చేసి.. ఆ తరువాత జనానికి విషయం అర్థం అయిందని తెలియగానే గప్‌చుప్ అయిందని చెప్పారు. టీడీపీ అంటేనే ఆంధ్రా ప్రజానీకం అసహ్యించుకునే పరిస్థితి నెలకొందన్నారు. టీడీపీ వారు రోడ్డు మీదకు రావడాన్ని తట్టుకోలేకనే తెలంగాణలో కాంగ్రెస్‌కు దూరంగా ఉన్నారని, రేపు ఆంధ్రాలో జరిగే సాధారణ ఎన్నికల్లో టీడీపీ అడ్రస్ కూడా గల్లంతవుతుందని చెప్పారు.



పాడేరులో ఉదయం 9 గంటలకు కురుస్తున్న పొగమంచు

చింతపల్లిలో 11, అరకులో 12.3 డిగ్రీలు

అల్లూరి జిల్లాలో గణనీయంగా తగ్గుతున్న ఉష్ణోగ్రతలు

సాక్షి,పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 9 గంటల వరకు పాడేరు, చింతపల్లి, అరకులోయ ప్రాంతాల్లో మంచుతెరలు వీడటం లేదు. ఘాట్ ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కారణంగా లైట్ల వెలుగులో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఉష్ణోగ్రతలూ రోజురోజుకూ తగ్గుముఖం పడుతున్నాయి. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో శనివారం 15.5 డిగ్రీలు నమోదు కాగా ఆదివారం 4.5 డిగ్రీలు తగ్గి 11 డిగ్రీలు నమోదైంది. అరకులోయ కేంద్ర కాఫీ బోర్డులో 12.3 డిగ్రీలు, పాడేరు మండలంలోని మినుములూరు కేంద్ర కాఫీ బోర్డు వద్ద 13 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్లు కాఫీబోర్డు వర్గాలు తెలిపాయి. ఆయా ప్రాంతాల్లో సాయంత్రం నుంచి చలి గాలులు విజృంభిస్తున్నాయి.

మంచు అందాలకు ఫిదా...

జిల్లా వ్యాప్తంగా చలిగాలుల తీవ్రత ఉన్నప్పటికీ మంచు అందాలను తిలకించేందుకు పర్యాటకులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చి అందాలను వీక్షిస్తూ పరవశిస్తున్నారు. మారేడుమిల్లి ప్రాంతంలోని గుడిసె, చింతపల్లి మండలంలోని లంబసింగిలోని చెరువులవెనం, పాడేరు మండలంలోని వంజంగి హిల్స్, హుకుంపేట మండలంలోని సీతమ్మకొండ, అరకులోయ మండలంలోని మాడగడ హిల్స్ ప్రాంతాలకు వేకువజామునే చేరుకుని పొగమంచు, సూర్యోదయం, మేఘాల అందాలను వీక్షిస్తున్నారు.



మాడగడ హిల్స్‌లో పర్యాటకులు

నిలిచిన మెడికల్ బోర్డు

- 4 నెలల నుంచి సమావేశాలు బంద్
- ఆలస్యంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన
- కొత్త ప్రభుత్వం అమలు తీరుపై సింగరేణి వ్యాప్తంగా చర్చ

శ్రీరాంపూర్: సింగరేణిలో మెడికల్ బోర్డు సమావేశాలు నిలిచిపోయాయి. నెలకోసారి బోర్డు సమావేశం కావాల్సిన ఉండగా, 4 నెలలు కావస్తున్న ఇంకా సమావేశాలు నిర్వహించడం లేదు. దీంతో బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులు ఆందోళన చెందుతున్నారు. జబ్బుతో ఆసుపత్రిలో ఉన్నవారైతే తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ ఏడాది ఆగస్టు 19, 20 తేదీల్లో చివరి సమావేశం జరిగింది. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయినందున ఈ నెలలోనైనా నిర్వహిస్తారా లేదా సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల తరువాత నిర్వాహిస్తారా అన్నది యాజమాన్యం ప్రకటించడం లేదు.

వీరు అర్హులు..

చాలా మంది సీనియర్ కార్మికులు కీళ్లనొప్పులు, వెన్ను నొప్పులు, గుండె జబ్బులు, కిడ్నీ సంబంధిత వ్యాధులు, ఇతర అనారోగ్యాలతో సమస్యలతో బాధపడున్నారు. ఈ జబ్బులతో ఇక డ్యూటీలు చేయడం చేతకాదని భావించిన వారు, విధుల్లో ఉండగా ఏదేని ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వారు కంపెనీ మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకుంటారు. ఆన్‌డ్యూటీలో ఉన్న వారే కాకుండా తీవ్ర గాయాలు, ఇతర జబ్బులతో ఇప్పటికే ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నవారు కూడా మెడికల్ బోర్డుకు రిఫరల్ అవుతారు. ఇలా దరఖాస్తు చేసుకున్న వారు, రిఫరల్ అయిన వారిని ప్రతీనెల మెడికల్ బోర్డుకు పిలిచి వారికి వైద్య పరీక్షలు చేస్తారు. ఇక పని చేయలేరనుకున్న వారిని బోర్డులో మెడికల్ ఇన్వాలిడేషన్ చేస్తారు. ప్రతీనెల మెడికల్ బోర్డుకు సుమారు 180 మంది హాజరు అవుతారు. వీరిలో సుమారు 100 నుంచి 120 మంది వరకు ఇన్వ్యాలిడేషన్(అన్‌ఫిట్) అవుతుంటారు. మిగితా వారికి ఫిట్ ఫర్ సేమ్ జాబ్, రిఫర్‌టూ హయ్యర్ సెంటర్, అండర్ గ్రౌండ్‌లో అన్‌ఫిట్– ఫిట్ ఫర్ సర్ఫేస్ అని బోర్డు ఆదేశాలు జారీ చేస్తుంది.



మెడికల్ బోర్డు నిర్వహించే కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్

ఎన్నికల కోడ్‌తోనేనా..?

బోర్డు నిలిచిపోయిన 4 నెలలు కావస్తుంది. గత శాసన సభ ఎన్నికల నేపథ్యంలో కోడ్‌లో భాగంగానే కంపెనీ బోర్డు సమావేశాలు నిలిపివేసిందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. కోడ్‌కు ముందు కూడా కంపెనీ సమావేశాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా నిర్వహించలేదు. ఇప్పుడు మళ్లీ సింగరేణి ఎన్నికల హడావుడిలో కంపెనీ ఎప్పుడు నిర్వహిస్తుందోనని దరఖాస్తు చేసుకున్న కార్మికులు ఎదురుచూస్తున్నారు.

రూల్స్ ఎలా ఉంటాయో..

సింగరేణిలో కారుణ్య ఉద్యోగాలను అమలు చేయించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కింది. 70 నుంచి 80 శాతం వరకు బోర్డులో ఇన్‌వ్యాలిడేషన్ అయ్యేవారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో బోర్డులో ఎంత మందిని ఇన్వ్యాలిడేషన్ చేస్తురో అన్నది చర్చనీయాంశంగా మారింది. దీని సంఖ్య మరింత పెంచుతారా, తగ్గిస్తారా అన్నది కంపెనీ ప్రభుత్వ పెద్దలతో చర్చించిన తరువాత తెలిసే అవకాశం ఉందని కార్మిక సంఘాల నేతలు పేర్కొంటున్నా. ఇప్పుడున్నది ఉన్నట్లే నడిపిస్తారా లేక, మరింత సరళం చేస్తారా..?, నిబంధనలు కఠిన తరం చేస్తారా..? అన్న చర్చ సింగరేణి వ్యాప్తంగా జరుగుతోంది.

ఆలస్యంతో డిపెండెంట్లకు ఇబ్బంది..

కార్మికుడు మెడికల్ ఇన్వ్యాలిడేషన్ అయితే ఆయన స్థానంలో వారి డిపెండెంట్‌కు ఉద్యోగం లభిస్తుంది. కార్మికుడు రిటైర్ కావడానికి రెండేళ్ల మిగులు సర్వీసు ఉండగా మెడికల్ బోర్డుకు పిలుస్తున్నారు. ఈ బోర్డు జాప్యం అవుతున్న కొద్దీ డిపెండెంట్ వయసు పెరుగుతుంది. మెడికల్ ఇన్వ్యాలిడేషన్ అయ్యే కార్మికుని స్థానంలో ఆ ఉద్యోగాన్ని వారి డిపెండెంట్‌కు కారుణ్య ఉద్యోగం కింద ఇస్తారు. కారుణ్య ఉద్యోగం పొందే వారికి గరిష్టంగా 35 ఏళ్ల వయసు నిబంధన ఉంది. ఇప్పటికే చాలా మంది సీనియర్ల డిపెండెంట్లు ఈ అర్హత వయసుకు బార్డర్‌లో ఉన్నారు. జాప్యం అవుతున్న కొద్ది డిపెండెంట్ల వయసు 35 ఏళ్లు దాటుతుండంతో వారు కారుణ్య ఉద్యోగ అర్హతను కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. దీంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కలగానే ఉద్యాన పరిశోధన కేంద్రం

- ప్రభుత్వాలు మారుతున్నా పట్టింపులేని లేదు
- ప్రతిపాదనలన్నీ బుట్టదాఖలవుతున్న వైనం
- రైతుల చిరకాల కోరిక ఎన్నాళ్లకు నెరవేరేనో..?

జగిత్యాలఅగ్రికల్చర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా పూర్తిగా వ్యవసాయ ఆధారితం. ఇక్కడ వరి, మొక్క జొన్న వంటి పంటలతోపాటు మామిడి సాగవుతుంది. జగిత్యాలలో అరటి, బొప్పాయి, పసుపుతోటలు ఎక్కువగా సాగు చేస్తుంటారు. కొన్నాళ్లుగా అభ్యుదయ రైతులు డ్రాగన్ ఫ్రూట్, జామ, దానిమ్మ వంటి లాభదాయకమైన పంటల వైపు దృష్టి సారిస్తున్నారు. అయితే ఉద్యానరైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చే శాస్త్రవేత్తలు మాత్రం అందుబాటులో లేరు. ఈ ఏడాది కొత్తగా ఆయిల్‌పాం తోటలను దాదాపు 20 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఆయిల్‌పాం కొత్త పంట కావడంతో రైతులకు సలహాలు, సూచనలు సరిగ్గా అందడం లేదు. జిల్లాలోని ఒకరిద్దరు ఉద్యాన శాఖ అధికారులు రికార్డులు తయారు చేయడానికే సరిపోతున్నారు.

జగిత్యాలలో 90 వేల ఎకరాల్లో పంటలు

జగిత్యాల జిల్లాలో దాదాపు 90వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. మామిడి, బత్తాయి, అరటి తోటలను దాదాపు 45 వేల ఎకరాలు, 6 వేల ఎకరాల్లో మిర్చి, టమాట వంటి కూరగాయలు, పసుపు వంటి వాణిజ్య పంటలను దాదాపు 45 వేల ఎకరాల్లో, గులాబీ, బంతి, చామంతి వంటి పూలను 500 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. రాష్ట్రంలోనే పసుపు సాగులో జిల్లా రెండో స్థానంలో ఉంది. ఇతర ఉద్యాన పంటల సాగులో మొదటి నాలుగైదు స్థానాల్లో ఉంటుంది.



చల్‌గల్‌లోని వ్యవసాయ ప్రదర్శన క్షేత్రం



జిల్లాలో సాగు చేసిన బంతి పూల తోట

హామీలన్నీ ఉత్తమాటలే..

వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి ఉద్యాన విశ్వ విద్యాలయాన్ని విడదీయడంతో ఇక్కడ పనిచేసే ఉద్యాన శాస్త్రవేత్తలు నిజమాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన కేంద్రానికి వెళ్లారు. అప్పటినుంచి జిల్లాలో ఒక్క ఉద్యాన శాస్త్రవేత్త కూడా లేకుండాపోయారు. వైఎస్.రాజశేఖర రెడ్డి హయాంలో అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చల్‌గల్‌లోని ప్రదర్శన క్షేత్రంలో ఉద్యాన పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని పట్టుబట్టారు. దీంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలో గల ఉద్యాన విశ్వవిద్యాలయ అధికారులు 2009 ఫిబ్రవరి 6న పరిశీలించి వెళ్లారు. వైఎస్సార్ మరణంతో ఆ ప్రతిపాదనలు ముందుకు కదలలేదు. తర్వాత వచ్చిన కిరణ్‌కుమార్ రెడ్డి హయాంలోనూ ఉత్తర తెలంగాణలోని వ్యవసాయ అధికారులు, రైతులకు శిక్షణ ఇచ్చే కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అది కూడా నెరవేరలేదు.

చల్‌గల్‌లో మామిడి పరిశోధన కేంద్రం

చల్‌గల్‌లో మామిడి మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. ఈ మార్కెట్‌ను ఆనుకుని ఈ స్థలం ఉండటంతో అందులో మామిడి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని గతంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. అదికూడా అమలుకు నోచుకోలేదు. ఇప్పటికే ప్రదర్శన క్షేత్రంలో సపోట, మామిడి వంటి పండ్ల తోటలతోపాటు గులాబీ తోటలు ఉన్నాయి. ఉద్యాన పంటలపై పరిశోధనలకు ఈ ప్రదర్శన క్షేత్రం అనువుగా ఉంటుందని మొన్నటివరకు మంత్రులుగా ఉన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డికి అన్ని పార్టీల నాయకులు విన్నవించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది.

ధారాదత్తం చేస్తుండటంపై ఆందోళన

చల్‌గల్ ప్రదర్శన క్షేత్రంలో 150 ఎకరాల స్థలం ఉంది. ఇందులో ఇప్పటికే 20 ఎకరాలు మామిడి మార్కెట్‌కు, ఐదెకరాలు రైల్వేలైన్, ఆరు ఎకరాలు మార్క్‌ఫెడ్ గోదాంలు, ఎకరం వరకు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఇప్పటికే ఇచ్చారు. మామిడి మార్కెట్‌లో షెడ్లు నిర్మిస్తున్నందున మరో 10 ఎకరాలు కావాలని కోరగా.. గత ప్రభుత్వం మంజూరు చేసినట్లు సమాచారం. ప్రస్తుత నూతన ప్రభుత్వ హయాంలోనైనా ఉద్యాన పరిశోధన కేంద్రం వస్తుందనే ఆశతో జిల్లా రైతులు ఉన్నారు.

పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలి



చల్‌గల్‌లో ఉద్యాన పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలి. జిల్లాను ఆనుకుని ఉన్న నాలుగైదు జిల్లాల్లో పండ్ల తోటలతోపాటు పసుపు పంట ఎక్కువగా ఉన్నందున, ఉద్యాన పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. కనీసం మామిడి పరిశోధన కేంద్రాన్నైనా ఏర్పాటు చేయాలి. – సత్యంరెడ్డి, మల్లాపూర్

పండ్ల తోటలకు నేలలు అనుకూలం



అన్నిరకాల పండ్ల తోటలకు ఇక్కడి నేలలు అనుకూలం. అనుకూలమైన వాతావరణం ఉంటుంది. ఉత్తర తెలంగాణలో పెద్ద మామిడి మార్కెట్ ఉంది. కాబట్టి ఉద్యాన పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు మరింతగా మేలు జరిగే అవకాశం ఉంది. – ప్రతాప్‌సింగ్, జిల్లా ఉద్యాన శాఖాధికారి, జగిత్యాల

ముగిసిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు



బాలిక విభాగంలో విజేతగానిలిచిన ఆదిలాబాద్ టీంకు కప్ అందిస్తున్న పరిమళ



బాలుర విభాగంలో విజేత వరంగల్ టీంకు కప్పు అందిస్తున్న పరిమళ

- బాలికల్లో ఆదిలాబాద్
- బాలురుల్లో వరంగల్ చాంపియన్

భీమారం: స్కూల్స్ గేమ్స్‌ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా భీమారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. బాలికల విభాగంలో ఆదిలాబాద్, బాలుర విభాగంలో వరంగల్ జట్లు చాంపియన్‌గా నిలిచాయి. వారికి జిల్లా స్కూల్ ఫెడరేషన్ కార్యదర్శి పరిమళ, సర్పంచ్ గద్దెరాంరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కార్యదర్శి పరిమిళ మాట్లాడుతూ క్రీడాపోటీల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభని గుర్తించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విక్రమ్, పీఈటీ కొండగర్ల విఠల్ పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దించడమే లక్ష్యం

- ఇండియా కూటమి పార్టీలన్నీ ఏకతాటిపై పని చేయాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి

చిగురుమామిడి: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గద్దె దించడమే లక్ష్యమని, ఇండియా కూటమిలోని పార్టీలన్నీ ఏకతాటిపై పని చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం చిగురుమామిడిలోని ముస్కు రాజిరెడ్డి స్మారక భవనంలో సమావేశం నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని, దేశ సంపదను కార్పొరేట్, పెట్టుబడిదారి వర్గాలకు అప్పగిస్తోందని ఆరోపించారు. ఇప్పటికే కొన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసిందన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీని గద్దె దించేందుకు ఇండియా కూటమి ఏర్పడిందని తెలిపారు. సీపీఐ జాతీయ నాయకత్వం సూచనల మేరకు రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ, కాంగ్రెస్ కలిసి పని చేశాయని పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో సీపీఐ మద్దతుతో కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్ గెలిచారన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు స్వామి, అశోక్,మండల కార్యదర్శి లక్ష్మారెడ్డి, సహాయ కార్యదర్శి అందె చిన్నస్వామి, జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, సదాశివ, పటేల్, రాజయ్య, సర్పంచ్ లుశ్రీమూర్తి రమేశ్, గోలి బాపురెడ్డి తదితరులున్నారు.



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

సన్నిధి

మంచిమాట



అంకిత భావం

అంకము అంటే గుర్తు, ముద్ర. అంకితం అంటే గుర్తు, లేక ముద్ర కలిగినది. తమ పని ఏదైనా ఏ విధంగా గుర్తించబడాలో సూచించే గుర్తును చెప్పటం అంకితం. మన కవులు అందరు తమ కావ్యాలను అంకితం చేశారు. రచన తమది అయినా ఆ రచనను చదివే వారికి మరొకరు మనసులో మెదులుతారు. అది తమ ఇష్టదైవం కావచ్చు. ఆదరించిన రాజో, మిత్రుడో, ఆత్మీయులో కావచ్చు. అది మరెవరి గుర్తింపు కొరకో తాము చేసే కృషి అని చెప్పటం. కావ్య అవతారికలోనే చెప్పటం సంప్రదాయం. ఆదికవి నన్నయ ఈ ఒరవడి ప్రారంభించినట్టు కనపడుతుంది. తన సహాధ్యాయి, రాజు, పోషకుడు అయిన రాజరాజ నరేంద్రుడి కోరిక మీద ఆయనకి అంకితంగా భారతసంహితా రచనా ధురంధురుడయ్యాడు. ఈ అంకితం కారణంగానే తిక్కనామాత్యులవారు అరణ్యపర్వశేషాన్ని స్పృశించలేదని కొందరు సాహిత్యవిమర్శకుల అభిప్రాయం.

నన్నయభట్టు నరాంకితంగా చేసిన దానిలో మిగిలిన భాగాన్ని దైవానికి అంకితం ఇవ్వటం ఇష్టం లేక విరాటపర్వం నుండి ప్రారంభించి ఉంటారని భావన. పైగా ఆయనకి హరిహరనాథుడు స్వప్నంలో కనపడి ఆదేశించాడు కూడా. పోతనామాత్యుల వారి అంకితం కించిత్ ఆశ్చర్యాన్ని కలిగించక మానదు. శివధ్యానం చేస్తున్న పోతనకి శ్రీరామచంద్రుడు దర్శనమిచ్చి కృష్ణకథ ప్రధానంగా ఉన్న భాగవతాన్ని తనకి అంకితంగా రచించమని కోరాడు.

వాగ్గేయకారులు తమ కీర్తనలలో ప్రతిదానిలోనూ తమ ఇష్టదైవం నామాన్ని గాని ఒక ప్రత్యేకమైన పదాన్ని గాని గుర్తుగా పేర్కొంటారు. దానిని ముద్ర అంటారు. కీర్తనలు వేటికి అవి విడిగా ఉంటాయి. కావ్యంలో లాగా అవతారికలో ఒకసారి పేర్కొంటే సరిపోదు కదా! అందుకని ప్రతి కృతిలోనూ ముద్ర తప్పనిసరి. త్యాగరాజ కృతులలో ప్రతి దానిలోనూ త్యాగరాజనుత అనే ముద్ర కనపడుతుంది. శ్యామశాస్త్రివారి కీర్తనలలో శ్యామకృష్ణ అని, ముత్తుస్వామి దీక్షితులవారి కీర్తనలలో గురుగుహ అనే ముద్రలు దర్శనమిస్తాయి. ఆ ముద్ర చూడగానే అది ఎవరి రచన అన్నది తెలిసిపోతుంది. నిజానికి వారు మనకి తేలికగా తెలియటం కోసం పెట్టలేదు ముద్రలని. ఆ ముద్ర తనకి, ఎవరిని గురించి పాడుతున్నారో వారికి గుర్తింపు.

వాచస్పతి మిశ్రుడు తన రచనకు ఏ మాత్రం ఇబ్బంది కలిగించకుండా సహకరించిన, అప్పటివరకు ముఖమైనా చూడని ధర్మపత్ని 'భామతి' పేరుని తన గ్రంథనామంగా ఉంచాడు.

తమకు ఉన్న ప్రేమాభిమానాలను వ్యక్తపరచటానికి రచనాదికాలు చేయలేక పోయినా, తాము చేసిన ఏ ఘనకార్యమైనా అంకితం చేస్తూ ఉంటారు.

అందరు ఏదో ఒక ఘనకార్యం చేసి అంకితం ఇవ్వలేక పోవచ్చు. వారు తమ జీవితాన్నే అంకితం చేయటం మనం గమనించ వచ్చు. ''నా జీవితం నీకే అంకితం..'' అంటూ పాడిన పాటలు ఉదాహరణలు. అంటే, తన అస్తిత్వానికి ఒక గుర్తింపు అవసరం లేదు, అస్తిత్వంతో సహా అంతా సమర్పణమే ఇష్టదైవానికో, ఇష్టమైన వ్యక్తికో.

చివరికి ఈ అంకిత ప్రక్రియ ఏ స్థాయికి చేరింది అంటే, ఆకాశవాణిలో గాని, దృశ్యశ్రవణ ప్రసార మాధ్యమాలలో గాని ఇష్టమైన పాటలని వేయించి, వాటిని అంకితం చేస్తున్నారు. వీరజవానులు తమ జీవితాలను దేశరక్షణకు అంకితం చేస్తారు. కొందరు దైవానికి తమ జీవితాలని అంకితం చేస్తారు.

తన ఉనికి కోసం, గుర్తింపు కోసం తాపత్రయ పడకుండా మరెవరి గుర్తింపుకో నిస్వార్థంగా చేయటం అంకితం.

– డా. ఎన్. అనంతలక్ష్మి

కావ్యాలు, కీర్తనలు మాత్రమే కాదు ఏ సృజనాత్మక సృష్టి అయినా తన గుర్తింపు కోసం కాక ఇతరులకు గుర్తింపు కలగటం కోసం చేసినప్పుడు ఆ ప్రక్రియని అంకితం అంటారు. ఉదాహరణకి నన్నయభట్టు భారతాన్ని ఆంధ్రీకరించాడు. ఆయన పేరుతో పాటు అంకితం పుచ్చుకున్న రాజరాజనరేంద్రుడి పేరు కూడా చరిత్రలో శాశ్వతంగా నిలిచి ఉంటుంది. రాజుగా కన్న ఆంధ్ర మహాభారతాన్ని అంకితం పుచ్చుకున్నవాడిగా గుర్తింపు అధికం. శ్రీనాథ కవిసార్వభౌముడి పేరు నిలిచి ఉన్నంత కాలం వీరారెడ్డి, అవచి తిప్పయ్య శెట్టి, పెదకోమటి వేమారెడ్డి మొదలైన వారందరి పేర్లు శాశ్వతం. రచనలు చేయలేదు కాని, కావ్యాలు అంకితం పుచ్చుకున్నారు కనక, ఆ కావ్యాలు ఆదరించబడినంత కాలం వారి పేరు చిరస్థాయిగా ఉంటుంది.

వాగ్గేయకార వైభవం

అన్నీ రాళ్లే.. కానీ...



సనాతన ధర్మంలో భగవంతుడే గురువుగా కూడా ఉంటాడు. పరమాత్మ కృష్ణుడిగా వచ్చాడు. పరిపూర్ణావతారం. సాందీపని మహర్షి దగ్గర శిష్యరికం చేసాడు. ఆయనకు తెలియదా.. జగద్గురువు!!! పుట్టుకచేత సమస్తం తెలిసున్నవాడు. తన జన్మ, అవతార విశేషాన్ని ఎవరు తెలుసుకుంటారో వారికి పునర్జన్మ లేదన్నాడు. అటువంటి పరమాత్మ శ్రావణ మాసం బహుళ పక్షం అష్టమి తిథినాడు కటిక చీకటిలో వచ్చాడు. దక్షిణాయనం దేవతలందరికీ చీకటి. కృష్ణపక్షం పితృదేవతలందరికీ చీకటి. అంటే – దేవతలతో కలిపి సమస్త ప్రాణులకు ఎప్పుడు చీకటో ఆ చీకటిలో ఆయన ఆవిర్భవించాడు. అలా ఎందుకు?.. అంటే.. అజ్ఞానంలో ఉన్నవాళ్లందరికీ కూడా దేశకాలాలతో సంబంధం లేకుండా ఎప్పటికీ పనికొచ్చే భగవద్గీతను ఉపదేశం చేయడానికి వచ్చిన అవతారం అది. అక్కడినుండి మరో ఆరునెలలు... కృష్ణపక్షంలో అర్ధరాత్రివేళ కృష్ణుడు కరచరణాదులతో వస్తే– మళ్ళీ మాఘమాసం వచ్చేటప్పటికి – ఆ మాసపు బహుళ చతుర్దశి అర్ధరాత్రివేళ కరచరణాదులు లేని శివలింగంగా వచ్చాడు. అది జ్యోతిర్లింగం. అలా వచ్చాడు.

ఆవు ఎక్కడెక్కడో పుట్టలు, గుట్టలు తిరిగి పచ్చిగడ్డితిని వాహినుల్లో ప్రవహించే నీరు తాగి సేదతీరుతూ నెమరువేసుకుని, సాయంత్రానికి పాలగా మార్చుకుంటుంది. దూడవెళ్ళి నోటితో శిరం చప్పరించినంత మాత్రం చేత ఒక్కసారిగా పాలు విడిచిపెట్టేస్తుంది. ఒకసారి అలా విడిచిపెడితే దానిని వెనక్కి తీయడం గోమాతకు సాధ్యం కాదు. అలా గురువుగారూ! మాకోసం మీరిది చెప్పాలి.. అని వెళ్ళి పాదాలు పట్టుకున్నంత మాత్రం చేత ఆవు–దూడలమీద ఎట్లా ప్రేమ చూపించి పాలు విడిచి పెడుతుందో.. అలా తాను కష్టపడి సమకూర్చుకున్న జ్ఞానాన్నంతటినీ గురువు బోధ రూపంలో శిష్యుడికి అనుగ్రహిస్తాడు.

అటువంటి గురుపాదాలపట్ల భక్తి కలిగి ఉండడం... జన్మజన్మాంతర సుకృతం. సర్వసాధారణంగా గురువు విషయంలో – ఆయన కూడా మనలాగే కరచరణాదులతో ఉన్నాడు, ఆయనా మనలాగే సంసారంలో ఉన్నాడు, మనలాగే ప్రవర్తిస్తున్నాడు... అన్న భావన కలుగుతుంది. ఎన్నో గులకరాళ్లలో పూజనీయమైన సాలగ్రామం కూడా కలిసిపోయి ఉంటుంది. అది సాలగ్రామమని తెలియగానే దానిని వేరుచేసి ఎలా పూజ చేస్తామో– అలాగే గురువు కూడా అందరితో కలిసిపోయినట్లు కనబడతాడు. కానీ ఆ గురువు వైభవాన్ని గుర్తించగలిగినవాడు ఎవడో ఆయన గొప్ప శిష్యుడు.

అటువంటి గురి వాగ్గేయకారులందరిలో మనకు చాలా గొప్పగా కనబడుతుంది.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సువార్త

ఆకాశమంత దేవుని ప్రేమ

ఎందుకూ పనికి రాని ఆనాటి సుంకరులకు, పాపులకు బోధిస్తున్నాడంటూ యూదుమత ప్రముఖులైన పరిసయ్యులు, శాస్త్రులు యేసు ప్రభువు మీద అభియోగం మోపారు. సుంకరులంటే తమ పన్నుల వసూలు కోసం రోమా ప్రభుత్వం నియమించుకున్న యూదు ఉద్యోగులు. నిర్ణీతమొత్తాల కన్నా అత్యధికంగా డబ్బు వసూలుచేసే అవినీతిపరులుగా ముద్రపడి సమాజంలో పరువు కోల్పోయిన వాళ్ళు వీళ్ళు. పాపులంటే, ధర్మశాస్త్రాన్ని, యూదుమత బోధకుల ఆజ్ఞల్ని పాటించని, అవి పాటించే తీరికలేని సామాన్యులు, నిరుపేదలు. ఈ రెండు తెగలవారినీ 'పాపులు' అని యూదుమతప్రముఖుల న్నారు. కానీ యేసుప్రభువైతే వారిని ఎంతో కనికరంతో 'తప్పిపోయినవారు' అని మాత్రమే సంబోధించాడు. యేసుప్రభువుకున్న కాపరి తత్వాన్ని, దీనులు, పేదలు, తప్పిపోయినవారిపట్ల ఆయనకున్నప్రేమను ఆవిష్కరించే అద్భుతమైన బైబిల్ భాగం లూకా 15 వ అధ్యాయం.



ఈ అధ్యాయంలో వంద గొర్రెల్లో ఒక గొర్రె తప్పిపోవడం, పది నాణెల్లో ఒక దాన్ని పోగొట్టుకోవడం, ఇద్దరు కొడుకుల్లో ఒకరు దారితప్పడం అన్నది ప్రధానాంశంగా ప్రభువు మూడు ఉపమానాలు వివరిస్తూ తన ప్రేమతత్వాన్ని బయల్పరచాడు.

ఒక కాపరికి వందగొర్రెలున్నాయి. పగలంతా వాటిని అడవిలో మేతకు వదిలి, పొద్దుగుంకే సమయానికి వాటిని తిరిగి సమకూర్చేటపుడు వాటిలో ఒకటి తప్పిపోయినట్టు కాపరి కనుగొన్నాడు. అపుడు కాపరి ఏం చెయ్యాలి? వందలో 99 తిరిగొచ్చాయి కదా, ఒక గొర్రె కోసం పాకులాడటం దేనికి? అనుకున్నా అందులో తప్పేమీ లేదు. కానీ కాపరి హృదయం అందుకు సమ్మతించదు. ఆ ఒక్క గొర్రె దొరికితే ఎంత లాభం? దాన్ని కోల్పోతే ఎంత నష్టం అనే 'లాభనష్టాల వ్యాపారకోణం' కన్నా, ఆ రాత్రికి దాని ఒంటరితనం, భయంతో బిక్క చచ్చిన దాని దీనత్వం, తనను తాను కాపాడుకోలేని ఆ గొర్రె నిస్సహాయత్వం, ప్రాణాపాయకరమైన దాని ప్రమాదభరిత నేపథ్యం, ఇవే కాపరి హృదయాన్ని కలచివేస్తాయి, దాన్ని వెదికి కనుగొనడానికి కాపరిని పురికొల్పుతాయి. కనికరం, కరుణ కలిగిన ఎవరిలోనైనా వ్యాపారకోణం మీద ఈ భావోద్వేగాలదే పై చేయి అవుతుంది.

తప్పిపోయే దాకా కాపరి తోడు వదిలేసిన గొర్రె అదయితే, అది దొరికే దాకా తన ప్రాణాలకు తెగించి మరీ దాన్ని వెదికి కనుగొన్న కాపరి ఆయన. అది తనను వదిలిందన్న కోపం కన్నా, అదెక్కడ ఏ పరిస్థితుల్లో ఉందోనన్న బాధే కాపరిది. అందుకే దాన్ని వెదికి తిరిగి కనుగొన్నపుడు కాపరి దాన్ని తిట్టలేదు, కొట్టలేదు సరికదా దాన్ని తన భుజాల మీద మోసుకొని ఇంటికి తెచ్చి తన స్నేహితులకు, పొరుగు వారికి దాన్ని చూపించి సంతోషించాడని బైబిల్ చెబుతుంది. తప్పిపోయిన వారిని వెదికి, కనుగొని, వారిని తన భుజాల మీద ఎత్తుకొని సంతోషించే దేవుని ప్రేమను వర్ణించే గొప్ప ఉపమానం ఇది. దేవుని అనంతమైన ప్రేమకు ప్రతిరూపంగా యేసుప్రభువు ఈ లోకానికి వచ్చిన అంతరార్థాన్ని వివరించే ఈ ఉపమానం దేవుని భావోద్వేగాలు, మితిలేని ఆయన ప్రేమ, కృప, కరుణ, కనికరాలకు అద్దం పడుతుంది.

– డా. సుభక్త

సినిమా

నిన్నిట్టా సూత్తుంటే..


● నాగార్జున, ఆషికా రంగనాథ్

'నిన్నిట్టా సూత్తుంటే ఎత్తుకెళ్లిపోవాలనిపిస్తుందే పిల్ల.. ఎత్తుకెళ్లిపోవాలనిపిస్తుందే..' అంటూ హీరోయిన్ ఆషికా రంగనాథ్‌ని చూసి పాడేస్తున్నారు హీరో నాగార్జున. విజయ్ బిన్నీ దర్శకత్వంలో నాగార్జున, ఆషికా రంగనాథ్ జంటగా నటిస్తున్న 'నా సామి రంగ' చిత్రంలోని పాట ఇది. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతికి విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా 'ఎత్తుకెళ్లిపోవాలనిపిస్తుందే పిల్ల...' అంటూ సాగే తొలి పాటని విడుదల చేశారు మేకర్స్. ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించగా, రామ్ మిరియాల పాడారు. ''మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రం 'నా సామి రంగ'. ఈ సినిమాలో నాగార్జున ఫుల్ మాస్ లుక్‌లో కనిపించనున్నారు. 'ఎత్తుకెళ్లిపోవాలనిపిస్తుందే పిల్ల..' పాటలో నాగార్జున, ఆషిక కెమిస్ట్రీ అందర్నీ ఆకట్టుకుంటుంది. నాగార్జున హ్యాండ్సమ్ లుక్స్, ఆషిక ట్రెడిషనల్ గెటప్ ఆకట్టుకుంటాయి. ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. సంక్రాంతికి విడుదల కానున్న మా సినిమా కుటుంబంతో కలిసి చూసేలా ఉంటుంది'' అని మేకర్స్ పేర్కొన్నారు.

స్టైలిష్ డెవిల్


● కల్యాణ్ రామ్

కల్యాణ్ రామ్ టైటిల్ రోల్‌లో రూపొందిన తాజా చిత్రం 'డెవిల్'. అభిషేక్ పిక్చర్స్‌పై అభిషేక్ నామా స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం ఇది. ఈ నెల 29న ఈ పీరియాడికల్ డ్రామాని విడుదల చేయనున్నారు. బ్రిటిష్‌వారు భారతదేశాన్ని పరిపాలించిన కాలానికి సంబంధించిన కథ ఇది. ఈ చిత్రంలో కల్యాణ్ రామ్ భారతీయుడు అయినప్పటికీ బ్రిటిష్ గూఢచారి డెవిల్ పాత్రలో కనిపించనున్నారు. భారతీయత ఉట్టిపడటంతో పాటు స్టైలిష్ గూఢచారిగా చూపించేందుకు కాస్ట్యూమ్ డిజైనర్ రాజేశ్‌తో 90 కాస్ట్యూమ్స్ తయారు చేయించారు అభిషేక్ నామా. ఈ దుస్తుల గురించి కాస్ట్యూమ్ డిజైనర్ రాజేశ్ మాట్లాడుతూ– ''హీరో లుక్ కొత్తగా ఉండేలా ట్రై చేశాం. ధోతి, పైన ఒక వెయిస్ట్ కోటుతో ఆయన కాస్ట్యూమ్స్‌లో భారతీయత కనిపించేలా జాగ్రత్తలు తీసుకున్నాం. ఇటలీ నుంచి తెప్పించిన మోహైర్ ఊల్‌తో 60 బ్లేజర్స్, దేశీ కాటన్‌తో కుర్తాలు, ధోతీలు తయారు చేశాం. 25 వెయిస్ట్ కోట్స్ కుట్టాం. బ్లేజర్ జేబు పక్కన వేలాడుతూ ఉండేలా ఓ హ్యాంగింగ్ వాచ్‌ను ప్రత్యేకంగా తయారు చేయించాం'' అన్నారు.

సరదా.. సరదాగా...


● వెంకటేశ్, సారా, శ్రద్ధా శ్రీనాథ్

హీరో వెంకటేశ్ నటిస్తున్న 75వ చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా, నవాజుద్దీన్ సిద్దిఖీ, ఆర్య, బేబీ సారా, జయప్రకాశ్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న 'సైంధవ్' సంక్రాంతి కానుకగా జనవరి 13న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. సంతోష్ నారాయణన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'సరదా.. సరదాగా...' అంటూ సాగే రెండో పాటని నేడు విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించి, కొత్త పోస్టర్‌ని విడుదల చేసింది. వెంకటేశ్, శ్రద్ధా శ్రీనాథ్, బేబీ సారా కలిసి సరదాగా సముద్రపు ఒడ్డున చిరునవ్వులు చిందిస్తూ నడుస్తున్న పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'సైంధవ్'. ఈ చిత్రం నుంచి ఇటీవల విడుదల చేసిన 'రాంగ్ యూసేజ్..' అనే తొలి పాటకి మంచి స్పందన వస్తోంది. 'సరదా.. సరదాగా...' పాట కూడా అద్భుతంగా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: యస్. మణికందన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. వెంకటరత్నం (వెంకట్), సహనిర్మాత: కిశోర్ తాళ్లూరు.

ఏపీలో చిత్రపరిశ్రమ అభివృద్ధి కావాలి

ఏపీ చలనచిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు ఏయం రత్నం



● మోహన్ గౌడ్, ఏయం రత్నం, విజయ్ వర్మ

ఆంధ్రప్రదేశ్ చలన చిత్ర వాణిజ్య మండలి నూతన అధ్యక్షుడిగా నిర్మాత ఏయం రత్నం ఎన్నికయ్యారు. ఆదివారం 5వ వార్షిక సర్వసభ్య సమావేశం, 2023–25 సంవత్సరాలకు నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమం విజయవాడలో జరిగాయి. నూతన అధ్యక్షుడిగా ఏయం రత్నం, ఉపాధ్యక్షులుగా పి. విజయ్ వర్మ, సీహెచ్. లక్ష్మీ నరసింహం, మంతా శ్రీనివాస్, కార్యదర్శిగా జేవీ మోహన్ గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా పి. రమణా రెడ్డి, యస్.యస్. మూర్తి, కోశాధికారిగా యం. శ్రీనాథరావు, కార్యవర్గ సభ్యులుగా నిర్మాతల విభాగం నుంచి పీడీఆర్. ప్రసాద్ రెడ్డి, వీవీ రామానుజం, మిత్తాన ఈశ్వర రావు, యు. వెంకట్ రావు, రవీంద్ర గోపాల, పంపిణీదారుల విభాగం నుంచి కె. రవీంద్ర నాథ్ ఠాగూర్ బాబు, ఆర్.వి.యస్. వరప్రసాద్, మిర్జా అబీద్ హుస్సేన్, స్టూడియో విభాగం నుంచి బి. హనుమంతరావు ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏయం రత్నం మాట్లాడుతూ– ''ఏపీలో కూడా చిత్ర పరిశ్రమను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ఉందని భావించి, అధ్యక్షుడిగా వ్యవహరించడానికి అంగీకరించాను'' అన్నారు.

జేడీ చక్రవర్తి, శ్రీకాంత్ హీరోలుగా నటించిన చిత్రం 'వన్ బై టు'. శివ నాగేశ్వర రావు దర్శకత్వంలో తమ్మారెడ్డి భరద్వాజ నిర్మించిన ఈ సినిమా 1994 డిసెంబరు 10న విడుదలైంది. ఈ చిత్రం రిలీజై ముప్పై ఏళ్లు అయిన సందర్భంగా ఆదివారం 'థర్టీ ఇయర్స్ ఆఫ్ వన్ బై టు' పేరుతో హైదరాబాద్‌లో రీ యూనియన్ కార్యక్రమాన్ని నిర్వహించింది చిత్ర యూనిట్. తమ్మారెడ్డి భరద్వాజ, శివ నాగేశ్వర రావు, జేడీ చక్రవర్తి , శ్రీకాంత్, కెమెరామేన్ బాబు, నటులు భిక్షు, చిట్టి తదితరులు పాల్గొని, ముప్పై ఏళ్ల నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.



స్నేహానికి హద్దు లేదురా


● ఆశిష్ గాంధీ

ఆశిష్ గాంధీ, అశోక్, వర్ష, హ్రితిక హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'హద్దు లేదురా..'. రాజశేఖర్ రావి దర్శకత్వంలో వీరేష్ గాజుల బళ్లారి నిర్మించారు. ఈ మూవీ టైటిల్, ఫస్ట్ లుక్‌ని దర్శకుడు క్రిష్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''హద్దు లేదురా..' టైటిల్ బాగుంది. ఫస్ట్ లుక్, సినిమా థీమ్ వైవిధ్యంగా ఉన్నాయి. సినిమా హిట్ అవ్వాలి'' అన్నారు. ''అలనాటి కృష్ణార్జునులు స్నేహితులు అయితే ఎలా ఉంటారో తెలిపే కథ, కథనంతో 'హద్దు లేదురా..' రూపొందింది. ఫైట్స్, పాటలు, సెకండ్ హాఫ్‌లో వచ్చే ట్విస్టులు, క్లైమాక్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అన్నారు రాజశేఖర్ రావి. ''జనవరిలో మా సినిమాను విడుదల చేస్తాం'' అన్నారు గాజుల వీరేశ్. ''స్నేహం నేపథ్యంలో రూపొందిన 'హద్దు లేదురా..' మా యూనిట్‌కి మంచి పేరు తీసుకొస్తుంది'' అన్నారు ఆశిష్ గాంధీ. తనికెళ్ల భరణి, రాజీవ్ కనకాల ఇతర పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సహ నిర్మాత: రావి మోహన్ రావు.

రెండు వారాల గ్యాప్‌లో రెండు హిట్లు – మాటల రచయిత నాగేంద్ర కాశీ



''నేను మాటలు అందించిన 'కోట బొమ్మాళి' (నవంబర్ 24), 'హాయ్ నాన్న' (డిసెంబరు 7) చిత్రాలు రెండు వారాల గ్యాప్‌లో విడుదలై సక్సెస్ అవడం సంతోషంగా ఉంది. 'కోట బొమ్మాళి' పొలిటికల్ థ్రిల్లర్. 'హాయ్ నాన్న' ఎమోషన్స్‌తో కూడిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. రెండు విభిన్నమైన కథలకు మాటలు అందించిన నాకు మంచి పేరొచ్చింది. నిర్మాతలు అల్లు అరవింద్, బన్నీ వాసు, డైరెక్టర్ సుకుమార్ గార్లు ప్రత్యేకంగా అభినందించడం మరచిపోలేను'' అన్నారు మాటల రచయిత నాగేంద్ర కాశీ. ఇంకా తన కెరీర్ గురించి నాగేంద్ర మాట్లాడుతూ– ''నాది కోనసీమ జిల్లా అమలాపురం. నాన్న నాగేశ్వరరావు, అమ్మ సత్యవతి. రచన, సాహిత్యంపై ఇష్టంతో ఇంటర్ చదివే రోజుల నుంచే కథలు రాయడం మొదలుపెట్టాను. నేను రాసిన కథలతో 'నల్ల వంతెన' అనే తొలి పుస్తకం పబ్లిష్ చేశాను. దీనికి నాలుగు అవార్డులు వచ్చాయి. తొలిసారి 'పలాస 1978' సినిమాకి కో రైటర్‌గా పని చేశా. ఆ తర్వాత 'తోలు బొమ్మలాట' మూవీకి రచనా సహకారం చేశాను. 'శ్రీదేవి సోడా సెంటర్' సినిమాకి కథ ఇచ్చాను. నా 'నల్ల వంతెన'లో ఓ కథ నచ్చడంతో నాకు 'సుకుమార్ రైటింగ్స్‌లో' చాన్స్ ఇచ్చారు డైరెక్టర్ సుకుమార్‌గారు. 'విరూపాక్ష'కి రైటింగ్ విభాగంలో చేశా. ఆ తర్వాత రామ్‌చరణ్– బుచ్చిబాబుగార్ల మూవీకి బుచ్చిబాబుగారితో కలిసి మాటలు రాస్తున్నాను. 'పుష్ప 2' సినిమాకి రచయితల విభాగంలో చేస్తున్నాను. అలాగే రష్మిక నటిస్తున్న 'రెయిన్‌బో'కి మాటలు అందిస్తున్నాను. సుకుమార్‌గారి వద్ద పని చేసే చాన్స్ రావడం నా లక్. భవిష్యత్తులో డైరెక్టర్ కావాలని ఉంది. ఐదు కథలు సిద్ధం చేసుకున్నాను'' అన్నారు.

ఈ కథలో...


● ఫణి రాజ్, క్రిష్

హోమానంద్, రేవంత్ హీరోలుగా, సిమ్రాన్ పరింజా హీరోయిన్‌గా నటించిన చిత్రం 'ఈ కథలో నేను'. ఎమ్మెస్ ఫణి రాజ్ దర్శకత్వంలో ఎం. అచ్చిబాబు సమర్పణలో టి. కేశవ తీర్థ నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ని డైరెక్టర్ క్రిష్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''ఈ చిత్రం నేటి ట్రెండ్‌కి, ఇప్పటి యూత్‌కి సరిపోయేలా ఉంటుంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలి'' అన్నారు. ఎమ్మెస్ ఫణిరాజ్ మాట్లాడుతూ– ''లవ్ అండ్ లస్ట్ నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. 'సిరివెన్నెల' సీతారామశాస్త్రిగారితో పాటలు రాయించుకునే అదృష్టం మా సినిమాకి, నాకు దక్కింది. ఆయన తనయుడు యోగి శ్రీ మంచి సంగీతం అందించారు'' అన్నారు. ''ఫణిగారు ఓ మంచి చిత్రాన్ని మాకు ఇచ్చినందుకు హ్యాపీగా ఉంది'' అన్నారు అచ్చిబాబు. ఈ చిత్రానికి కెమెరా: మల్హర్ భట్ జోషి.

నవ్వుల నమో


● విశ్వంత్, విస్మయ శ్రీ, అనురూప్

విశ్వంత్ దుద్దుంపూడి, అనురూప్ కటారి హీరోలుగా, విస్మయ శ్రీ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'నమో'. ఈ చిత్రం ద్వారా ఆదిత్య రెడ్డి కుందూరు దర్శకునిగా పరిచయమవుతున్నారు. ఎ. ప్రశాంత్ నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ మూవీ ఫస్ట్ లుక్‌ను దర్శకుడు భీమనేని శ్రీనివాసరావు విడుదల చేసి, మాట్లాడుతూ– ''ఆదిత్య నా దగ్గర అసిస్టెంట్‌గా చేశాడు. ఏదో చేయాలనే, నేర్చుకోవాలనే తపన తనలో ఉంది. 'నమో' పేరు వినగానే ప్రధాని నరేంద్ర మోదీగారి మీద కథ అనుకున్నాను. హీరోల పాత్రల పేర్లలోని (నగేశ్, మోహన్) తొలి అక్షరాలతో టైటిల్ పెట్టినట్లు చెప్పాడు. ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''నమో' ప్రేక్షకులు హాయిగా నవ్వుకునేలా ఉంటుంది'' అన్నారు ఆదిత్య రెడ్డి కుందూరు. ''ఇదొక వైవిధ్యమైన చిత్రం'' అన్నారు విశ్వంత్ దుద్దుంపూడి, అనురూప్ కటారి, విస్మయ.



తొమ్మిదో స్థానంతో భారత్ ముగింపు... 'షూటౌట్'లో అమెరికాపై విజయం

జూనియర్ మహిళల ప్రపంచకప్ హాకీ టోర్నీలో భారత జట్టుకు తొమ్మిదో స్థానం దక్కింది. చిలీ ఆతిథ్యమిచ్చిన ఈ టోర్నీలో 9-10 స్థానాల కోసం జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో భారత్ 'షూటౌట్'లో 3-2 గోల్స్ తేడాతో అమెరికా జట్టును ఓడించింది. నిర్ణీత 60 నిమిషాలు ముగిశాక భారత్, అమెరికా జట్లు 2-2తో సమంగా నిలిచాయి. భారత్ తరఫున మంజు (11వ ని.లో), సునెలితా (57వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... అమెరికా జట్టుకు కిర్‌స్టెన్ థామసె (27వ, 53వ ని.లో) రెండు గోల్స్ అందించింది. 'షూటౌట్'లో మొదటి ఐదు షాట్‌లు ముగిశాక కూడా రెండు జట్లు 2-2తో సమంగా నిలిచాయి. భారత్ తరఫున ముంతాజ్, రుతుజా గోల్స్ చేయగా... ప్రీతి, సాక్షి, అన్ను విఫలమయ్యారు. అమెరికా జట్టు తరఫున అబిగెయిల్, లారెన్ వడాస్, అండర్‌వుడ్ కొట్టిన షాట్‌లను భారత గోల్‌కీపర్ మాధురి నిలువరించగా... కేటీ డిక్సన్, ఒలివియా గోల్స్ చేశారు. 'సడెన్‌డెత్'లో లారెన్ వడాస్ షాట్‌ను మాధురి అడ్డుకోగా... అనంతరం రుతుజా గోల్‌తో భారత విజయం ఖరారైంది.

అశ్విని-తనీషా జోడీకి మహిళల డబుల్స్ టైటిల్



గువాహటి: ఆద్యంతం నిలకడగా రాణించిన అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో (భారత్) జోడీ ఈ ఏడాది మూడో డబుల్స్ టైటిల్‌ను సాధించింది. ఆదివారం ముగిసిన గువాహటి మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-100 బ్యాడ్మింటన్ టోర్నీలో అశ్విని-తనీషా ద్వయం విజేతగా నిలిచింది. 40 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో అశ్విని-తనీషా జోడీ 21-13, 21-19తో సుంగ్ షువో యున్-యు చియెన్ హుయ్ (చైనీస్ తైపీ) జంటను ఓడించింది. విజేతగా నిలిచిన అశ్విని-తనీషా జోడీకి 7,900 డాలర్ల (రూ. 6 లక్షల 58 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 5,500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ఏడాది అశ్విని-తనీషా ద్వయం అబుదాబి మాస్టర్స్, నాంటెస్ ఇంటర్నేషనల్ చాలెంజ్ టోర్నీల్లోనూ టైటిల్స్ గెలిచింది.

జ్యోతి సురేఖకు రజతం



తావోయువాన్ సిటీ (చైనీస్ తైపీ): వరల్డ్ ఇండోర్ ఆర్చరీ సిరీస్‌లో భాగంగా జరిగిన తైపీ ఓపెన్ టోర్నీలో మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు స్వర్ణ, రజత పతకాలు లభించాయి. ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ రజత పతకం సాధించగా... భారత్‌కే చెందిన పర్ణీత్ కౌర్ పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. ఫైనల్లో జ్యోతి సురేఖ 145-146తో పర్ణీత్ కౌర్ చేతిలో ఓడిపోయింది. పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత ఆర్చర్ ప్రథమేశ్ స్వర్ణ పతకం నెగ్గాడు. ఫైనల్లో ప్రథమేశ్ 149-148తో మైక్ ష్లొసెర్ (నెదర్లాండ్స్)ను ఓడించాడు.

తొలి మ్యాచ్ వర్షార్పణం



భారత్-దక్షిణాఫ్రికా తొలి టి20 రద్దు

డర్బన్: దక్షిణాఫ్రికా పర్యటనలో భారత్‌కు వర్షం ఎదురైంది. సఫారీలో కఠిన సవాలు ఎదురవుతుందనుకుంటే ఎడతెరిపిలేని వర్షంతో తొలి టి20 మ్యాచ్ రద్దయ్యింది. అదేపనిగా వాన కురవడంతో పిచ్‌పై కప్పి ఉంచిన కవర్స్‌ను తీయాల్సిన అవసరమే రాలేదు. కాస్త ఆలస్యంగానైనా మ్యాచ్‌ను ఆస్వాదించవచ్చని ఎదురుచూస్తూ మైదానంలో గొడుగుల కిందే గడిపిన క్రికెట్ ప్రియుల ఆశలపై నీళ్లు పడ్డాయి. ఆగని వాన వల్ల కనీసం టాస్ కూడా వేసే అవకాశం లేకపోయింది. దీంతో మైదానంలో ఆడాల్సిన ఇరుజట్ల ఆటగాళ్లు... డ్రెస్సింగ్ రూమ్‌లలో సగటు ప్రేక్షకుల్లానే మిగిలిపోయారు. వాతావరణ పరిస్థితిని సమీక్షించిన ఫీల్డ్ అంపైర్లు బొంగని జెలె, స్టీఫెన్ హారిస్ రెండు గంటల అనంతరం ఓ నిర్ణయానికి వచ్చారు. వాన ఇంకా కొనసాగడం, అవుట్ ఫీల్డ్ అంతా చిత్తడిగా ఉండటంతో ఇక మ్యాచ్ నిర్వహించేందుకు అవకాశం లేదని, ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో మెరుపులు చూడాలనుకున్న అభిమానులంతా చినుకులతో విసిగి నిరాశగా వెనుదిరిగారు. మంగళవారం పోర్ట్ ఎలిజబెత్‌లో భారత్, దక్షిణాఫ్రికాల మధ్య రెండో టి20 మ్యాచ్ జరుగుతుంది.

హర్మన్‌ప్రీత్ బృందానికి ఊరట

- ఇంగ్లండ్‌తో ఆఖరి టి20 మ్యాచ్‌లో ఐదు వికెట్లతో నెగ్గిన భారత్
- రాణించిన శ్రేయాంక, సైకా, స్మృతి



ముంబై: వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయి... ఇంగ్లండ్ జట్టుకు సిరీస్‌ను అప్పగించేసిన తర్వాత భారత మహిళల క్రికెట్ జట్టు తేరుకుంది. ఆదివారం జరిగిన చివరిదైన మూడో టి20 మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా ఐదు వికెట్ల తేడాతో గెలిచి పరువు నిలబెట్టుకుంది. దాంతో మూడో మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని ఆశించిన హీతెర్ నైట్ నాయకత్వంలోని ఇంగ్లండ్ తుదకు సిరీస్‌ను 2-1తో సొంతం చేసుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ సరిగ్గా 20 ఓవర్లలో 126 పరుగుల వద్ద ఆలౌటైంది. కెప్టెన్ హీతెర్ నైట్ (42 బంతుల్లో 52; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించగా, అమీ జోన్స్ (21 బంతుల్లో 25; 3 ఫోర్లు) మెరుగ్గా ఆడింది. ఇంగ్లండ్ 76 పరుగులకు 8 వికెట్లు కోల్పోయిన దశలో హీతెర్ నైట్, చార్లీ డీన్ (15 బంతుల్లో 16 నాటౌట్; 1 ఫోర్) తొమ్మిదో వికెట్‌కు 50 పరుగులు జోడించి ఆదుకున్నారు. ఇన్నింగ్స్ చివరి రెండు బంతుల్లో హీతెర్, మహికా గౌర్ (0) అవుటవ్వడంతో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగిసింది. భారత స్పిన్నర్లు సైకా ఇషాక్ (3/22), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శ్రేయాంక పాటిల్ (3/19) ఇంగ్లండ్ జట్టును దెబ్బ కొట్టారు. సీమర్లు రేణుక సింగ్, అమన్‌జోత్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన భారత్ మహిళల జట్టు 19 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 130 పరుగులు చేసి గెలిచింది. ఆరంభంలోనే షఫాలీ వర్మ (6) నిష్క్రమించినా... ఓపెనర్ స్మృతి మంధాన (48 బంతుల్లో 48; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), జెమీమా (33 బంతుల్లో 29; 4 ఫోర్లు) రెండో వికెట్‌కు 57 పరుగులు జోడించారు. అనంతరం విజయానికి చేరువైన తరుణంలో దీప్తి శర్మ (12), స్మృతి, రిచా ఘోష్ (2) స్వల్పవ్యవధిలో నిష్క్రమించారు. ఉత్కంఠకు దారితీస్తున్న దశలో అమన్‌జోత్ (4 బంతుల్లో 13 నాటౌట్; 3 ఫోర్లు) 19వ ఓవర్లో 3 బౌండరీలు కొట్టి భారత్‌ను గెలిపించింది. ఇంగ్లండ్ ప్లేయర్ నాట్ సివర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు లభించింది. ఇరు జట్ల మధ్య ఏకైక టెస్టు మ్యాచ్ 14 నుంచి డీవై పాటిల్ స్టేడియంలో జరుగుతుంది.



సిరీస్ ట్రోఫీతో హీతెర్ నైట్

భారత జట్టుకు నిరాశ

సెంచరీతో పాక్‌ను గెలిపించిన అజాన్



అజాన్

దుబాయ్: ఆసియా కప్ అండర్-19 క్రికెట్ టోర్నీలో భారత జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. ఆదివారం జరిగిన గ్రూప్ 'ఎ' రెండో లీగ్ మ్యాచ్‌లో పాకిస్తాన్ ఎనిమిది వికెట్ల తేడాతో భారత్‌పై విజయం సాధించింది. ముందుగా భారత్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 259 పరుగులు చేసింది. ఆదర్శ్ సింగ్ (62; 4 ఫోర్లు, 1 సిక్స్), ఉదయ్ (60; 5 ఫోర్లు), సచిన్ (58; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు. అనంతరం పాకిస్తాన్ 47 ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి 263 పరుగులు చేసి గెలిచింది. అజాన్ అవైస్ (105 నాటౌట్; 10 ఫోర్లు) అజేయ సెంచరీతో పాక్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. షాజైబ్ ఖాన్ (63; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), సాద్ బేగ్ (68 నాటౌట్; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో ఆకట్టుకున్నారు. భారత జట్టు సెమీఫైనల్ చేరాలంటే మంగళవారం నేపాల్‌తో జరిగే మ్యాచ్‌లో తప్పనిసరిగా గెలవాలి.

వారియర్స్ విక్టరీ



బెంగళూరు: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో బెంగాల్ వారియర్స్ రెండో విజయం సాధించింది. తమిళ్ తలైవాస్ జట్టుతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 48-38 పాయింట్ల తేడాతో గెలిచింది. కెప్టెన్ మణీందర్ సింగ్ అత్యధికంగా 16 పాయింట్లు స్కోరు చేసి వారియర్స్ విక్టరీలో కీలకపాత్ర పోషించాడు. తమిళ్ తలైవాస్ తరఫున నరేందర్ 13 పాయింట్లు సాధించాడు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 35-33తో దబంగ్ ఢిల్లీ జట్టును ఓడించింది.

ప్రొ కబడ్డీ లీగ్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
గుజరాత్ జెయింట్స్	4	3	1	0	16
బెంగాల్ వారియర్స్	3	2	0	1	13
యూపీ యోధాస్	3	2	1	0	11
పట్నా పైరేట్స్	2	2	0	0	10
పుణేరి పల్టన్	2	2	0	0	10
హరియాణా స్టీలర్స్	3	2	1	0	10
దబంగ్ ఢిల్లీ	3	1	2	0	6
యు ముంబా	3	1	2	0	6
తమిళ్ తలైవాస్	2	1	1	0	5
జైపూర్ పింక్ పాంథర్స్	2	0	1	1	4
బెంగళూరు బుల్స్	4	0	4	0	4
తెలుగు టైటాన్స్	3	0	3	0	1

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

రన్నరప్ ఆదర్శ్



సాక్షి, హైదరాబాద్: జాతీయ అండర్-13 చెస్ చాంపియన్‌షిప్ ఓపెన్ విభాగంలో తెలంగాణ కుర్రాడు ఉప్పల ఆదర్శ్ శ్రీరామ్ రన్నరప్‌గా నిలిచాడు. సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో నిర్ణీత 11 రౌండ్ల తర్వాత వీరేశ్ శరణార్థి (మహారాష్ట్ర), ఆదర్శ్ శ్రీరామ్ 9.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించారు. వీరేశ్ విజేతగా అవతరించాడు. ఆదర్శ్ శ్రీరామ్ రన్నరప్‌గా నిలిచాడు. తమిళనాడుకు చెందిన రాఘవ్ తొమ్మిది పాయింట్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. బాలికల విభాగంలో మహారాష్ట్రకు చెందిన శ్రేయ విజేతగా నిలిచింది. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత శ్రేయ 9.5 పాయింట్లతో టాప్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నైనా గొర్లి ఏడో స్థానాన్ని పొందింది. తెలంగాణకు చెందిన కీర్తిక ఎనిమిదో స్థానంలో, దీక్షిత పదో స్థానంలో, శివాంశిక 12వ స్థానంలో నిలిచారు.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

డీఎంహెచ్‌వో, నెల్లూరులో 33 పారామెడికల్ పోస్టులు

నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలలో ఒప్పంద/ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పారామెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 33
» **పోస్టుల వివరాలు:** ఓటీ టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, క్యాథ్ ల్యాబ్ టెక్నీషియన్, అనెస్తీషియా టెక్నీషియన్, క్లినికల్ సైకాలజిస్ట్, బయో మెడికల్ టెక్నీషియన్, ఓటీ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** విద్యార్హత మార్కులు, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రిన్సిపాల్ కార్యాలయం, ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కార్యాలయం, నెల్లూరు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 11.12.2023.
» **వెబ్‌సైట్:** spsnellore.ap.gov.in

పాడేరు జీజీహెచ్‌లో 256 పారామెడికల్ పోస్టులు

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలలో..ఒప్పంద/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పారామెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 256
» **పోస్టుల వివరాలు:** రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్, స్టోర్ కీపర్, అనెస్తీషియా టెక్నీషియన్, ఆడియో విజువల్ టెక్నీషియన్, ఆడియోమెట్రీ టెక్నీషియన్, బయోమెడికల్ టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, చైల్డ్ సైకాలజిస్ట్, క్లినికల్ సైకాలజిస్ట్, కంప్యూటర్ ప్రోగ్రామర్, డెంటల్ టెక్నీషియన్, తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఎస్ఎస్‌సీ, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ డిప్లొమా, ఎంఫిల్, పీహెచ్‌డీఎంహెచ్‌వో తదితర కోర్సుల్లో ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** విద్యార్హత మార్కులు, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రిన్సిపాల్ కార్యాలయం, ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కార్యాలయం, పాడేరు, అల్లూరి సీతారామరాజు జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 11.12.2023.
» **వెబ్‌సైట్:** allurisitharamaraju.ap.gov.in

విజయనగరం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో 23 పోస్టులు

విజయనగరం జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 23
» **పోస్టులు:** డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ కమ్ డేటా ఎంట్రీ ఆపరేటర్, కుక్, హెల్పర్ కమ్ నైట్ వాచ్‌మెన్, హౌస్ కీపర్, ఎడ్యుకేటర్, స్టోర్ కీపర్ కమ్ అకౌంటెంట్, పిటి ఇన్‌స్ట్రక్టర్ కమ్ యోగా టీచర్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తును జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, కలెక్టర్ కాంప్లెక్స్, విజయనగరం, విజయనగరం జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 11.12.2023.
» **వెబ్‌సైట్:** vizianagaram.ap.gov.in

జేఎన్‌టీయూ అనంతపురంలో పీహెచ్‌డీ ప్రవేశాలు

అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ).. పీహెచ్‌డీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్, మేనేజ్‌మెంట్, బయోటెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ సైన్సెస్, ఇంగ్లిష్, ఫుడ్ టెక్నాలజీ.
» **అర్హత:** సంబంధిత విభాగంలో 55శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఐదేళ్ల పని అనుభవం ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తును డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూ అనంతపురం, అనంతపురం చిరునామకు స్పీడ్ పోస్టు/కొరియర్ ద్వారా పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 16.12.2023.
» **వెబ్‌సైట్:** www.jntua.ac.in

కానిస్టేబుల్ కొలువుల పిలుపు

» సాయుధ దళాల్లో 26 వేలకు పైగా కానిస్టేబుల్ పోస్టులు
» దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించిన స్టాఫ్ సెలక్షన్ కమిషన్
» కొలువు సొంతమైతే పే లెవల్-3తో ప్రారంభ వేతనం
» పదో తరగతి ఉత్తీర్ణతతో పోటీ పడే అవకాశం

పదో తరగతి అర్హతతోనే యూనిఫామ్ సర్వీసులో చేరే అవకాశం స్వాగతం పలుకుతోంది! ఈ కొలువుతో ఆకర్షణీయ వేతనం, సమాజంలో గౌరవంతో పాటు దేశ భద్రతలో పాల్పంచుకునే అవకాశం లభిస్తుంది! స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) కేంద్ర సాయుధ దళాల్లో జనరల్ డ్యూటీ విభాగంలో 26వేలకు పైగా కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది! ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ కానిస్టేబుల్ (జీడీ) నోటిఫికేషన్ వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..



ఎస్ఎస్‌సీ జాబ్స్

మొత్తం పోస్టులు 26,146

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం- కేంద్ర హోంశాఖ పరిధిలోని ఏడు దళాల్లో మొత్తం 26,164 కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేయనుంది. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్-6,174 పోస్టులు, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్-11,025 పోస్టులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్-3,337 పోస్టులు, సశస్త్ర సీమాబల్-635 పోస్టులు, ఇండో-టిబెటిన్ బోర్డర్ పోలీస్ 3,189 పోస్టులు, అస్సాం రైఫిల్స్(రైఫిల్‌మెన్)-1,490 పోస్టులు, సెక్రటేరియట్ సెక్యూరిటీ ఫోర్స్-296 పోస్టులు. అస్సాం రైఫిల్స్ విభాగంలో రైఫిల్ మెన్ హోదాలో పోస్టులు ఉన్నాయి. మహిళా అభ్యర్థులకు మొత్తం పోస్టులలో 2,799 పోస్టులను కేటాయించారు.

అర్హతలు

- 2024 జనవరి 1 నాటికి పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** 2024 జనవరి 1 నాటికి 18-23 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు ఇస్తారు.

పే లెవల్-3 వేతనం

తుది నియామకాలు ఖరారు చేసుకుని జనరల్ డ్యూటీ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన వారికి ప్రారంభంలోనే పే లెవల్-3తో వేతనం అందిస్తారు. అంటే నెలకు రూ.21,700-రూ. 69,100తో నెల వేతన శ్రేణి అందుకోవచ్చు.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ) పోస్టులకు సంబంధించి మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. అవి..రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్. ఈ మూడు దశల తర్వాత డిటెయిల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్, రివ్యూ మెడికల్ ఎగ్జామినేషన్‌లను కూడా నిర్వహిస్తారు.

160 మార్కులకు రాత పరీక్ష

కానిస్టేబుల్ పోస్టుల ఎంపిక ప్రక్రియలో తొలి దశ రాత పరీక్షను నాలుగు విభాగాల్లో 160 మార్కులకు నిర్వహిస్తారు. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 20 ప్రశ్నలు-40 మార్కులు, జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ 20 ప్రశ్నలు-40 మార్కులు, ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్ 20 ప్రశ్నలు-40 మార్కులు, ఇంగ్లిష్/హిందీ 20 ప్రశ్నలు-40 మార్కులకు చొప్పున మొత్తం 80 ప్రశ్నలు-160 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం ఒక గంట. పరీక్ష పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా ఉంటుంది. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు కేటాయించారు. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కు తగ్గిస్తారు.

ప్రాంతీయ భాషల్లోనూ పరీక్ష

ఎస్ఎస్‌సీ కానిస్టేబుల్ (జీడీ) పరీక్షను హిందీ, ఇంగ్లిష్‌తోపాటు 13 ప్రాంతీయ భాషల్లో (అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, కొంకణి, మళయాళం, మణిపురి, మరాఠి, ఒడియా, పంజాబీ, తమిళం, తెలుగు, ఉర్దూ) నిర్వహిస్తారు.

పీఎస్‌టీ/పీఈటీ

- తొలిదశ రాత పరీక్ష తర్వాత అభ్యర్థులకు ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ (పీఎస్‌టీ), ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ (పీఈటీ)లను నిర్వహిస్తారు. ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌కు అర్హత పొందాలంటే..రాత పరీక్షలో కనీస అర్హత మార్కులు పొందాలి. జనరల్ కేటగిరీ అభ్యర్థులు 30 శాతం మార్కులు; ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులు 25 శాతం మార్కులు, ఇతర రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 20 శాతం మార్కులు పొందాలి.
- పీఈటీ: ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు, ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహిస్తారు. పురుష అభ్యర్థులు అయిదు కిలో మీటర్లను 24 నిమిషాల్లో, మహిళా అభ్యర్థులు 1.6 కిలో మీటర్ల దూరాన్ని ఎనిమిదిన్నర నిమిషాల్లో చేరుకోవాల్సి ఉంటుంది.
- **పీఎస్‌టీ:** రాత పరీక్ష తర్వాత ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా తర్వాత దశలో ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ నిర్వహిస్తారు. పురుష, మహిళా అభ్యర్థులకు వేర్వేరు భౌతిక ప్రామాణికాలు నిర్ణయించారు. పురుష అభ్యర్థులు 170 సెంటీ మీటర్లు, మహిళా అభ్యర్థులు 157 సెంటీ మీటర్ల ఎత్తు ఉండాలి. పురుష అభ్యర్థులకు కనీస ఛాతి కొలత 80 సెంటీ మీటర్లు శ్వాస తీసుకున్నప్పుడు అయిదు సెంటీ మీటర్లు విస్తరించాలి.

తుది ఎంపిక

తుది నియామకాలను ఖరారు చేసే క్రమంలో మొత్తం నాలుగు దశల్లో చూపిన ప్రతిభను పరిగణనలోకి తీసుకుంటారు. రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, మెడికల్ టెస్ట్‌ల్లో పొందిన మార్కులు, ఇతర రిజర్వేషన్ నిబంధనలను పరిగణనలోకి తీసుకుని తుది విజేతలను ప్రకటిస్తారు. మొత్తం ఈ నాలుగు దశల్లోనూ అభ్యర్థులు కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 31.12.2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** 2024 జనవరి 4 - 6 వరకు.
- **రాత పరీక్ష తేదీ:** 2024 ఫిబ్రవరి/మార్చిలో నిర్వహించే అవకాశం.
- **తెలుగు రాష్ట్రాల్లో రాత పరీక్ష కేంద్రాలు:** చీరాల, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, విజయనగరం, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ssc.nic.in

పరీక్షలో రాణించేలా

జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్

ఈ విభాగంలో మంచి మార్కుల కోసం వెర్బల్, నాన్-వెర్బల్ రీజనింగ్ అంశాలపై పట్టు సాధించాలి. స్పేస్ విజువలైజేషన్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనాలజీస్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అనాలిసిస్, విజువల్ మెమొరీ, అబ్జర్వేషన్, క్లాసిఫికేషన్స్, నంబర్ సిరిస్, కోడింగ్-డీకోడింగ్, నంబర్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వర్డ్ బిల్డింగ్, వెన్ డయాగ్రమ్స్ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

జనరల్ అవేర్‌నెస్ అండ్ జనరల్ నాలెడ్జ్

ఇందులో స్కోర్ కోసం భారతదేశ చరిత్ర, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, రాజ్యాంగం, శాస్త్రీయ పరిశోధనలు వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకుంటున్న సమకాలీన అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.

ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్

ప్యూర్ మ్యాథ్స్‌తోపాటు అర్థ గణిత అంశాలపై దృష్టి పెట్టాలి. డెసిమల్స్, ఫ్రాక్షన్స్, నంబర్స్, పర్సంటేజెస్, రేషియోస్,ప్రపోర్షన్స్, స్క్వేర్ రూట్స్, యావరేజస్, ప్రాఫిట్ అండ్ లాస్, అల్జీబ్రా, లీనియర్ ఈక్వేషన్స్, ట్రయాంగిల్స్, సర్కిల్స్, టాంజెంట్స్, ట్రిగ్నోమెట్రీలపై పట్టు సాధించాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఇంగ్లిష్/ హిందీలలో అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న భాషను ఎంచుకోవచ్చు. అధిక శాతం మంది ఇంగ్లిష్‌నే ఎంచుకుంటున్నారు. ఈ విభాగంలో రాణించడానికి బేసిక్ గ్రామర్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా యాంటానిమ్స్, సినానిమ్స్, మిస్-స్పెల్ట్ వర్డ్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, యాక్టివ్/ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూటషన్స్, ప్యాసేజ్ కాంప్రహెన్షన్‌లపై పట్టు సాధించాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	304	69,826
నిఫ్టీ ▲	68	20,969

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	14,404	▲	64
డోజోన్స్	36,248	▲	130
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,554	▲	41
డాక్స్	16,759	▲	130
షాంఘై	2,969	▲	3
నికాయ్	32,308	▼	583

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.95	83.97
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.09	106.45
€	యూరో	ఎస్‌బీఐ	88.90	91.25
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.37	58.68
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.18	56.11
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.38	63.37
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.29	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.69	23.84
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.38	12.33

ఆరోగ్య బీమా భారం తగ్గేదెలా..?



- కోపేమెంట్, డిడక్టబుల్‌తో తక్కువ ప్రీమియం
- పరిమిత కవరేజీతో బేస్ ప్లాన్
- సూపర్ టాపప్ జోడింపుతో మెరుగైన కవరేజీ
- రూమ్ షేరింగ్‌తో భారం తగ్గించుకోవచ్చు
- ఆరోగ్యం కోసం శ్రమించినా డిస్కౌంట్
- చివరి ఆప్షన్ ఇన్సూరెన్స్ పోర్టింగ్

రమణ్‌సింగ్ (68)కు ఇటీవలే హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి పాలసీ రెన్యువల్ నోటీస్ వచ్చింది. చూస్తే ప్రీమియం గతేడాది కంటే గణనీయంగా పెరిగిపోయింది. ఏకంగా 30 శాతం అధికంగా చెల్లించాల్సి రావడంతో దీన్ని ఎలా అధిగమించాలా? అనే ఆలోచనలో పడ్డాడు. రమణ్‌సింగ్‌కు మాత్రమే ఈ అనుభవం పరిమితం కాదు. దాదాపు అన్ని బీమా సంస్థలు హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంను ఇటీవలి కాలంలో పెంచేశాయి. దీంతో సగటు మధ్యతరగతి వాసులపై హెల్త్ ఇన్సూరెన్స్ రూపంలో భారం పెరిగిపోయింది. కరోనా విపత్తు తర్వాత నుంచి హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంలు గణనీయంగా పెరగడం పాలసీదారులకు తెలిసిన అనుభవమే. దీనికి క్లెయిమ్‌లు భారీగా పెరిగిపోవడమే కారణమని బీమా సంస్థలు చెబుతున్నాయి. ఈ పరిణామాలతో వృద్ధులకు హెల్త్ కవరేజీ విషయంలో కొన్ని బీమా సంస్థలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. అధిక ప్రీమియంకు తోడు, పలు షరతులు పెడుతున్నాయి. వృద్ధులకు హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం భారంగా మారుతున్న తరుణంలో దీన్ని తగ్గించుకునే మార్గాల గురించి చర్చించే కథనమే ఇది.

బీమా రంగ అభివృద్ధి, నియంత్రణ సంస్థ (ఐఆర్‌డీఏఐ) తాజా వార్షిక నివేదిక ప్రకారం.. హెల్త్ ఇన్సూరెన్స్ ఇన్‌కర్డ్ క్లెయిమ్ రేషియో 2020–21లో 94 శాతంగా ఉంటే, అది 2021–22 సంవత్సరానికి 109 శాతానికి పెరిగింది. ఇన్‌కర్డ్ క్లెయిమ్ రేషియో 100 శాతానికి దిగువన ఉంటేనే బీమా సంస్థలకు లాభం ఉన్నట్టు. 100 అంతకంటే ఎక్కువ ఉన్నట్టయితే, తమకు వస్తున్న ప్రీమియానికి మించి అవి చెల్లింపులు చేస్తున్నట్టు అర్థం చేసుకోవచ్చు. ''గడిచిన కొన్ని సంవత్సరాలుగా హెల్త్ ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లు పెరిగిపోయాయి. కరోనా తర్వాత అన్ని వయసుల వారి నుంచి క్లెయిమ్‌లు 10–30 శాతం వరకు ఎక్కువయ్యాయి. దీనివల్ల వృద్ధులపై భారం పెరిగిపోయింది. వీరు అధిక ప్రీమియం చెల్లించాల్సి వస్తోంది. పైగా వృద్ధుల్లో క్రమం తప్పకుండా ఆదాయం వచ్చే సదుపాయం అందరికీ ఉండదు'' అని పాలసీబజార్ హెల్త్ ఇన్సూరెన్స్ బిజినెస్ హెడ్ సిద్ధార్థ్ సింఘాల్ తెలిపారు. వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలు ఎక్కువ. దీంతో ఈ వయసులోని వారికి సహజంగానే ప్రీమియం ఎక్కువగా ఉంటుంది. దీనికితోడు ఇటీవలి కాలంలో క్లెయిమ్‌లు పెరగడంతో బీమా సంస్థలు ప్రీమియంను మరింత పెంచాయి. ''వృద్ధులకు సహజంగా హెల్త్ రిస్కులు ఎక్కువ. దీర్ఘకాలిక వ్యాధుల కారణంగా వీరు హెల్త్ కవరేజీ ఎక్కువగా వినియోగించుకుంటూ ఉంటారు. కనుక క్లెయిమ్‌ల రిస్కును పరిగణనలోకి తీసుకున్న తర్వాతే బీమా సంస్థలు ప్రీమియంను నిర్ధారిస్తుంటాయి. 30 ఏళ్ల వయసు వారి ప్రీమియంతో పోలిస్తే 60 ఏళ్లకు పైబడిన వారి హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం 2.5 రెట్ల నుంచి 4 రెట్ల వరకు అధికంగా ఉంటుంది'' అని గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్ డైరెక్ట్ సేల్స్ హెడ్ వివేక్ చతుర్వేది తెలిపారు. సీనియర్ సిటిజన్లలో కొందరికి బీమా సంస్థలు పాలసీలు ఇచ్చేందుకు నిరాకరిస్తుంటాయి. వారికి ముందస్తుగా నిర్వహించిన వైద్య పరీక్షల్లో వచ్చిన ఫలితాలే దీనికి కారణమని బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో తపన్ సింఘాల్ పేర్కొన్నారు.

కోపేమెంట్..



కోపేమెంట్ ఆప్షన్ ఎంపిక చేసుకుంటే, ప్రతి క్లెయిమ్‌లో పాలసీదారు తన వంతు కొంత భరించాల్సి ఉంటుంది. మిగిలిన మొత్తాన్ని బీమా సంస్థలు చెల్లిస్తాయి. సాధారణంగా ఈ కోపేమెంట్ అనేది బీమా కవరేజీలో 10 శాతం నుంచి 50 శాతం వరకు ఉంటుంది. 20 శాతం కోపేమెంట్ ఎంపిక చేసుకుంటే, క్లెయిమ్ మొత్తంలో పాలసీదారు 20 శాతం, మిగిలిన 80 శాతం బీమా సంస్థ చెల్లించాల్సి ఉంటుంది. క్లెయిమ్‌లో తన వైపు భారం తగ్గుతుంది కనుక బీమా సంస్థ ప్రీమియంలో తగ్గింపును ఇస్తుంది. ఇక్కడ గుర్తు పెట్టుకోవాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే.. కోపేమెంట్‌తో ప్రీమియంలో ఆదా అయిన మొత్తం కంటే, క్లెయిమ్ వచ్చినప్పుడు పాలసీదారు తన వంతు వాటాగా చెల్లించే మొత్తమే అధికంగా ఉంటుంది. అయినా సరే భారీ ప్రీమియం చెల్లించడం కష్టమనుకునే వారు కోపేమెంట్ ఆప్షన్‌ను పరిశీలించొచ్చు. దీనివల్ల పాలసీ ప్రీమియంలో 30–40 శాతం వరకు ఆదా చేసుకోవచ్చు. ''వృద్ధులకు అదనపు వైద్య సంరక్షణ అవసరం ఉంటుంది. కనుక వారు ఆసుపత్రిలో చేరితే ఎక్కువ రోజుల పాటు ఉండాల్సి రావచ్చు. అందుకని హెల్త్ ఇన్సూరెన్స్‌ను ఎంపిక చేసుకునే వారు ఇన్ పేషెంట్ (ఆసుపత్రిలో ఉండి చికిత్స పొందే వారు)లో గరిష్ఠ కవరేజీని ఆఫర్ చేసే ప్లాన్‌ను పరిశీలించాలి. వ్యాధుల వారీగా ఎవైనా మినహాయింపులు, ఉప పరిమితులు, కోపేమెంట్ ఉన్నాయేమో పరిశీలించాలి'' అని తపన్ సింఘాల్ సూచించారు.



డిడక్టబుల్..

పాలసీదారులు ప్రీమియం తగ్గించుకునేందుకు ఉన్న మార్గాల్లో మరొకటి డిడక్టబుల్ క్లాజ్. ఇది కూడా కోపేమెంట్ మాదిరే పనిచేస్తుంది. ఉదాహరణకు రూ.50,000 డిడక్టబుల్ అనే క్లాజ్ ఉందనుకుంటే.. రూ.50,000 మించిన క్లెయిమ్‌లకే బీమా సంస్థలు చెల్లింపులు చేస్తాయి. కోపేమెంట్ అలా కాదు. 10 శాతం కోపే ఉంటే రూ.50,000 క్లెయిమ్‌లో పాలసీహోల్డర్ రూ.5,000 చెల్లించాల్సి వస్తుంది. బీమా సంస్థ రూ.45,000 చెల్లిస్తుంది. కోపేమెంట్ అనేది ప్రతి క్లెయిమ్‌కు వర్తిస్తుంది. అదే డిడక్టబుల్ అనేది ఏడాది మొత్తానికి (కొన్ని బీమా సంస్థల్లో) స్థిరంగా ఉంటుంది. డిడక్టబుల్ ఎంత ఎక్కువ పెట్టుకుంటే, ప్రీమియం అంత మేర తగ్గుతుంది. క్లెయిమ్‌లలో ఆ మేర భారం పాలసీదారులపై పడుతుంది. మరొక ఉదాహరణలో.. ఆస్పత్రిలో చేరి సర్జరీ చేయించుకుంటే రూ.2,00,000 బిల్లు వచ్చింది. డిడక్టబుల్ రూ.20,000 ఉంటే, అప్పుడు పాలసీదారు ఈ మొత్తాన్ని చెల్లించాలి. ఆ తర్వాత మిగిలిన రూ.1,80,000 కోసం బీమా సంస్థ వద్ద క్లెయిమ్ చేసుకోవచ్చు. డిడక్టబుల్‌లో ఇప్పటి వరకు చెప్పుకున్నది స్వచ్ఛందమైనది.

సూపర్ టాపప్

వృద్ధాప్యంలో నామమాత్రపు కవరేజీ చాలకపోవచ్చు. మెరుగైన కవరేజీతోనే తగినంత రక్షణ లభిస్తుంది. కానీ, మెరుగైన కవరేజీ కోసం ప్రీమియం ఎక్కువగా చెల్లించాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో రెగ్యులర్ ఇండెమ్నిటీ ప్లాన్‌ను పరిమిత కవరేజీతో తీసుకోవాలి. దీనివల్ల ప్రీమియం తగ్గించుకోవచ్చు. దీనికి అదనపు కవరేజీతో సూపర్ టాపప్ తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల ఒకే పాలసీని అధిక కవరేజీతో తీసుకోవడంతో పోలిస్తే ప్రీమియం చాలా వరకు తగ్గుతుంది. ఉదాహరణకు రూ.5 లక్షలకు బేసిక్ ప్లాన్ తీసుకుని, దీనికి రూ.20 లక్షల సూపర్ టాపప్ చేసుకున్నారని అనుకుందాం. క్లెయిమ్ రూ.5 లక్షలు దాటినప్పుడు, అదనపు మొత్తానికి సూపర్ టాపప్ ఇచ్చిన బీమా సంస్థ నుంచి చెల్లింపులు వస్తాయి. రెగ్యులర్ ప్లాన్‌తో పోలిస్తే ఇలా చేయడం వల్ల ప్రీమియంను 30 శాతం వరకు ఆదా చేసుకోవచ్చు. ఇక్కడ టాపప్ ప్లాన్లు కూడా ఉన్నాయి. కానీ టాపప్, సూపర్ టాపప్ మధ్య చాలా వ్యత్యాసం ఉంది. టాపప్ ప్లాన్‌లో ఒక పాలసీ సంవత్సరంలో ప్రతి క్లెయిమ్‌కు విడిగా నిర్ణీత మొత్తం దాటినప్పుడే చెల్లింపులు లభిస్తాయి. సూపర్ టాపప్ ప్లాన్‌లో అలా కాదు. ఏడాది మొత్తం మీద నిర్దేశిత డిడక్టబుల్ ఒక్కటిగానే ఉంటుంది. అంటే బేస్ ప్లాన్ రూ.5 లక్షలు తీసుకున్నారు. దీనికి టాపప్ జోడించుకుంటే, ప్రతి క్లెయిమ్‌లోనూ రూ.5 లక్షలు మించినప్పుడే, రూ.5 లక్షలు మినహాయించి (డిడక్టబుల్) మిగిలినది టాపప్ నుంచి చెల్లింపులు వస్తాయి. అదే సూపర్ టాపప్‌లో.. ఒక ఏడాదిలో మూడు పర్యాయాలు ఆస్పత్రిలో చేరి (రూ.3లక్షలు, రూ.3 లక్షలు, రూ.4 లక్షలు) రూ.10 లక్షలు బిల్లు వచ్చినా, రూ.5 లక్షలు డిడక్టబుల్ పోను, మిగిలిన రూ.5 లక్షలను క్లెయిమ్ చేసుకోవచ్చు. బేస్ ప్లాన్ పరిమిత కవరేజీతో తీసుకుని, సూపర్ టాపప్ జోడించుకోలేని వారు.. చిన్న వాటికి క్లెయిమ్ చేసుకోకుండా ఉంటే మంచిది. దీనివల్ల నో క్లెయిమ్ బోనస్ రూపంలో బీమా కవరేజీని ఎలాంటి అదనపు ప్రీమియం లేకుండా నూరు శాతం వరకు పెంచుకోవచ్చు.

రూమ్ రెంట్

ఆస్పత్రిలో చేరిప్పుడు పొందే రూమ్ వసతి కూడా ప్రీమియంను నిర్ణయిస్తుంది. ఎలాంటి పరిమితులు లేని ప్లాన్‌తో పోలిస్తే సింగిల్ రూమ్, షేరింగ్ రూమ్ ఆప్షన్‌తో కూడిన పాలసీల ప్రీమియం తక్కువగా ఉంటుంది. కార్పొరేట్ ఆస్పత్రుల్లో అన్ని రకాల వసతులు ఉంటాయి. అన్నింటిలోకి షేరింగ్ తక్కువగా ఉంటుంది. కనుక షేరింగ్ ఆప్షన్ ఎంపిక చేసుకోవడం ద్వారా ప్రీమియం తగ్గేలా చూసుకోవచ్చు. ఒకవేళ షేరింగ్ ఎంపిక చేసుకుంటే.. ఆస్పత్రిలో చేరినప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ షేరింగ్ వసతికే పరిమితం కావడం మంచిది. ఖరీదైన వసతి తీసుకుంటే ఆస్పత్రి బిల్లులో కొంత పాలసీదారు చెల్లించాల్సి వస్తుంది. ఇది కేవలం రూమ్ రెంట్ వరకే పరిమితం కాదు. ఎందుకంటే ఖరీదైన వసతిలో ఉండి పొందే వైద్యం సాధారణ షేరింగ్ రూమ్‌లో పొందే వైద్యంతో పోలిస్తే అధిక వ్యయాలతో ఉంటుంది. కనుక పాలసీ క్లాజ్‌లో ఉన్న వసతికి మించి ఖరీదైన వసతిలో ఉంటే బిల్లులో కొంత మొత్తాన్ని పాలసీదారు చెల్లించాలి.

ఫిట్‌గా ఉంటే ప్రయోజనం

ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవడం ద్వారా ప్రీమియంలో తగ్గింపు పొందే అవకాశం ఉంది. రోజువారీ వ్యాయామం చేసే పాలసీహోల్డర్లకు బీమా సంస్థలు రివార్డు పాయింట్లు కేటాయిస్తున్నాయి. ఒక ఏడాది మొత్తం మీద ఇలా పొందిన రివార్డు పాయింట్లను, మరుసటి ఏడాది రెన్యువల్ ప్రీమియంలో తగ్గింపునకు వినియోగించుకోవచ్చు. ఉదాహరణకు రోజువారీ 10,000 అడుగులు నడవడం. లేదంటే రోజులో కనీసం 4,000 అడుగులు నడవడం వంటివి. లేదా జాగింగ్ చేయడం ద్వారా హెల్త్ రివార్డులు సంపాదించుకోవచ్చు. ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ హెల్త్ రివార్డులతో ప్రీమియంలో నూరు శాతం డిస్కౌంట్‌ను ఆఫర్ చేస్తోంది.



పోర్టింగ్

మొబైల్ నంబర్ పోర్టబులిటీ మాదిరే, హెల్త్ ఇన్సూరెన్స్‌ను కూడా ఒక బీమా సంస్థ నుంచి మరో బీమా సంస్థకు పోర్టింగ్ పెట్టుకోవచ్చు. బీమా సంస్థ సేవలు నచ్చకపోయినా, ప్రీమియం భారం అనిపించినా.. కారణం ఏదైనా పోర్టింగ్ సదుపాయం ఉంది. పోర్టింగ్ వల్ల పూర్వపు బీమా సంస్థలో పొందిన ప్రయోజనాలు క్యారీ ఫార్వార్డ్ (బదిలీ) అవుతాయి. పోర్టింగ్ వల్ల నో క్లెయిమ్ బోనస్ ఒక్కటి నష్టపోవాల్సి రావచ్చు. పాత సంస్థలో ముందు నుంచి ఉన్న వ్యాధులకు వెయిటింగ్ పీరియడ్ పూర్తి చేసి ఉంటే, కొత్త సంస్థలో మొదటి రోజు నుంచే కవరేజీ పొందొచ్చు. పాలసీ రెన్యువల్ గడువుకు 60 రోజుల నుంచి 45 రోజుల్లోపు కొత్త సంస్థ వద్ద పోర్టింగ్ అభ్యర్థన దాఖలు చేసుకోవాలి. ప్రస్తుత పాలసీలోని కవరేజీ ఫీచర్లతో పోలిస్తే, మెరుగైన సదుపాయాలతో తక్కువ ప్రీమియంతో ఆఫర్ చేస్తున్న సంస్థకు మారిపోవడం వల్ల కొంత ఆదా చేసుకోవడానికి అవకాశం ఉంది.

వీటిని అనుసరించొచ్చు..



- హెల్త్ ఇన్సూరెన్స్‌ను చిన్న వయసులోనే తీసుకోవాలి. ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఆ వయసులో ఉండవు. దీంతో ప్రీమియం తక్కువగా ఉంటుంది. నేరుగా 60 ఏళ్ల తర్వాత పాలసీ తీసుకునే వారితో పోలిస్తే, ముందు నుంచే హెల్త్ కవరేజీలో ఉన్న వారికి ప్రీమియం కొంత తక్కువ ఉంటుంది. వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలు ఎక్కువ మందిలో కనిపిస్తుంటాయి. వారికి రిస్క్ ఎక్కువగా ఉంటుందని అధిక ప్రీమియాన్ని కంపెనీలు చార్జ్ చేస్తుంటాయి.
- హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్‌ను ఆన్‌లైన్ ద్వారా నేరుగా బీమా సంస్థ పోర్టల్ నుంచి కొనుగోలు చేస్తే ప్రీమియం 5–10% తక్కువగా ఉంటుంది. కమీషన్లు, ఇతర వ్యయాల భారం తగ్గుతుంది కనుక బీమా సంస్థలు డిస్కౌంట్ ఇస్తాయి. పైగా ఆన్‌లైన్‌లో అన్ని బీమా సంస్థల ప్లాన్ల ఫీచర్లు, ప్రీమియంను పోల్చి చూసుకునే వెసులుబాటు పాలసీబజార్ వంటి వేదికలు కల్పిస్తున్నాయి. ఈ విధంగానూ ప్రీమియం భారం తగ్గవచ్చు.
- విడిగా ప్లాన్ తీసుకోవడానికి బదులు కుటుంబం అంతటికీ ఒక్కటే ఫ్లోటర్ పాలసీ తీసుకుంటే ప్రీమియం తగ్గుతుంది.
- అవసరం లేని కవరేజీలకు దూరంగా ఉండాలి. అవసరం లేని యాడాన్‌లను జోడించుకుంటే ప్రీమియం భారం పెరుగుతుంది.
- రూ.5 లక్షల బేసిక్ కవరేజీతో ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్ తీసుకుని, రూ.5 లక్షల డిడక్టబుల్‌తో రూ.20-50 లక్షలకు సూపర్ టాపప్ ప్లాన్ జోడించుకుంటే ప్రీమియం ఆదా అవుతుంది.
- తమ పిల్లలు కార్పొరేట్ సంస్థల్లో పనిచేస్తుంటే, వారి కార్యాలయం తరఫున తల్లిదండ్రులు కవరేజీ కల్పించుకోవడం ఒక మార్గం. గ్రూప్ ప్లాన్ కావడంతో ప్రీమియం తగ్గుతుంది.
- ఇక ప్రీమియంలో ఆదా కోరుకునే వారు ఒక ఏడాదికి కాకుండా మూడేళ్లకు ఒకేసారి ప్రీమియం చెల్లించడాన్ని పరిశీలించొచ్చు. దీనివల్ల ప్రీమియంలో 10 శాతం వరకు ఆదా అవుతుంది.

కోరమండల్ ఇంటర్నేషనల్ | షేర్‌ఖాన్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 1,225 టార్గెట్: రూ. 1,430

ఎందుకంటే: ప్రపంచ ఎరువుల మార్కెట్లో సరఫరా తగ్గడంతో దిగుమతి చేసుకునే ఎరువుల ధరలు ఎగబాకేందుకు దారితీయనుంది, మరో పక్క ప్రభుత్వం అధిక సబ్సిడీలు అందిస్తుండటం కూడా ఎరువుల డిమాండ్ మరింత జోరందుకునేలా చేస్తోంది, దీంతో స్వల్పకాలంలో కంపెనీ ఆర్థిక పనితీరు పుంజుకోనుంది. సీడీఎంఓ, స్పెషాలిటీ కెమికల్‌పై దృష్టిసారించడం సరైన చర్య, దీనివల్ల ప్రధానమైన ఎరువులు/సీపీసీ వ్యాపారం నుండి పటిష్టమైన ఆదాయం లభించడంతో పాటు మధ్య, దీర్ఘకాలికంగా చూస్తే మెరుగైన వృద్ధికి దోహదం చేయగలదు. నానో డీఏపీ వంటి వినూత్నమైన ఉత్పత్తులను ప్రవేశపెట్టడం వల్ల మార్జిన్లు పుంజుకోవడంతో పాటు ఆదాయంలో కూడా అదనపు వృద్ధికి వీలు కల్పించనున్నాయి, కంపెనీ 20% ఆపరేటింగ్ మార్జిన్లను సాధించేందుకు నానో డీఏపీ తోడ్పడుతుందని యాజమాన్యం అంచనా వేస్తోంది. వ్యవసాయ రంగంలో డ్రోన్స్ వంటి భవిష్యత్తు టెక్నాలజీలు, సంబంధిత మార్కెట్లో విస్తరించేందుకు, కొత్త సర్వీసులను అందించేందుకు కొత్త ప్లాట్‌ఫామ్‌గా ఉపయోగపడుతుంది. అంతేకాకుండా, కంపెనీ చేతిలో ఆర్డర్లు పటిష్టంగా ఉండటం కూడా రానున్న కాలంలో మెరుగైన ఆదాయాలకు అద్దం పడుతోంది.

నజారా టెక్నాలజీస్ | ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 810 టార్గెట్: రూ. 1,080

ఎందుకంటే: రూ. 510 కోట్ల విలువైన ప్రిఫరెన్షియల్ షేర్ల జారీ తర్వాత నజారా టెక్నాలజీస్ వద్ద 800 కోట్లకు పైగా నగదు నిల్వలు ఉన్నాయి. ఆర్‌ఎంజీ విభాగంలో నిధుల లభ్యత తగ్గిన నేపథ్యంలో దీన్ని ఎదుర్కొనేందుకు కంపెనీ వద్దనున్న పటిష్టమైన నగదు నిల్వలు దోహదం చేయనున్నాయి. పోటీ కంపెనీలకు తమ మార్కెట్ షేర్‌ను కోల్పోవాల్సి వస్తుందన్న భయాల వల్ల చాలామటుకు ప్లాట్‌ఫామ్‌లు తుది వినియోగదారుకు 28% జీఎస్‌టీని పూర్తిగా విధించడం లేదు, దీనివల్ల వాటికి నగదు కొరత మరింత తీవ్రమవుతోంది. వేల్యుయేషన్లలో భారీ దిద్దుబాటు నేపథ్యంలో నియంత్రణ సంస్థలు 2024 సంవత్సరం ద్వితీయార్థంలో పన్ను విధింపును సవరించవచ్చని భావిస్తున్నారు. దీనివల్ల స్థిరీకరణ అనేది ఆలస్యమవుతోంది. అయితే, వేతనాల్లో కొంతమేర కరెక్షన్‌కు తోడు, ఇతర కంపెనీలను కొనుగోలు చేసే విషయంలో కూడా చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆర్‌ఎంజీ విభాగంలో కొనుగోళ్లు/విస్తరణకు ప్రయత్నిస్తున్న నజారాకు ఈ పరిణామాలు ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉంది. కాగా, పోటీ పెరగడంతో పాటు యూఎస్ మార్కెట్లలో మందగమనం, కొనుగోలు చేసేందుకు కంపెనీలను గుర్తించడం అలాగే కొనుగోలు చేసిన కంపెనీలను ఇంటిగ్రేట్ చేయడంలో అసమర్థత వంటి రిస్కులు కంపెనీపై ప్రభావం చూపొచ్చు.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-12-2023	
విశాఖ	570-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	564-00
విజయవాడ	564-00
రిటైల్ ధర (డజను)	72.00
10-12-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	545-00
వరంగల్	547-00
రిటైల్ ధర	6.05

జోస్ అలుక్కాస్ 'నిత్యారా' ఆవిష్కరణ



హైదరాబాద్: జోస్ అలుక్కాస్ 'నిత్యారా' పేరుతో కొత్త డైమండ్ కలెక్షన్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ వజ్రాభరణాల శ్రేణిని సినీ నటి కీర్తి సురేష్ ఆవిష్కరించారు. ''అత్యుత్తమ వజ్రాలు, రత్నాలతో నిపుణులైన డిజైనర్లు, ప్రావీణ్యం కలిగిన కళాకారుల 'నిత్యారా' ఆభరణాలు రూపొందించారు. చీరలతో మాత్రమే కాకుండా ఆధునిక దుస్తులతో సైతం కలిసిపోయేలా అన్ని ఆధునిక హంగులతో ఆభరణాలు తీర్చిదిద్దారు'' అని కంపెనీ తెలిపింది. ఈ కార్యక్రమంలో జోస్ ఆలుక్కాస్ ఎండీలు వర్గీస్ ఆలుక్కా, పాల్ ఆలుక్కా, జాన్ ఆలుక్కా పాల్గొన్నారు.

18 నుంచి 22 వరకు మూడవ విడత గోల్డ్ బాండ్ స్కీమ్



న్యూఢిల్లీ: సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్ ఈ ఆర్థిక సంవత్సరం మూడవ విడత డిసెంబర్ 18 నుంచి 22వ తేదీ వరకూ అందుబాటులోకి రానుంది. ఫిబ్రవరి 12–16 తేదీల్లో నాల్గవ విడత వినియోగదారులకు అందుబాటులోకి వస్తుందని ఆర్థికశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. మొదటి విడత జూన్ 19 నుంచి 23 వరకూ (బాండ్ జారీ ధర గ్రాముకు రూ.5,926), రెండవ విడత సెప్టెంబర్ 11 నుంచి 15 వరకూ (ధర గ్రాముకు రూ.5,923) అమలయిన సంగతి తెలిసిందే.

రెండు టాపప్ ప్లాన్లు తీసుకోవచ్చా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను స్వయం ఉపాధిపై ఆధారపడి ఉన్నాను. రూ.4 లక్షలకు బేసిక్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ ఉంది. అదే బీమా సంస్థ నుంచి రూ.6 లక్షలకు సూపర్ టాపప్ ప్లాన్ కూడా ఉంది. అంటే నా ముగ్గురు సభ్యుల కుటుంబానికి మొత్తం రూ.10 లక్షల కవరేజీ ప్రస్తుతానికి ఉంది. రూ.10 లక్షల డిడక్టబుల్‌తో రూ.40 లక్షల సూపర్ టాపప్ ప్లాన్‌ను మరో బీమా సంస్థ ఆఫర్ చేస్తోంది. దాని ప్రీమియం చాలా తక్కువ. ఇప్పుడు రూ.40 లక్షలకు సూపర్ టాపప్ తీసుకుంటే మొత్తం కవరేజీ రూ.50 లక్షలకు పెరుగుతుందా? నేను రెండు సూపర్ టాపప్ ప్లాన్లను కలిగి ఉండొచ్చా? – తన్మోయ్ పంజా

టాపప్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ అనేది డిడక్టబుల్‌కు పైన ఉన్న మొత్తానికి బీమా కవరేజీని ఇస్తుంది. డిడక్టబుల్ అంటే, అంత మొత్తాన్ని పాలసీదారు భరించాల్సి ఉంటుంది. అంతకు మించిన మొత్తానికి సూపర్ టాపప్ కవరేజీ అమల్లోకి వస్తుంది. సూపర్ టాపప్ ప్లాన్ తీసుకునేందుకు బేసిక్ కవరేజీ ఉండాలనేమీ లేదు. బేసిక్ టాపప్ ప్లాన్‌లో డిడక్టబుల్ అనేది హాస్పిటల్‌లో చేరిన ప్రతి సందర్భంలోనూ అమలవుతుంది. కానీ, సూపర్ టాపప్ ప్లాన్‌లో ఒక ఏడాది మొత్తం మీద అయిన హాస్పిటల్ ఖర్చులకు డిడక్టబుల్ అమలవుతుంది. కనుక టాపప్ ప్లాన్లతో పోలిస్తే సూపర్ టాపప్ ప్లాన్ మరింత ప్రయోజనకరం అని చెప్పుకోవాలి. ఒకే సమయంలో రెండు సూపర్ టాపప్ ప్లాన్లను కలిగి ఉండే విషయంలో ఎలాంటి నియంత్రణలు లేవు. ప్రస్తుతం ఉన్న ప్లాన్‌లో లేని మెరుగైన సదుపాయాలను కొత్త సూపర్ టాపప్ ప్లాన్ ఆఫర్ చేస్తుంటే నిస్సందేహంగా తీసుకోవచ్చు. బేసిక్ పాలసీలో లేని రక్షణను సూపర్ టాపప్ ప్లాన్ ఇస్తుంటే తీసుకోవచ్చు. బేసిక్ ప్లాన్ రూ.2 లక్షల కవరేజీని ఇస్తుంటే, రూ.2 లక్షల డిడక్టబుల్‌తో రూ.5 లక్షల సూపర్ టాపప్ ప్లాన్ ఉంటే.. ఇప్పుడు రూ.5 లక్షల డిడక్టబుల్‌తో రూ.10 లక్షలకు మరో సూపర్ టాపప్ ప్లాన్ తీసుకోవాలని అనుకుంటే తీసుకోవచ్చు. ఉదాహరణకు మీ ఆస్పత్రి బిల్లు రూ.18 లక్షలు అయిందనుకోండి. అప్పుడు బేసిక్ పాలసీ నుంచి రూ.2 లక్షలు, మొదటి సూపర్ టాపప్ నుంచి రూ.5 లక్షలు చెల్లింపులు లభిస్తాయి. అప్పుడు మరో రూ.11 లక్షలు మిగిలి ఉంటుంది. రెండో సూపర్ టాపప్ ప్లాన్ నుంచి రూ.10 లక్షలు చెల్లింపులు వస్తాయి. మిగిలిన రూ.లక్షను పాలసీదారుడు భరించాల్సి ఉంటుంది. అయితే, ఎక్కువ సూపర్ టాపప్ ప్లాన్లు ఉంటే బీమా ప్రక్రియ సంక్లిష్టంగా మారుతుంది. బేసిక్ పాలసీకి అదనంగా ఒక సూపర్ టాపప్ ప్లాన్‌ను కలిగి ఉండడం సూచనీయం. మూడు బీమా సంస్థల వద్ద క్లెయిమ్ కోసం చేయాల్సిన పేపర్ పని ప్రతిబంధకంగా మారుతుంది. కనుక కవరేజీని సాధ్యమైనంత సులభంగా ఉంచుకోవాలి.

నేను 1994లో మోర్గాన్ స్టాన్లీ గ్రోత్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేశాను. అందుకు సంబంధించి భౌతిక సర్టిఫికెట్ నా వద్ద ఉంది. ఈ మొత్తాన్ని ఎలా ఉపసంహరించుకోవాలి? వీటి విలువ ఎంత? – వచన్

2014లో మోర్గాన్ స్టాన్లీ భారత్ మార్కెట్ నుంచి వెళ్లిపోయింది. మోర్గాన్ స్టాన్లీ నిర్వహణలోని ఎనిమిది మ్యూచువల్ ఫండ్ పథకాలను హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ కొనుగోలు చేసింది. మోర్గాన్ స్టాన్లీ గ్రోత్ ఫండ్ హెచ్‌డీఎఫ్‌సీ లార్జ్‌క్యాప్ ఫండ్‌లో విలీనం అయింది. హెచ్‌డీఎఫ్‌సీ లార్జ్ క్యాప్ ఫండ్ 2009 వరకు హెచ్‌డీఎఫ్‌సీ లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్‌గా కొనసాగింది. 15 ఏళ్ల లాకిన్ పీరియడ్ ముగిసిన అనంతరం ఇది ఓపెన్ ఎండెడ్ పథకంగా మార్పు చెందింది. ఇప్పుడు మీ పెట్టుబడులను వెనక్కి తీసుకోవాలని అనుకుంటే, హెచ్‌డీఎఫ్‌సీ అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీని సంప్రదించాల్సి ఉంటుంది. మోర్గాన్ స్టాన్లీ గ్రోత్ ఫండ్‌లో మీ పెట్టుబడులకు సంబంధించి ఆధారాలను సమర్పించాలి. అప్పుడు మీ పెట్టుబడులను వెనక్కి తీసుకునే విషయమైన వారి నుంచి తగిన సహకారం లభిస్తుంది.

క్లుప్తంగా...

తెలుగు రాష్ట్రాల్లో ఆటా సేవా కార్యక్రమాలు



ఆటా సేవా కార్యక్రమాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: అమెరికా తెలుగు సంఘం(ఆటా) ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 30వ తేదీ వరకు తెలుగు రాష్ట్రాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆటా వేడుకల కమిటీ ప్రెసిడెంట్ జయంత్ చల్లా తెలిపారు. అమెరికాలో 2024 జూన్ 7 నుంచి 9 వరకు జరగనున్న సదస్సుకు ముందు ఇక్కడ సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతీ రెండేళ్లకు ఒకసారి తెలుగు రాష్ట్రాల్లో విద్య, వైద్యం, వ్యాపారం తదితర 15 విభాగాల్లో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. నేడు(సోమవారం) శ్రీశైలం నుంచి సేవా కార్యక్రమాలు ప్రారంభిస్తునట్లు చెప్పారు. ముగింపు వేడుకలు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 30వ తేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆటా సెక్రటరీ రామకృష్ణారెడ్డి ఆల, కోశాధికారి సతీశ్ రెడ్డి, జాయింట్ ట్రెజరర్ రవీందర్ గూడూరు, మీడియా కో ఆర్డినేటర్ ఈశ్వర్ బండా, బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ నరసింహారెడ్డి ధైసాని, కాశీ కోట, రాజ్ కక్కెర్ల, అమృత్ ముళ్లపోడి తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో ఇబ్బందులు ఎదురైతే 1866ను సంప్రదించండి

- తెలంగాణ అమెరికా తెలుగు సంఘం
- నేటి నుంచి 23 వరకు రాష్ట్రంలో సేవా కార్యక్రమాలు



సేవా కార్యక్రమాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: తెలంగాణ అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 23వ తేదీ వరకు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సేవాడేస్ కమిటీ అధ్యక్షుడు వంశీరెడ్డి తెలిపారు. ఆదివారం ఇక్కడి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ నుంచి కొత్తగా అమెరికాకు వచ్చే విద్యార్థులు అక్కడ ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఎవరిని సంప్రదించాలో తెలియక మథనపడుతున్నారని, అలాంటివారు తమ సంస్థ ఆధ్వర్యంలో నడిచే సేవా సంస్థ టోల్‌ఫ్రీ నంబర్ 1866ను ఆశ్రయించాలని అన్నారు. 11న మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఉచిత డెంటల్ క్యాంప్, శానిటరీ ప్యాడ్స్ పంపిణీని రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23న రవీంద్రభారతిలో జరిగే ముగింపు కార్యక్రమానికి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరుకానున్నారని తెలిపారు.



బాంబుతో ఆయిల్ రిగ్‌ను పేల్చిన కమాండోలు

సాగర తీరంలో
సాహస విన్యాసాలు

ఆర్కేబీచ్‌లో నౌకాదళ పరాక్రమ ప్రదర్శన

సాక్షి, విశాఖపట్నం: ప్రశాంతంగా కనిపించే విశాఖ సాగరతీరం ఆదివారం సాయంత్రం యుద్ధ వాతావరణాన్ని తలపించింది. బాంబుల వర్షం.. యుద్ధ విమానాల చక్కర్లు, శత్రుమూకల దాడులు.. యుద్ధ ట్యాంకర్ల వీర విహారంతో.. ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. శత్రుదేశం పాక్‌పై విజయానికి ప్రతీకగా ఏటా విశాఖ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో ఆర్‌కే బీచ్‌లో ఆదివారం నేవీడే విన్యాసాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ముందుగా నేవీ బ్యాండ్, నేవల్ చిల్డ్రన్ స్కూల్ విద్యార్థుల ప్రదర్శనలతో ప్రారంభమైన విన్యాసాలు.. మార్కోస్ రాకతో వేడెక్కాయి. యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, వైమానిక దళాల అద్భుత ప్రదర్శనలు, యుద్ధ, నిఘా విమానాలు, హెలికాప్టర్ల ద్వారా నిర్వహించబడే వ్యూహాత్మక విన్యాసాలతో కూడిన ఫ్లాగ్‌షిప్ ఈవెంట్ అద్భుతంగా సాగింది. చివరిగా.. యుద్ధ నౌకలు విద్యుత్ దీపాలంకరణతో నేవీడే విన్యాసాల్ని ముగించాయి. విన్యాసాలకు విశిష్ట అతిథులుగా మంత్రులు విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్, ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, ఎంపీ డా.సత్యవతి, కలెక్టర్ డా.మల్లికార్జున, సీపీ రవిశంకర్, జేసీ విశ్వనాథన్ హాజరయ్యారు. అనంతరం.. నేవీ హౌస్‌లో తూర్పు నౌకాదళాధిపతి, వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ 'ఎట్ హోమ్' ఫంక్షన్ పేరుతో నిర్వహించిన తేనీటి విందులో గవర్నర్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత నౌకాదళ పటిమని చాటిచెప్పే వీడియోను గవర్నర్ ఆవిష్కరించి తిలకించారు.



జాతీయ పతాకంతో స్కై డైవ్ చేస్తున్న కమాండో



సముద్రంలో చిక్కుకున్న వారిని రక్షించే ఆపరేషన్ ఇలా..



విన్యాసాలను వీక్షించేందుకు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు



బాంబులను జారవిడుస్తున్న యుద్ధ విమానం

నట్టేట ముంచిన గూగుల్ మ్యాప్

- గౌరవెల్లి ప్రాజెక్టులోకి దూసుకెళ్లిన డీసీఎం వ్యాన్
- కొంతదూరం వెళ్లాక ఈదుకుంటూ బయటపడ్డ డ్రైవర్
- జేసీబీ సాయంతో డీసీఎంను బయటికి తీసిన స్థానికులు
- సిద్దిపేట జిల్లా అక్కన్నపేటలో ఘటన



జేసీబీ సాయంతో డీసీఎంను బయటకు తీసుకొస్తున్న దృశ్యం

అక్కన్నపేట (హుస్నాబాద్): ఏదైనా కొత్త ప్రదేశానికి వెళ్తున్నామా?.. జస్ట్ గూగుల్ మ్యాప్స్ ఓపెన్ చేయడం, అందులో సూచించిన దారిని అనుసరిస్తూ ముందుకు వెళ్లిపోవడం మామూలైపోయింది. కానీ అన్నిసార్లు గూగుల్ మ్యాప్స్‌ను గుడ్డిగా నమ్మి ముందుకెళ్తే నట్టేట మునగడం ఖాయం. తాజాగా ఓ డీసీఎం వ్యాన్ డ్రైవర్ గూగుల్ మ్యాప్ చూసుకుంటూ వాహనం నడిపి ఏకంగా ప్రాజెక్టులోకి వెళ్లిపోయాడు. సిద్దిపేట అక్కన్నపేట మండలం గుడాటిపల్లి గ్రామంలో నిర్మించిన గౌరవెల్లి ప్రాజెక్టు వద్ద ఈ ఘటన జరిగింది.

పాల ప్యాకెట్లు తీసుకెళ్తూ..

హైదరాబాద్‌కు చెందిన ఓ డీసీఎం డ్రైవర్ శనివారం రాత్రి హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో వృథా అయిన పాల ప్యాకెట్లను వ్యాన్‌లో లోడ్ చేసుకున్నారు. తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరి హుస్నాబాద్ మీదుగా రామవరం వైపు ప్రయాణిస్తున్నారు. డ్రైవర్‌కు రోడ్డుపై సరైన అవగాహన లేక గూగుల్ మ్యాప్స్ చూసుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో బంగారు లొద్దితండా దాటాక రామవరం వైపు వెళ్లాల్సిన ఉన్నా.. గుడాటిపల్లి వైపు మళ్లారు. మ్యాప్‌లో చూపించినట్టుగా ముందుకువెళ్లారు. కొంతదూరం వెళ్లాక నీరు ఎక్కువగా కనిపించింది. వాన వల్ల నీళ్లు నిలిచాయేమో అనుకుని ముందుకెళ్లాడు. క్యాబిన్ వరకూ నీళ్లు వచ్చాయి. డీసీఎం ఆగిపోయింది. దీంతో డ్రైవర్ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఈదుకుంటూ బయటకు వచ్చాడు. చుట్టుపక్కల ఉన్న వారి వద్దకు వెళ్లి ఈ విషయం చెప్పాడు. ఆదివారం ఉదయం స్థానికులు జేసీబీ సాయంతో డీసీఎంను బయటకు లాగారు.

రోడ్డుకు అడ్డుగా గోడ నిర్మించాలి

నందారం స్టేజీ దాటాక రోడ్డుకు అవతలి వైపు గౌరవెల్లి ప్రాజెక్టు కట్టడంతో వెళ్లడానికి దారి లేదని స్థానికులు తెలిపారు. దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ మేర నీరు నిలిచి ఉంటుందని వివరించారు. రోడ్డుకు అడ్డుగా పెద్ద గోడ నిర్మించాలని.. లేకుంటే గూగుల్ మ్యాప్ నుంచి ఈ రోడ్డును తొలగించాలని సూచించారు. ఇంతకుముందు సెప్టెంబర్ 7న ఓ లారీ డ్రైవర్ ఇలాగే గూగుల్ మ్యాప్ చూస్తూ.. ప్రాజెక్టులోకి దూసుకెళ్లారని.. ఇప్పుడు డీసీఎం వ్యాన్ వెళ్లిందని తెలిపారు.

12 నుంచి శ్రీవారి ఆలయంలో అధ్యయనోత్సవాలు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 12 నుంచి జనవరి 5 వరకు అధ్యయనోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశికి 11 రోజులు ముందుగా శ్రీవారి సన్నిధిలో ఈ అధ్యయనోత్సవం ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా స్వామి వారి ప్రాశస్త్యంపై 12 మంది ఆళ్వార్లు రచించిన దివ్యప్రబంధ పాశురాలను శ్రీవైష్ణవ జీయంగార్లు గోష్ఠిగానం చేస్తారు. ఆళ్వార్ దివ్యప్రబంధంలోని 4 వేల పాశురాలను 25 రోజుల పాటు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో శ్రీవైష్ణవులు పారాయణం చేస్తారు.



'కార్గిల్' రన్

కార్గిల్ విజయ్ రజత్ జయంతి సందర్భంగా ఆదివారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో 'ఆనర్ రన్' నిర్వహించారు. మాజీ సైనికులు, ఆర్మీ అధికారులు, సిబ్బంది, ఆర్మీ పాఠశాలల చిన్నారులు పెద్ద ఎత్తున ఈ రన్‌లో పాల్గొన్నారు. రన్‌ను విజయవంతంగా పూర్తిచేసిన వారికి మేజర్ జనరల్ రాకేష్ మనోచా చేతుల మీదుగా మెడల్స్ అందజేశారు.

– రసూల్‌పూరా, హైదరాబాద్

నెరవేరనున్న హిందువుల కల

సాక్షి, హైదరాబాద్: అయోధ్యలో వచ్చే నెలలో రాములవారి విగ్రహ ప్రతిష్ఠాపనతో హిందువుల కల నిజం కాబోతోందని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. అయోధ్యలో నిర్మిస్తున్న రామ మందిరంలో రాములవారిని ప్రతిష్ఠించే గర్భగుడి ఫొటోలను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ విడుదల చేసిన నేపథ్యంలో.. వాటిని ఆమె ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ట్రస్ట్ విడుదల చేసిన అయోధ్య రామ మందిరం గర్భగుడికి సంబంధించిన ఫొటోలతో రూపొందించిన వీడియోను పోస్టుకు జత చేశారు. రామాలయ సందర్శనకు ఎంతోమంది ఎదురు చూస్తున్నారని కవిత వెల్లడించారు.



సర్దుకుపోదాం రండి

- కాంగ్రెస్‌ను వీడిన నేతలకు అధిష్టానం పిలుపు
- గ్రేటర్ ఫలితాల విశ్లేషణతో ఆహ్వానం
- పార్టీ బలోపేతం దిశగా కార్యాచరణ
- పలువురు నుంచి సానుకూల స్పందన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా వీచిన కాంగ్రెస్ గాలిలో సైతం నగరంలో పరాజయాన్ని మూటకట్టుకోవాల్సి రావడంతో అధిష్టానం అంతర్మథనంలో పడింది. గ్రేటర్ పరిధిలోని అర్బన్ అసెంబ్లీ స్థానాలన్నింటిలో ఓటమి పాలు కావడాన్ని జీర్ణించుకోలేక పోతోంది. సాక్షాత్తూ రాష్ట్ర రాజకీయాలకు గుండె కాయలాంటి హైదరాబాద్ గడ్డ పరిస్థితి నెలకొనడాన్ని తీవ్రంగా పరిగణించింది. ఎన్నికల ఫలితాలు, అందుకు కారణాలను విశ్లేషించి.. కనీసం జీహెచ్‌ఎంసీ ఎన్నికల వరకైనా సంస్థాగతంగా బలోపేడేందుకు పార్టీ వీడిన పాత పార్టీ శ్రేణులను తిరిగి ఘర్ వాపసీకి చర్యలకు ఉపక్రమంచింది. అందులో భాగంగా టికెట్ ఆశించి భంగపడి పార్టీ వీడిన వారితో సంప్రదింపులు చేస్తోంది. పార్టీలో అన్యాయం జరిగిన మాట వాస్తవమే.. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు జెండా మోసి.. అధికారంలోకి వచ్చే ముందు పార్టీ వీడటం దురదృష్టకరం. జరిగింది.. జరిగిపోయింది. సర్దుకుపోదాం రండి అంటూ విజ్ఞప్తి చేస్తోంది.

కీలక నేతలపై నజర్..

గత ఎన్నికల ముందు పలు అసెంబ్లీ సెగ్మెంట్లలో టికెట్ ఆశించిన కీలక నేతలు పార్టీని వీడారు. హైదరాబాద్ నగరంతో పాటు శివార్ల సెగ్మెంట్లలో సైతం ఇదే పరిస్థితి కొనసాగింది. కొందరు.. బీఆర్ఎస్, మరికొందరు బీజేపీ పార్టీలో చేరారు. ఉప్పల్, మల్కాజిగిరి, ఎల్బీనగర్, మహేశ్వరం, ముషీరాబాద్, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, ఉప్పల్, అంబర్‌పేట, కుత్బుల్లాపూర్ తదితర అసెంబ్లీ సెగ్మెంట్ల చెందిన ముఖ్య నేతలు పార్టీ వీడారు. వారి వెంట పార్టీ కేడర్ సైతం నడిచింది. అంతకు ముందు సైతం ముఖ్యమైన మరికొందరు నేతలు పార్టీ వీడారు. తిరిగి వారిని పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. దీంతో కొందరు నేతలను నుంచి సానుకూలత వ్యక్తమైంది.

టార్గెట్ జీహెచ్‌ఎంసీ ఎన్నికలు

లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా అధికార కాంగ్రెస్ ఘర్ వాపసీకి సిద్ధమైంది. మరో ఏడాదిన్నర కాలంలో బల్దియా ఎన్నికలు జరగనుండటంతో సంస్థాగతంగా బలపేడేందుకు ప్రయత్నాలు చేస్తోంది. గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. మళ్లీ ఆ పరిస్థితి రావద్దని ప్రయత్నిస్తోంది.

భగ్గుమంటున్న బియ్యం

- బీపీటీ రకం క్వింటాలుకు రూ. 4200– 4800
- హెచ్‌ఎంటీ బియ్యం రూ.5200 – 5600
- పాతవి మంచి రకం రూ.5400 – 6400
- పెరిగిన ధరలతో సగటుజీవి విలవిల



సాక్షి, హైదరాబాద్: వండకముందే బియ్యం కుతకుతలాడుతున్నాయి. నింగినంటిన ధరలతో ముట్టుకుంటే మంట తగులుతోంది. బియ్యం ధరలు రయ్ రయ్‌మంటున్నాయి. మునుపెన్నడూలేని రీతిలో రికార్డు స్థాయిలో కేజీ సన్న బియ్యం కనిష్టంగా రూ. 60 నుంచి 65 వరకు పలుకుతోంది. గతేడాది ప్రథమ శ్రేణి సన్నబియ్యం కిలోకు రూ.48 నుంచి 54లోపు లభించేవి. ప్రస్తుతం కిలో రూ.60 నుంచి రూ.65 వరకు పలుకుతున్నాయి. గతేడాది ఖరీఫ్.. ఈ ఏడాది రబీ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 80 నుంచి 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరణ చేశారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. గతంలో కంటే 20 నుంచి 25 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఎక్కువగా సేకరించినట్లు పౌరసరఫరాల అధికారుల లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. డిమాండ్ కంటే ఎక్కువగా బియ్యం మార్కెట్‌కు వచ్చినా ధరలు మాత్రం ఏటా పెరుగుతూనే ఉన్నాయి. వరి ధాన్యం ఎక్కువగా వచ్చినా బియ్యం ధరల నియంత్రణలో పౌరసరఫరాల అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి.

పన్నులు ఎత్తివేసినా..

జీఎస్టీ రాక ముందు మిల్లర్లు, వ్యాపారులు ప్రతి క్వింటాల్‌పై 4 శాతం పన్నులు చెల్లించేవారు. కానీ జీఎస్టీ అమలులోకి వచ్చాక వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులపై పన్నులను పూర్తిగా తొలగించారు. అందులో భాగంగానే బియ్యంపై వ్యాట్‌ను కూడా పూర్తిగా ఎత్తివేశారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. పన్నులు రద్దు చేసినా బియ్యం ధరలు విపరీతంగా పెంచి మిల్లర్లు, రిటైల్ వ్యాపారులు కొనుగోలుదారులను దోచేస్తున్నారు. ప్రభుత్వం సరైన రీతిలో పర్యవేక్షణ చేయని కారణంగానే వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచుతున్నారనే విమర్శలున్నాయి.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ..

- గ్రేటర్ పరిధిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో హోల్‌సేల్ మార్కెట్‌లో బియ్యం ధరలకు, రిటైల్ ధరలకు పొంతన ఉండడం లేదు. గ్రేటర్ పరిధిలో 250 రైస్‌మిల్లర్లు ఉన్నట్లు అంచనా. ప్రతి సంవత్సరం ఒక్కో మిల్లర్ వద్ద 50 నుంచి 60 టన్నుల బియ్యం నిల్వలు పెరుగుతున్నట్లు పౌరసరఫరాల వద్ద లెక్కలు ఉన్నట్లు సమాచారం. గ్రేటర్‌లో రోజుకు 40 నుంచి 50 వేల క్వింటాళ్ల బియ్యం వినియోగమవుతున్నట్లు అధికారుల అంచనా. గతంతో పోలిస్తే రోజుకు 5–7 వేల క్వింటాళ్ల బియ్యం నగరంలో వినియోగవుతోంది. ప్రస్తుతం మిల్లర్ ధర క్వింటాల్‌కు రూ.4,200 నుంచి 4,800 పలుకుతోంది. మార్కెట్‌కు చేరిన తర్వాత రిటైల్ వ్యాపారులు చెప్పిందే ధర. ప్రస్తుతం పాత సన్నబియ్యం ఫైన్ క్వాలిటీ అయితే క్వింటాల్‌కు రూ.5,000 నుంచి 5,500 చేరింది.
- గ్రేటర్ పరిధిలోని రిటైల్ వ్యాపారులు బియ్యం ధరలను విపరీతంగా పెంచి అమ్ముతున్నారు. చిన్నాచితకా కిరాణా వ్యాపారులు కూడా ఇష్టం వచ్చినట్టుగా ధరలు పెంచి విక్రయిస్తున్నారు. గత ఏడాది క్వింటాల్ సన్న బియ్యం ధర రూ.5200 పలకగా.. ప్రస్తుతం రూ.8,00 వరకు పెంచి అమ్ముతున్నారు. దీంతో జీఎస్టీ పరిధిలోంచి బియ్యాన్ని తొలగించినా కూడా సామాన్యులకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది.

కిలో బియ్యం ఇలా..

	గతేడాది	ప్రస్తుతం
బీపీటీ	రూ.52	రూ. 62
హెచ్‌ఎంటీ	రూ.48	రూ. 58
సోనా మసూరీ	రూ. 56	రూ. 62
బాస్మతి	రూ. 90	రూ. 120

బెట్టింగ్‌కు ఫిట్టింగ్!



- పందెం కాసినవాళ్లూ నిందితులే!!
- ఇప్పటి వరకు కేవలం అంగీకరించిన వారే అరెస్టు
- ఇకపై పంటర్లపైనా చర్యలకు పోలీసులు సిద్ధం
- ఈ దందాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు

సాక్షి, హైదరాబాద్: గతంలో ఎన్నడూ లేని ఉత్కంఠ మధ్య పూర్తయిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలోనూ బెట్టింగులు జోరుగా సాగాయి. కేవలం రాష్ట్రానికి చెందిన వారే కాకుండా పొరుగు రాష్ట్రాల బుకీలు, పంటర్లు రంగంలోకి దిగుతున్నారు. వీటి కట్టడి చేయడం కోసం పోలీసులు ఓ కీలక చర్య తీసుకోవాలని యోచిస్తున్నారు. ఇప్పటి వరకు బుకీలపై (పందేలు అంగీకరించే వారు) మాత్రమే నమోదు చేస్తున్న కేసుల్లో ఇకపై పంటర్లనూ (పందేలు కాసే వ్యక్తులు) నిందితులుగా చేర్చాలని యోచిస్తున్నారు. దీనికి చట్టంలో ఉన్న వెసులుబాటుపై అధ్యయనం చేయనున్నారు.

ఇక్కడ పట్టు బిగిస్తే అక్కడకు...

ఎన్నికలు కావచ్చు క్రికెట్ సహా ఇతర క్రీడలు కావచ్చు బుకీలకు–పంటర్లకు మధ్య అవినాభావ సంబంధం ఉంటోంది. ఈ జూదం నమ్మకం మీద సాగిపోయేది కావడంతో పరిచయస్తులే ఎక్కువగా ఉంటారు. కొత్తగా బుకీలుగా మారే వారు సైతం గతంలో ప్రధాన బుకీల వద్ద పని చేసిన వారై ఉంటారు. వీళ్లు తమ యజమానికి చెందిన కస్టమర్లలో కొందరిని తమ వైపు లాక్కుంటారు. వీరి ద్వారా పరిచయమైన వారినే కొత్త కస్టమర్లుగా చేసుకుంటారు. ఈ నేపథ్యంలోనే సిటీలో పోలీసులు ఉక్కుపాదం మోపితే బయటి నగరాలు/రాష్ట్రాలకు వెళ్లిపోతున్న బుకీలు తమ రెగ్యులర్ పంటర్ల సాయంతో యథేచ్ఛగా 'ఆన్‌లైన్ దందా' చేసేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పంటర్లకు చెక్ చెబితే తప్ప బెట్టింగ్ దందాను పూర్తి స్థాయిలో కట్టడి చేయడం సాధ్యం కాదని పోలీసుల నిర్ణయించారు. పందెం కాసేవాళ్లే లేకపోతే అంగీకరించే వారూ ఉండరని భావిస్తున్నారు. దీనికోసం కొన్ని కఠిన చర్యలు తీసుకోవాలని యోచిస్తున్నారు.

పక్కాగా దొరుకుతున్న ఆధారాలు...

బెట్టింగ్ ముఠాలను టాస్క్‌ఫోర్స్, స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్వోటీ) బృందాలతో పాటు స్థానిక పోలీసులూ పట్టుకుంటున్నారు. ఇలాంటి ముఠాలు/వ్యక్తుల నుంచి పోలీసులు నగదుతో పాటు టీవీలు, సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్స్, బెట్టింగ్ స్లిప్స్, పుస్తకాలు తదితరాలు స్వాధీనం చేసుకుంటారు. కొన్ని సందర్భాల్లో అధికారులు కొన్ని రికార్డులూ గుర్తిస్తుంటారు. వీటిలో నిందితులు తమ వద్ద పందేలు కాసిన వారి పేర్లు, ఫోన్ నంబర్లతో పాటు వారు దేనిపై, ఎంత మొత్తం పందెం కాశారనేది నమోదు చేసి ఉంచుతారు. పంటర్ల వద్ద దొరికిన ల్యాప్‌టాప్స్ విశ్లేషిస్తే మరికొందరు పంటర్ల పేర్లూ బయటి వస్తాయి. ఓ బుకీని అరెస్టు చేస్తే పంటర్లు మరో బుకీ వద్ద పందేలు కాసే అవకాశం ఉందని భావించిన పోలీసులు పంటర్ల పైనా కఠిన చర్యలకు నిర్ణయించారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న రికార్డుల్నే ఆధారంగా చేసుకుని పంటర్లనూ నిందితులుగా చేర్చాలని యోచిస్తున్నారు.

నోటీసుల జారీకి అవకాశం..

- క్రికెట్ మ్యాచ్‌ల నేపథ్యంలో పందేలు కాసే వారిలో యువతే ఎక్కువగా ఉంటున్నారు. వీరి బెట్టింగులకు బానిసలుగా మారారనే విషయం అనేక మంది తల్లిదండ్రులకు తెలియదు. వీరిని కట్టడి చేస్తేనే బుకీలకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న పోలీసులు పంటర్లనూ నిందితుల జాబితాలో చేర్చాలని భావిస్తున్నారు. వీరిని అరెస్టు చేసే ఆస్కారం లేకపోయినా నోటీసులు పంపాలని యోచిస్తున్నారు. ఫోన్ నంబర్ల ఆధారంగా చిరునామాలు గుర్తించి, సీఆర్‌పీసీ 41 ఏ కింద నోటీసులు జారీ చేయడానికి అవకాశాలు పరిశీలిస్తున్నారు.
- ఫలితంగా కుటుంబీకులకూ వీరు పంటర్లనే విషయం తెలియడంతో పాటు వీరి ఆగడాలకు అడ్డుపడే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు. ఓ అధికారి 'సాక్షి'తో మాట్లాడుతూ... 'పందేలు కాసే వారు ఉన్నంత కాలం బుకీలు పుట్టుకు వస్తూనే ఉంటారు. నగరంలో దాడులు ముమ్మరం చేస్తే గోవా, ముంబై వంటి ప్రాంతాలకు వెళ్లి వ్యవస్థీకృతంగా వ్యవహారం నడుపుతున్నారు. పంటర్లను కట్టడి చేస్తే బుకీల వ్యవహారాలకు అడ్డుకట్ట పడుతుంది. అందుకే కొన్ని కఠిన చర్యలు తీసుకోవాలని యోచిస్తున్నాం' అని అన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.